ఓం - అంఆ

పంచదశి

- (భాగవతధార)

జిల్లెళ్ళమూడి అమ్మను గురించిన వ్యాసముల సంకలనము



బొప్పూడి రామబ్రహ్మము

పంచదశి

భాగవత ధార

......జిల్లెళ్లమూడి అమ్మను గురించిన

వ్యాసముల సంకలనము ......

బొప్పూడి రామబ్రహ్మము

ముద్రణ
శ్రీతారణనామ సంవత్సర -
చైత్ర శుద్ధ ఏకాదశి
ఏప్రియల్ - 2004

ప్రతులు 1500
సర్వస్వామ్య సంకలితము

మూల్యం రు. 25/-

ప్రతులకు
బి. రామబ్రహ్మాము
ఇంటి నెం. 10-120
తులసీనగర్
విజయవాడ - 520007
ఫోన్ : 0866-2552871

డి.టి.పి మరియు ముద్రణ
ముముక్షువు ప్రెస్
పెదముత్తేవి - 521 136
కృష్ణాజిల్లా
✆ 08671-256270

విషయానుక్రమణిక

ఓం

అం ఆ

అంకితము !

అక్షరస్వభావాన్ని అమ్మ స్వరూపాన్ని తెలియచేసి
సర్వమూ వాసుదేవమయమని
తెలియచెప్పిన గురుదేవులు
శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులకు !

ప్రేమను పంచి 'అంతా అదే' అని
సర్వమునూ బిడ్డలుగా ప్రేమించి
ప్రేమించటమెలాగో నేర్పిన
మాతృశ్రీ అనసూయామాతకు !

అమ్మా !

ఈ వస్తువు నీది ! నీకే సమర్పణ !
నేను నీవాడను ! ఇది నీకే !

బిడ్డ
రామబ్రహ్మము.





మాతృశ్రీ అనసూయ మహాదేవి



శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు

ఓం

అం ఆ

అందరూ మహానుభావులే

చదువుకున్నది గణిత శాస్త్రం. ఉద్యోగం చేసింది బ్యాంకులో. నాకు తెలుగు వచ్చింది అంతంత మాత్రమే. సంస్కృతంలో ప్రవేశమూ లేదు. రచనా వ్యాసంగం అలవాటు అసలే లేదు.

ఒకరోజు జిల్లెళ్లమూడి వెళ్ళినప్పుడు శ్రీకొండముది రామకృష్ణ అన్నయ్య నన్ను ' లలితా సహస్రనామములు - మాతృతత్త్వము' అనే విషయంపై జిల్లెళ్లమూడిలో జరగబోయే 'కార్యశీల చర్చాగోష్ఠి'(వర్క్‌షాప్)లో పాల్గొని వ్యాసాన్ని చదవాలి అన్నారు. 'నావలన కాదు' అని కాళ్ళా వేళ్ళా పడి బతిమాలాను. ప్రక్కనే ఉన్న శ్రీ త్రిలోక అప్పారావు అన్నయ్య కూడా రామకృష్ణ అన్నయ్య ప్రతిపాదనను సమర్థించి, నన్ను ఆ వ్యాసాన్ని తయారు చేయమని ప్రోత్సహించారు. ఇక నాకు ఏమి చేయాలో తోచక, వారిపైన ఉన్న గౌరవంతో 'సరే' అన్నాను. లలితా సహస్రనామాలను శ్రద్ధా భక్తులతో అధ్యయనం చేశాను. అమ్మ తత్త్వమేమిటని విచారణ ప్రారంభించాను. భాష రాదు. భావమున్నా చెప్పలేను. లెక్కలను అధ్యయనం చేయటంవలన ముక్కుసూటిగా చెప్పడమే గాని, ఉత్ప్రేక్షలనూ, ఉపమానాలనూ ఉపయోగించి చెప్పటం చేతకాదు. ఆ ప్రయత్నంలోనుంచి ఉద్భవించిన మొదటి వ్యాసం – "లలితా సహస్రనామములు - మాతృతత్త్వము". ఈ వ్యాసాన్ని చూసిన మా గురుపుత్రులు, గురుతుల్యులు, పెదముత్తేవి-శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతులు- శ్రీముత్తేవి సీతారాంగారు సహృదయంతో వ్యాసం బాగుందని 'ముముక్షువు' మాసపత్రికలో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని చదివిన శ్రీ ధర్మసూరి అన్నయ్య సహస్రఘట క్షీరాభిషేక

మహోత్సవ సందర్భంగా దిన పత్రికలలో ప్రకటించే నిమిత్తం ఒక వ్యాసాన్ని వ్రాయమని చాలా ఒత్తిడి తెచ్చారు. ఆ విధంగా 'వార్త' దినపత్రికలో 'ప్రేమమయి - జిల్లెళ్లమూడి అమ్మ' అనే వ్యాసం వచ్చింది.

గురువర్యులు శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు హైదరాబాదు వచ్చినప్పుడు నాకు భాగవతంలో ఉన్న సంశయాలు తీర్చుకొనటంకోసం, నా అవగాహన సరిగా ఉన్నదీ లేనిదీ సరిచూచుకోవటంకోసం వారితో సుదీర్ఘ చర్చలు జరపటం చూచి, హైకోర్టు ఎడ్వకేట్ శ్రీఎమ్.వి.సుబ్బారావుగారు ఈ భాగవతధారను కాగితంపై పెట్టమని కనిపించిన ప్రతిసారీ నన్ను వెంటాడుతూ ప్రోత్సహించారు. నేను నాకోసం చదువుకుని ఆనందించటమే గానీ, కాగితంపై పెట్టే ధైర్యం లేదు.

ఐతే రెండు సంవత్సరాల క్రితం U.K వెళ్ళినప్పుడు 'మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు', 'అమ్మ-అమ్మ వాక్యాలు(అ.ఆ.వా)', 'అమ్మతో సంభాషణలు', 'మాతృసంహిత' మరియు 'భగవద్గీత' నావెంట తీసుకొని వెళ్ళాను. నాలుగు నెలలు ఇంటిలో తీరికగా ఉన్నందున అధ్యయనం చేసే అవకాశం కలిగింది. నాకు కలిగిన అభిప్రాయాలను మననం చేసుకున్నాను. అమ్మ మాటలకూ, భగవద్గీతకూ, భాగవతానికీ, మరియూ లలితా సహస్రనామాలకూ ఒక సమన్వయ దృష్టితో చేసిన చిరు ప్రయత్నం వలన ఈ పుస్తకంలోని వ్యాసాలు వెలువడినాయి. నేను నాతృప్తికోసం వ్రాసుకున్నాను. ఈ వ్యాసాలను చదివిన కొందరు సోదర సోదరీమణులు పుస్తకరూపంగా ప్రచురించమని కోరారు. దాని ఫలితమే ఈ గ్రంథం. ఈ గ్రంథాన్ని గురించి రెండు మాటలు : భాషను ప్రధానంగా చూడవద్దు, భావాన్ని సహృదయంతో స్వీకరించండి. అమ్మను గురించి వర్ణించడం ఎవరి తరం ? ఆ వేదాలే వెనుకాడినాయి - 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అనికదా ! ఇక అల్పజ్ఞుడైన నేనెంతవాడిని అమ్మగురించి చెప్పడానికి ? ఇది అమ్మను గురించి సహస్రాంశంకూడా కాదు.

మీకు మీ సాధనలో ఏమాత్రం ప్రయోజనం కలిగినా, నా ఈ ప్రయత్నం సఫలీకృతమైనట్లే భావిస్తాను.

ఈ వ్యాసములు ఈ రూపంగా రావడానికి ఎందరో మహానుభావులు ఉపయోగపడ్డారు. అందరికీ వందనాలు. ఈ వ్యాసాలు వ్రాయడంలో నాకు సహకరించిన డా॥శ్రీమతి యు.వరలక్ష్మికీ, శ్రీమల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తికీ, డా॥ పి.ఝాన్సీలక్ష్మీబాయికీ ముఖ్యంగా చాలా అభివందనములు; నా కృతజ్ఞతాంజలులు.

పుస్తకాన్ని గురించి అభిప్రాయముల నివ్వమని అడగగానే అందించిన సోదరసోదరీమణులకు కృతజ్ఞతలు. పెదముత్తేవి-శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతులు శ్రీముత్తేవి సీతారాంగారు ఎంతో ప్రేమతో పుస్తకాన్ని ముముక్షువు ప్రెస్ లో చక్కగా ముద్రించి అందజేసినందుకు కృతజ్ఞతలు. ఇక డి.టి.పి చేయటంలోనూ, ముద్రణలోనూ అత్యంత శ్రద్ధతో సహకరించిన ముముక్షువు ముద్రణాలయ సోదరబృందమునకు నా ప్రేమపూర్వక ఆశీస్సులు. ముఖచిత్రమును సుందరంగా తీర్చిదిద్దిన చి॥శ్రీకె. శివరామసుబ్బారావు (శివ) కు శుభాశీస్సులు.

ఇట్లు
అమ్మ సేవలో సోదరుడు
బొప్పూడి రామబ్రహ్మము

ఓం నమశ్శ్రీ సీతారామ లక్ష్మణయతీంద్రాయ !

ముముక్షుజన మహాపీఠము

శ్రీకృష్ణాశ్రమము,
పెదముత్తేవి,
మొవ్వమండలం,
కృష్ణాజిల్లా - 521136

పంచదశి

రచనలు రెండువిధాలు - మనం చేసేవీ, మనద్వారా వచ్చేవీ.

మనం చేసిన రచనలు పౌరుషేయములు అనీ, మనద్వారా వచ్చే రచనలు అపౌరుషేయములు అనీ పెద్దల నిర్ణయం.

"పంచదశి" శ్రీరామబ్రహ్మంగారిద్వారా వచ్చిన రచన.

ధర్మసంస్థాపనకై భగవానుడు దేశదేశములలో కాలకాలములలో అనంతములైన అవతారాలను స్వీకరిస్తాడు.

అట్టి అపురూపమైన అవతారమూర్తులలో అమ్మ - జిల్లెళ్ళమూడి - ఒకరు.

అమ్మ ముద్దుబిడ్డలలో సోదరులు శ్రీరామబ్రహ్మంగారు ఒకరు.

అమ్మ మారురూపంగా ముముక్షుజన మహాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీలక్ష్మణ యతీంద్రగురుదేవులను సంభావించిన ఆదర్శసాధకులు శ్రీరామబ్రహ్మంగారు.

ఆంధ్రాబ్యాంకులో వివిధ స్థాయులలో పనిచేసిన శ్రీరామబ్రహ్మంగారు యోగజీవితమూ, 'ఉద్యోగ'జీవితమూ ఒక్కటే అనే ఆదర్శాన్ని ఆచరణలో నిరూపించిన కర్మయోగి.

అమ్మను గురించిన శ్రీరామబ్రహ్మంగారి భావమూ, అనుభవమూ అక్షరరూపం ధరించి "పంచదశి" గా రూపుదిద్దుకున్నాయి.

ఇందులోని ప్రతి అక్షరమూ శ్రీరామబ్రహ్మంగారి గుండెలోతులలోనుండి వచ్చినదే అనే సత్యం 'పంచదశి' పాఠకులకు వేరే చెప్పనక్కరలేదు.

అమ్మ తత్త్వాన్ని అర్థంచేసుకోవటంలోనూ, అమ్మ కల్యాణగుణాలను మనలోకి ఆవిష్కరింపచేసుకొనటంలోనూ సాధకులకు 'పంచదశి' కరదీపికగా ఉపయోగపడుతుంది.

త్వరలో 'షోడశి'తో అమ్మ శ్రీపదార్చన చేసే భాగ్యాన్ని సోదరులు శ్రీరామబ్రహ్మంగారికీ, ఆ ప్రయోజనం పొందే అదృష్టాన్ని మనకూ అనుగ్రహించవలసినదిగా అమ్మ శ్రీపాదాల మ్రోల ప్రణమిల్లుతూ అర్థిస్తున్నాను.

ఇతి శమ్ !

శ్రీతారణ :
శ్రీచైత్రశుద్ధనవమి :
శ్రీరామనవమి : మంగళవారం,
30-3-2004.

ముత్తీవి సీతారాం
వాసుదేవ !!

."పంచదశి"– "క్షణవీక్షణ"

తూనుగుంట్ల త్రిలోక అప్పారావు, 25-3-2004
రామచంద్రరావు పేట,
ఏలూరు.

శ్రీవిద్యోపాసకులకు "పంచదశి" మంత్రము ఎటువంటిదో సాధకులకు ఈ "పంచదశి" పుస్తకం అటువంటిది. అది మంత్రం- ఇది అనుష్ఠానము. వ్యాసకర్త అన్నయ్యను గూర్చి ఒకమాట- రామబ్రహ్మం అన్నయ్యగారు లలితహృదయులే కాదు, భాగవతోత్తములునూ.

సర్వవ్యాప్తమైన శక్తి రూపుదాల్చి జిల్లెళ్లమూడిలో విరాజమానమై ఉన్నదనీ, అమ్మకూ,లలితకూ భేదంలేదనీ, తత్త్వ లావణ్యా స్వరూప స్వభావములలో సామ్యం ఉన్నదనీ తెలుపుతూ, "లలితా సహస్రనామములు – మాతృతత్త్వము" శీర్షికలో తల్లి లక్షణాలయిన రక్షణ పోషణలను తెలియజేస్తూ, తల్లికి తప్పే కనిపించదు అని ఆధ్యాత్మికంగా తన బిడ్డలైన మనలను అమ్మ ఏవిధంగా తీర్చి దిద్దుతుందో వివరిస్తూ, అమ్మ అనురాగం – ఆదరణ ఇట్టిది అని నిరూపించారు.

'తల్లిహృదయం' శీర్షిక ఈ 'పంచదశి' కి కేంద్రబిందువు. అమ్మ త్యాగమూర్తి, సేవాతత్పర. సంరక్షకురాలుగా బిడ్డలను గూర్చి అమ్మ పడే తపన అమ్మ చరిత్రలోనుండి పాఠకులు ఎలా అందుకోవాలో చెప్పారు.

అసూయత్వం అంటే ఏమిటో, అనసూయ తత్త్వం ఏమిటో హృదయాన్ని స్పందింపజేస్తూ, దాని ప్రయోజనాన్ని విశదీకరించారు.

అమ్మ చెప్పిన సహజ సహనమును గూర్చి వివరిస్తూ

ఆదిశంకరులు చెప్పిన వివరణను అందిస్తూ, ముందుకు సాగి ఆమూలాగ్రం ఈ పుస్తకాన్ని పఠించాలనే కోరికను పాఠకులకు రేకెత్తించుతూ భగవద్గీతకూ, భాగవతమునకూ, అమ్మ జీవితానికీ సమన్వయం ఏమిటో చూపించారు.

మానవుడు పుట్టిననాటినుండి గిట్టేవరకూ ఆచరించవలసిన విధివిధానాలు, సమాజం ఎలా నడిస్తే మానవ ధర్మం పరిపుష్టమవుతుందో, పరిపూర్ణమవుతుందో వివరించారు. ఆహారం,ఆరోగ్యం,విద్య, ఆదరణ, ఆలయం అనే ఈ సంస్థలను గూర్చిన పూర్తి ఆశయాలు ఆచరణ, విధివిధానాలు పూర్తిగా తెలియజేశారు.

ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న సమస్యలకు అమ్మ ఇచ్చిన సూచనలు : 'తల్లితండ్రులకు-బిడ్డలకు', 'భార్యకు-భర్తకు', 'ఉద్యోగికి-అధికారికి', 'రోగికి-వైద్యునికి' - ఇంతెందుకు ! సహజీవనంలో పరస్పరం ఉండవలసిన అనుబంధాలకు సంబంధించిన సమగ్ర పరిష్కారం ఏమిటో అమ్మ సూచించి, ఆచరించి, ఆచరింపజేసిన విషయాలను పరిపూర్ణంగా విశదీకరించారు. విద్యాలయం, వైద్యాలయం, అన్నపూర్ణాలయం, ఆదరణాలయం, దేవాలయం- ఇవి అన్నీ సమానమేననీ, అమ్మ సమాజానికి నడక నేర్పారనీ చెప్పారు.

పదిమందితో కలసి పనిచేయటం, పదిమందికోసం పనిచేయటం అనీ, మమకారాన్ని చంపుకోవడం గాక, పెంచుకొని విస్తృతం చేసుకోవటమే, మానవుడు మాధవుడుగా మారటానికి మంచిమార్గం, సులభమార్గం అనీ అన్నారు అమ్మ అంటూ, అందరిలోనున్న ఈశత్వమును చూడక చేసే పూజలూ వ్రతాలూ భస్మహవ్యములని,కపిలమహర్షి చేసిన ఉపదేశమును, కలసి పనిచేయటంలో నిర్మమత్వం, నిరహంకారం కలుగుతాయని గీతలో భగవానుడు చెప్పిన స్థితప్రజ్ఞ లక్షణాలకు ముడిపెట్టి, పూర్తి అవగాహనతో దర్పణంలో చూపించినట్లు వివరించారు.

'కలౌ కేశవకీర్తనాత్' అన్న అంశాన్ని ఉటంకిస్తూ, మోక్షసాధనలో

భక్తికి మించినది లేదంటూ, 'నామము-నామి' వేరుకాదన్న అంశానికి పెద్దపీట వేశారు.

బాధకు,సుఖానికి నిర్వచనాలనందిస్తూ, బాధలనతిక్రమించి, సుఖాలను పొందే మార్గాన్ని అమ్మ మాటలలో విపులంగా చెప్పారు.

'కైవల్యప్రాప్తికి మార్గం', 'వైకల్యం లేనిదే కైవల్యం' అంటూ పతంజలి చెప్పిన 'కైవల్యం స్వరూప ప్రతిష్ఠ' అనే అంశాన్ని ఉదాహరించి స్వరూప దర్శనమే కైవల్యం గానీ, భగవంతుని దర్శనం మాత్రమే కైవల్యం కాదని అంటూ, ధ్రువుని, ప్రహ్లాదుని దృష్టాంతాలు చెపుతూ, ఈ దైవదర్శనాలు కేవలం భగవదనుభూతియే అని వివరించారు.

'గడ్డిపెడతారా' అన్న శీర్షికలో ఈ జగత్తంతా నిండియున్న పరమాత్మ స్వరూపమేనని తెలియడమేనని వివరించారు.

చివరి శీర్షికలో 'స్థాలీపులాకన్యాయంగా' పై అన్ని శీర్షికల్లోని అంశాలనూ చెప్పారు రామబ్రహ్మం అన్నయ్యగారు.

ఈయనకు కర్తవ్య నిష్ఠయేగానీ, కర్తృత్వ భావన లేదు. త్రికరణశుద్ధియేగాని, డంబాచారం లేదు. భగవద్భక్తి సేవాసక్తియే గాని విషయాసక్తి లేదు. కర్మ - భక్తి - జ్ఞానయోగాలు ముప్పిరిగొన్నవారు బొప్పూడివారు - ఆదర్శమూర్తి - అమ్మ అనుంగు బిడ్డ !

త్రిలోక అప్పారావు.

బులుసు లక్ష్మీప్రసన్న
సత్యనారాయణశాస్త్రి,
కాకినాడ.

స్థలము:జిల్లెళ్లమూడి
శ్రీస్వభానునామ సంవత్సర
ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ.
6-3-2004.

ఆకాంక్ష

సతత బ్రహ్మానుచింతనతో విలసిల్లిన శ్రీవిద్యారణ్యస్వామివారి లేఖినినుండి 'వేదాంత పంచదశి' వెలువడింది. ఇప్పుడు, ఈ 'పంచదశి' సతతం అమ్మ అనుచింతనతో విలసిల్లే సోదరులు శ్రీబొప్పూడి రామబ్రహ్మంగారి లేఖినినుండి వెలువడింది.

జిల్లెళ్లమూడి అమ్మ ముఖతః వెలువడిన ఆణిముత్యాలకూ, పద్మనాభుని ముఖతః వెలువడిన గీతావాక్యాలకూ, వ్యాసభగవానుని ముఖతః వెలువడిన భాగవతధర్మాలకూ, వశిన్యాదిదేవతల వచస్సులైన శ్రీలలితా పరాభట్టారికా సహస్రనామాలకూ ఏకవాక్యత అనుసంధించారు శ్రీరామబ్రహ్మంగారు ఈ పంచదశిలో.

మనలో -

"రెండు తెలియనితనాలు,
నిద్రలోకి ఎలా జారుకుంటామో !
నిద్రనుండీ ఎలా విడివడతామో !
ఎంత తెలియనితనం ఉందీ !
("నేను నిద్రపోతున్నాను" అనే నా కవితనుండి)

అమ్మ నామములలో ఒకనామం -

"జాగ్రత్స్వప్నసుషుప్తీనాం సాక్షీభూత్యై నమో నమః"

"జాగ్రన్నిద్రాంతః పరిజ్ఞానేన బ్రహ్మవిద్భవతి" అని మండల బ్రాహ్మణోపనిషత్తు ప్రవచించింది.

తెలివితో లోపలికి పడలేక, బయటపడి అలమటించే అవిద్యాసర్పదష్టులమైన మనలను "పశ్వాదిభిశ్చా౽విశేషాత్" పశువులకంటే ఏమి విశేషం?- అని శ్రీశంకరులు సుతిమెత్తగా చివాట్లు వేశారు- తమ అధ్యాస భాష్యంలో(బ్రహ్మసూత్రభాష్య ఉపోద్ఘాతంలో).

"అక్షిదర్శన జన్య జ్ఞానమేపాటిదో
సాక్షిచైతన్య స్వరూపసిద్ధియందు"

అని 'సాక్షిచైతన్యస్వరూప సిద్ధి' అఖండంగా బడసిన అమ్మను వేడుకున్నాను నా 'పదార్చన'లో.

ఒకసారి అమ్మతో చర్చ సందర్భంలో 'నేను మనస్సుతో చూస్తాను' అని అమ్మ నాతో అన్నప్పుడు నాఒళ్ళు జలదరించింది, మనస్సు పులకరించింది. మనకు ఇంద్రియాలతోనే చూపు, తనకో- మనస్సు బాహ్యాభ్యంతర ఇంద్రియమైంది.

అమ్మ స్థితప్రజ్ఞ; స్థిరప్రజ్ఞ.

ఆంధ్రదేశంలో చాలాపూజామందిరాలలోనూ, చాలా పడక గదుల్లోనూ అమ్మ క్యాలండర్లు,బొమ్మలు వేలాడుతూ ఉండే రోజుల్లో, కొత్తగా పెళ్ళైన ఒక పుణ్యదంపతులు ఏకశయ్యాగతులవ్వాలనుకున్న తరుణంలో, గదిలోని అమ్మ క్యాలండర్‌ను వెనుకకు త్రిప్పి, కలుసుకొని, ఆనందించి తరువాత వారిరువురూ అమ్మ పాదాలచెంతకు వచ్చి పూజచేసుకుంటూఉంటే, "ఏమర్రా ! నా బొమ్మ వెనుకకు త్రిప్పితే నాకు కనిపించదనుకుంటారా ! మీరు కలుసుకోకపోతే నాసృష్టికార్యం ఆగిపోదూ !" అని అమ్మ అన్నప్పుడు,

ఆ దంపతులు ముదితవదనులై అమ్మపాదాలచెంత ముకుళించుకు పోయినప్పుడు "ధర్మాఽ విరుద్ధో భూతేషు కామోఽ స్మి భరతర్షభ" (గీత : 7-11) అన్న ఆ నల్లనయ్య వాక్యం చటుక్కున గుర్తుకు వస్తుంది. ఆ పుణ్యదంపతులకు బంగారాలవంటి పిల్లలు కలుగకుండా ఉంటారా !.

అట్టి ప్రజ్ఞాచక్షువును పట్టి చూపించారు శ్రీరామబ్రహ్మం అన్నయ్యగారు తమ 'పంచదశి'లో. అన్నయ్యగారు ధన్యులు. సతతం అమ్మ అనుచింతనం సర్వులకూ కలగాలని ఆకాంక్షిస్తూ....

బులుసు ఎల్ సత్యనారాయణశాస్త్రి

అమ్మ నామములలో ఒకనామం -

"జాగ్రత్స్వప్నసుషుప్తీనాం సాక్షీభూత్యై నమో నమః"

"జాగ్రన్నిద్రాంతః పరిజ్ఞానేన బ్రహ్మవిద్భవతి" అని మండల బ్రాహ్మణోపనిషత్తు ప్రవచించింది.

తెలివితో లోపలికి పడలేక, బయటపడి అలమటించే అవిద్యాసర్పదష్టులమైన మనలను "పశ్వాదిభిశ్చాఽ విశేషాత్" పశువులకంటే ఏమి విశేషం?- అని శ్రీశంకరులు సుతిమెత్తగా చివాట్లు వేశారు- తమ అధ్యాస భాష్యంలో(బ్రహ్మసూత్రభాష్య ఉపోద్ఘాతంలో).

"అక్షిదర్శన జన్య జ్ఞానమేపాటిదో
సాక్షిచైతన్య స్వరూపసిద్ధియందు"

అని 'సాక్షిచైతన్యస్వరూప సిద్ధి' అఖండంగా బడసిన అమ్మను వేడుకున్నాను నా 'పదార్చన'లో.

ఒకసారి అమ్మతో చర్చ సందర్భంలో 'నేను మనస్సుతో చూస్తాను' అని అమ్మ నాతో అన్నప్పుడు నాఒళ్ళు జలదరించింది, మనస్సు పులకరించింది. మనకు ఇంద్రియాలతోనే చూపు, తనకో- మనస్సు బాహ్యాభ్యంతర ఇంద్రియమైంది.

అమ్మ స్థితప్రజ్ఞ; స్థిరప్రజ్ఞ.

ఆంధ్రదేశంలో చాలాపూజామందిరాలలోనూ, చాలా పడక గదుల్లోనూ అమ్మ క్యాలండర్లు,బొమ్మలు వేలాడుతూ ఉండే రోజుల్లో, కొత్తగా పెళ్ళైన ఒక పుణ్యదంపతులు ఏకశయ్యాగతులవ్వాలనుకున్న తరుణంలో, గదిలోని అమ్మ క్యాలండర్‌ను వెనుకకు త్రిప్పి, కలుసుకొని, ఆనందించి తరువాత వారిరువురూ అమ్మ పాదాలచెంతకు వచ్చి పూజచేసుకుంటూఉంటే, "ఏమర్రా ! నా బొమ్మ వెనుకకు త్రిప్పితే నాకు కనిపించదనుకుంటారా ! మీరు కలుసుకోకపోతే నాసృష్టికార్యం ఆగిపోదూ !" అని అమ్మ అన్నప్పుడు,

ఆ దంపతులు ముదితవదనులై అమ్మపాదాలచెంత ముకుళించుకు పోయినప్పుడు "ధర్మాఽ విరుద్ధో భూతేషు కామోఽ స్మి భరతర్షభ" (గీత : 7-11) అన్న ఆ నల్లనయ్య వాక్యం చటుక్కున గుర్తుకు వస్తుంది. ఆ పుణ్యదంపతులకు బంగారాలవంటి పిల్లలు కలుగకుండా ఉంటారా !.

అట్టి ప్రజ్ఞాచక్షువును పట్టి చూపించారు శ్రీరామబ్రహ్మం అన్నయ్యగారు తమ 'పంచదశి'లో. అన్నయ్యగారు ధన్యులు. సతతం అమ్మ అనుచింతనం సర్వులకూ కలగాలని ఆకాంక్షిస్తూ....

బులుసు ఎల్ సత్యనారాయణశాస్త్రి

డా॥ శ్రీమతి యు.వరలక్ష్మి,
బాపట్ల

అక్షరయజ్ఞం

'పంచదశి' గ్రంథకర్త శ్రీబొప్పూడి రామబ్రహ్మంగారు మాతృశ్రీ కుటుంబంలోని సోదరీ సోదరులందరికీ చిరపరిచితులే. రెండున్నర దశాబ్దులుగా అమ్మ సేవలో పాలుపంచుకుంటున్నా, ఇటీవలి కాలంలో విశ్వజననీ పరిషత్ అధ్యక్షులుగా గురుతరమైన బాధ్యతను నిర్వహిస్తున్నారు. మూడున్నర దశాబ్దులపాటు ఆంధ్రాబ్యాంకులో విభిన్న భూమికలు నిర్వహించి ఎనలేని తనసేవలతో పలువురి ప్రశంసలు అందుకున్న అకలంక చరిత్ర వీరిది. తాను నమ్మిన నీతిని జీవనరీతిగా మలుచుకునే సమున్నత వ్యక్తిత్వం వీరి సొంతం. సంయమనం, సహనం, సౌమనస్యం ముమ్మూర్తులా మూర్తీభవించిన శ్రీరామబ్రహ్మంగారు మంచితనానికి మారుపేరు. పరిపాలనాదక్షతకు పెట్టింది పేరు. భిన్న మనస్తత్త్వాలకు సమన్వయ సూత్రం వీరి వ్యక్తిత్వం. అదే వీరి అజాతశత్రుత్వంలోని అసలు రహస్యం. ఆశయాలకు మాత్రమే పరిమితంకాని ఆచరణశీలం వీరి విజయ ప్రస్థానానికి శ్రీకారం. ఉద్యోగిగా, గృహస్థుగా బాధ్యతల బరువు తలకెత్తుకున్నా జనకమహారాజులా జీవన్ముక్తిని సాధించాలన్నంత అత్యాశ రామబ్రహ్మంగారిది.

ఈ స్వభావానికి తోడుగా ఏలూరు సోదరుల సత్సాంగత్యం, భాగవతపఠనం , భగవద్గీతా పారాయణం ముప్పేటలుగా అందించిన సంస్కారం శ్రీరామబ్రహ్మంగారి అంతరంగాన్ని ఆర్ద్రతకు నెలవుగా, భక్తిభావనకు కొలువుగా తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో అమ్మ సందర్శనం

తాను నమ్మిన సత్యాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించే స్థైర్యాన్ని, ధైర్యాన్ని ప్రసాదించింది. దాంతో నిరాడంబరతకు, నిజాయతీకి నిలువెత్తురూపంగా భాసించే వీరి వ్యక్తిత్వానికి కర్తవ్యమే దైవంగా ఆరాధించే మనస్తత్వం తోడై బంగారానికి పరిమళమబ్బినట్లైంది. కులాలకు, మతాలకు, గుణాలకు అతీతంగా అందరినీ కన్నబిడ్డలుగా ఆదరించే అమ్మ అవ్యాజ వాత్సల్యం అన్నయ్య మనస్సుపై చెరగని ముద్ర వేసింది. ఎన్ని పురాణాలు పఠించినా, ఉపనిషత్తులు పారాయణ చేసినా, అవి ఆదర్శాలను ప్రవచించగలవే గాని అనుభూతులను అందించలేవు. అలతి అలతి పదాలతో అనుభవాన్ని రంగరించిన అమ్మ వాక్యాలు, అన్నయ్య ఆలోచనాస్రవంతిని కొత్త పుంతలలో నడిపించాయి. పదవీ విరమణ తరువాత ఆలోచన నిరంతరం అదే యోచనగా మార్చుకునే అవకాశాన్ని,అదృష్టాన్ని అమ్మ అనుగ్రహించింది. కష్టంలో ఉన్నవారి కన్నీరు తుడిస్తే ఆ కళ్ళలో ప్రతిఫలించే వెలుగు జిలుగులు ఆ భగవంతుని దరహాసాలేనని కాయేన మనసా వచసా నమ్మారు. **సేవాభావం లేని ఆధ్యాత్మికత నీరులేని సరస్సులాంటిది** అని వీరి ప్రగాఢ విశ్వాసం.

త్రికరణాలలో మనస్సు ప్రధానమైనదైనా, అంతఃకరణానికి అద్దం పట్టి ఆచరణ దిశగా మరలించేది వాక్కు. శ్రోతలలో వినూత్నమైన ఉత్సాహాన్ని నింపి ఉద్యమశీలంగా రూపొందించే శక్తి మాటకు ఉన్నదని అందరికీ అనుభవంలో ఉన్న విషయమే. జిజ్ఞాసతో జీవిత పరమార్థంకోసం పరితపించిన రచయితలో, శోధనకు, సాధనకు మధ్య సాగిన అంతరంగ మథనం అక్షరరూపం దాల్చింది. రచయిత హృదయంలో అంతర్లయగా సాగే భావనావీచికలనుండి ఎగసిన శీకరాలే ఈ వ్యాసాలు. అంతరంగంలో సుడులు తిరిగే ఆలోచనాతరంగాలను ఎలా ఆవిష్కరించాలా ? తన ఎదలో అనుభవ సస్యం పండించిన ఫలాలను పాఠకులకు ఎలా అందించాలా ? తన అంతశ్చేతన దర్శించిన సత్యాన్ని ఎలా ప్రకటించాలా ? అని నిరంతరం తపించారు. అమ్మ సందేశాన్ని వేయి గొంతుకలు విచ్చి ఉద్ఘోషించాలనే రచయిత తపన తపస్సుగా ఫలించి ఈ రచనకు ప్రేరణగా నిలచింది.

నేను సైతం........

అమ్మ పదార్చనలో ఒక పువ్వునై పరిమళించాను !

నేను సైతం........

ఆ మమతల గర్భగుడిలో ఒక దివ్వెనై పరవశించాను !

అంటున్నది రచయిత అంతరాత్మ. పదిమంది మేలుకోరి పదిమందితో కలసి చేసే పని ఏదైనా అది యజ్ఞమే. రచయిత తన అనుభవాలే హవిస్సులుగా సాగించిన అక్షరయజ్ఞమిది. యజ్ఞకర్త్రి అమ్మ ! యజ్ఞఫలం మనందరిదీ !!

అంకెల గణింపులతో గుణింపులతో కొనసాగిన రామబ్రహ్మంగారి వృత్తిధర్మానికీ ఈ ప్రవృత్తిధర్మానికీ ఏమాత్రం సంబంధం లేదు. ఎదనిండా భావాల గుబాళింపుతప్ప, పదాల పోహళింపు రామబ్రహ్మంగారికి అలవాటులేని ఆపోశనమే. 'మూకం కరోతి వాచాలం' అన్న చందంగా, ఏనాడూ కలం పట్టని అన్నయ్యను రచయితగా మనముందు నిలబెట్టింది అమ్మ వైదగ్ధ్యం. కావ్యాలాపవినోదిని కదా అమ్మ ! వినోదాత్మకంగా సాగే ఈ విశ్లేషణ చూడండి. కస్తూరి పాత్రను ఎంతగా కడిగినా పరిమళం విడిపోనట్టు, రచయిత ఆంతరధర్మమైన శైలిలో వృత్తిలక్షణం వ్యక్తావ్యక్తంగా కనిపించకపోదు. విమర్శకపరిభాషలో 'కవి ఆత్మీయత' అంటే అదే. అసలు 'పంచదశి' అనే పేరు పెట్టడంలోనే ఒక ప్రత్యేకత కనిపిస్తున్నది. విశ్లేషణాత్మకంగా సమీకరణంలా సాగే రచయిత రచనావిన్యాసం చూస్తే వ్యాసానికి ఒక 'ఫార్ములా' ఉన్నదా అన్నట్లు తోచకమానదు.

Collection + Selection + Analysis - Discription

సేకరణ + సమీకరణ + విశ్లేషణ - వివరణ

ఇదంతా ప్రవృత్తిలో అంతర్వాహినిలా సాగే వృత్తిధర్మ ప్రభావం అనిపిస్తోంది కదూ !

సిద్ధాంత వ్యాసాల ఒరవడిలో సాగిన ఈ వ్యాస పరంపరను తార్కిక బుద్ధితో కాక, హృదయవాదంతో అనుశీలిస్తే, పూలలో దారంలా ఒక ఐక్యసూత్రం, గ్రథనకౌశలం పాఠకులకు స్ఫురిస్తాయి. మనిషిని మనీషిగా తీర్చిదిద్దే పరిణామక్రమం సోపానపరంపరలా ఇందులో దర్శనమిస్తుంది.

1. అమ్మను గురించి పరిచయ ప్రసంగంలా సాగేవి.
2. అమ్మ తత్త్వాన్ని విశ్లేషణాత్మకంగా వ్యాఖ్యానించేవి.
3. తాత్త్విక భూమికతో జీవితమే ఒక సాధనగా సమన్వయమార్గం చూపేవి.
4. మానవుడు మాధవుడు కావాలనుకుంటే ఇలా – అని మార్గదర్శనం చేసేవి.

ఏ తోటలోనో విరబూసిన అందమైన పూలను కసుగందకుండా, వసివాడకుండా, పరిమళం వీడకుండా ఏర్చి కూర్చి మాలాకారుడు భగవంతుని పదార్చనకు సమర్పించినట్లు, రచయిత ఎన్నో గ్రంథాలనుండీ అమూల్యమైన భావాలనూ అపూర్వ నిర్వచనాలనూ స్వీకరించి పాఠకుని ఎదముంగిట ముత్యాలముగ్గులు తీర్చి దిద్దారు. నదీమతల్లికి నదీజలాలతో అర్ఘ్యమిచ్చినట్లు, అమ్మ వాక్యాలతోనే మాతృతత్త్వాన్ని అందించారు. ఈ సేకరణలు స్వీకరణలు రచయిత ఆంతర సంస్కారానికి ప్రతీకలుగా అశేష శేముషీ వైభవానికి పతాకలుగా నిలుస్తాయి. జీవిత గమనంలో దిక్కుతోచక మనిషి కర్తవ్యం విస్మరించి స్థాణువులా నిలిచిపోయినప్పుడు, అణువణువునా చైతన్యాన్ని నింపే అమృతవాక్కులివి. దశదిశలా అలముకున్న అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే ఆర్ష విజ్ఞాన రోచిస్సులు అందించే మణిదివ్వెలు ఇవి. గ్రంథంలో గమనించండి:

తితిక్షా నిర్వచనం – వివేకచూడామణి (పుట: ~~38~~) 37
అనసూయతత్త్వం – అత్రిస్మృతి (పుట: ~~18~~) 33
కపిలుని ఉపదేశం – శ్రీమహాభాగవతం (పుట: 77)

ముద్దులుగారే భాగవత పద్యాలకూ, మహనీయుల వాక్యాలకూ

మన వివరణలతో పనేముంది ? అన్నట్లు వివరణజోలికి పోరు. మరీ తప్పదనిపిస్తే తాత్పర్యం వ్రాసి ఊరుకుంటారు. ఇంతకూ రచయిత ఆంతర్యం ఏమైఉంటుందా ? అని సమాలోచన సాగిస్తే, ఆ గ్రంథాలతో నిరంతర సాంగత్యంవల్ల ఆభావాలు తనవే అనిపించేటంతటి భావసారూప్యం ఒక కారణమైతే, కొన్ని సందర్భాలలో పాఠకుల సమాలోచనకే ఒదిలిపెట్టే రచనా పరిణతి మరొకకారణం కావచ్చు.

విష్ణునామ సంస్మరణంతో ప్రహ్లాదునిలో కలిగే తాదాత్మ్యమూ, అశేష జనావళి శ్రేయస్సు కోరి గుడి గోపురాన్ని ఎక్కి ఉద్ఘోషించిన రామానుజాచార్యులవారిలోని అభినివేశమూ రచయిత వ్యక్తిత్వంలో సంగమించి దర్శనమిస్తాయి. మణిపూసలలాంటి మాటలలో అమ్మ అందించిన అపూర్వసందేశం వేదంలా, హృదయనాదంలా ప్రతి మనిషి గుండెలలో ప్రతిధ్వనించాలనీ, మానవత్వం వేయి రేకులతో పరిమళించాలనీ మాటలతో వ్యక్తం చేయలేనంతటి తపన రచయిత మనస్సులో ఉంది. అందుకే 'పాడిన గీతమే మరల పాడెద' అని విశ్వనాథవారన్నట్లు, అమ్మ సందేశ సారాన్ని మరల మరల వినిపించారు. ఇది రచనలో పునరుక్తిగా కాక, కవితాధర్మంగా కవిహృదయనివేదనగా పాఠకులు స్వీకరించాలి. అక్షర యజ్ఞం సాగించిన శ్రీరామబ్రహ్మంగారికి అక్షరాభినందనలు అందిస్తూ

ఆత్మీయసోదరి

వరలక్ష్మి

డా॥ పి. ఝాన్సీలక్ష్మీబాయి, 25-3-2004.
(రీడరు-మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి)
జిల్లెళ్ళమూడి.

అనుభవం - అనుభావం.

లలిత హృదయులైన శ్రీరామబ్రహ్మం అన్నయ్య తన సాధనలో మొదటినుండీ అమ్మలో శ్రీలలితాపరమేశ్వరిని చూడటం, లలితా పరమేశ్వరిలో అమ్మను చూడటం అలవాటు చేసుకుంటూ క్రమంగా ఆ యిద్దరినీ ఒకరిగానే చూసే దశకు ఎదిగారు. ఇప్పుడు ఆ యిద్దరి అద్వైత మూర్తిలో తనను చూసుకొనే ప్రయత్నంలో 'స్వాత్మైవ లలితా ప్రోక్తా' 'అహమిత్యేవ విభావయే భవానీమ్' అనే ఋషివచనాన్ని బాగా అనుసంధానం చేస్తున్నారు. అందుకే తన మొదటి వ్యాసంలో వ్యాసుడు వశిన్యాది వాగ్దేవతల కంఠంతో తన కంఠం కలుపుతూ అమ్మని "శ్రీమాతా" "మాతా" "అంబా" "అంబికా" "బ్రహ్మాండజననీ" "ఆబ్రహ్మకీటజననీ" "సిద్ధమాతా" "విశ్వమాతా" అంటూ పలునామాలతో పిలుచుకున్నారు. తన గ్రంథం నిర్విఘ్నంగా పూర్తికావాలని, ఆ నామాల జపంతో తన గ్రంథం "మంగళాదీని మంగళాంతాని మంగళమధ్యాని ప్రథంతే" అని పెద్దలు చెప్పిన శైలిలో అమ్మ నామస్మరణతో ప్రారంభించుకున్నారు.

అన్నయ్య "పంచదశి" లో ఏ వ్యాసం తీసుకున్నా, అందులో వాస్తవికతా, తార్కికతా, తాత్త్వికతా - మూడుగుణాలూ ముప్పిరిగొని ఉంటాయి. 'మృత్యుంజయత్వమే అమృతత్త్వం' అనే వ్యాసంలో మరణాన్ని గూర్చిన మన భయానికి, మరణాన్నిగూర్చి అమ్మ చెప్పినమాటలలో ఉండే ఓదార్పుని ఎంతో చక్కగా చెప్పారు. పుట్టిన ప్రతివానికీ తన గిట్టడాన్ని

గూర్చి ఒకటే భయం. మరణభయాన్ని పోగొట్టడానికి మన మహర్షులు ఎంతో ప్రయత్నించారు. కఠోపనిషత్తులాంటి ఉపనిషత్తులలో ఎంతచెప్పినా మాటలు చెప్పటం వేరు; అనుభూతి అవటం వేరు. మాటలకూ అనుభూతికీ చాలా దూరం. మృత్యువును గూర్చి అమ్మ మాటల్లో ప్రస్తావిస్తూ అన్నయ్య "మృత్యుభయాన్ని పోగొట్టడమే మృత్యునివారణ" అని చెప్తూ, మృత్యువునుండి కలిగే అన్ని భయాలనూ పోగొడుతుంది కనుక అమ్మ "సర్వమృత్యునివారిణి" అయిందని స్పష్టపరిచారు. సత్యాన్వేషకులైన ఈ అన్నయ్య అమ్మ బాల్యంలోనే చెప్పిన మాటలను ఇలా ఉదాహరిస్తారు–"చచ్చిపోవటం అంటే శ్వాస ఆగిపోవడమా ?" అంటూ అమ్మ శ్వాసను నిలిపి సమాధి స్థితి పొంది మరలా మామూలు స్థితికి వచ్చేయటం గూర్చి ప్రస్తావించి, "శ్వాస ఆగటం చావుకాదు" అని అమ్మ చెప్పిన మంచిమాటలను మనకు అందించారు. మరణమును గురించి ఆధునిక విజ్ఞాన శాస్త్రం యొక్క ఆలోచనని మనముందుంచారు. భాగవతంలోని పద్యాలనుదాహరించి అమ్మ చెప్పిన మృత్యుంజయత్వాన్ని ఋషి వచనాలతో పోల్చి చూపించారు.

మనుషులమైన మనం కష్టాలకు భయపడుతూ, సుఖాలకై అఱ్ఱులు చాచుతూ ఉంటాం. చీకటి లేకపోతే వెలుగుయొక్క అనుభూతే లేనట్లు, ఆకలి లేకపోతే ఆహారం రుచే మనకందనట్లు, బాధలు లేకపోతే బ్రతుకుకి పరమార్థం ఉండదని, బాధలు లేని బ్రతుకు సంపూర్ణం కాదనే విషయాన్ని తన అనుభవంతో రంగరిస్తూ , 'సుఖానికి ఒకటే మార్గం' అనే వ్యాసంలో వివరించారు. ఆ శీర్షికలోని అమ్మ వాక్యాలు ఆబాలగోపాలాన్నీ అలరించేటట్లు ఇలా ఉదాహరించారు :

> "సుఖంగా బాధననుభవిస్తే బాధ బాధకాదుగా" అనీ,
> "మనసుకి బాధ అనుకుంటే ఉంది, లేదనుకుంటే లేదు" అనీ,
> "బాధలో ఉన్నంత ఏకాగ్రత సుఖంలో లేదేమో" అనీ,
> "బాధలు అనుభవిస్తున్నా అది బాధ అనిపించనప్పుడు సహజ సహనం అవుతుందనీ".

ప్రతీ శీర్షికలో అమ్మ చెప్పిన నిర్వచనాలూ, వాక్యాలూ చదువుతుంటే, అమ్మ సాహిత్యంమీద, అమ్మ సమతత్త్వం మీద అమ్మ సమగ్రతమీద, ఈ అన్నయ్యకున్న అవగాహన వ్యక్తమౌతుంది. అమ్మ చెప్పిన, అమ్మను గురించి చెప్పిన మంచి మాటలు మూటలు కట్టుకొని హృదయ కమలంలో దాచిఉంచుకున్నారనేది ఆ అన్నయ్య చెప్పకనే మనకు తెలిసే సత్యం.

సృష్టిలో ప్రతి ఒక్కరూ అనుసరించి తీరవలసినది అనసూయత్వం అదే అసూయరహితత్వం. దానిని తన ఆచరణద్వారా అందించాలనేది అమ్మ లక్ష్యం. అసూయ,మాత్సర్యం ఈ రెండూ అతి ప్రమాదకరమైన ఇరుగు పొరుగుగా ఉండే గుణాలు. అమ్మ అవతారతత్త్వం, శ్రీవ్యాసుని భాగవతతత్త్వం ఈ అనసూయత్వమే. భాగవత ప్రారంభంలోనే వ్యాసుడు తన లక్ష్యం చెబుతూ

"..................................నిర్మత్సరాణాం సతాం
వేద్యం వాస్తవ మత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనం"

అనిఅంటూ, నిర్మత్సరులూ,మాత్సర్య గుణరహితులూ ఈ గ్రంథాన్ని ఆస్వాదించి ఆహ్లాదం పొందుతారంటాడు. మాత్సర్యమును జయించాలని పరోక్షంగా చెప్పాడు. అమ్మలోని ఏ విశిష్ట లక్షణాన్ని అయినా అన్నయ్య అమ్మ మాటలతో, అమ్మ ఆచరణతో చూపించి మరల ఋషివచనాలతో దాన్ని సమన్వయం పరుస్తాడు. అమ్మలోని అనసూయత్వాన్ని, అనసూయతత్త్వం అనే శీర్షికలో చెపుతూ, నిత్యం మనం పారాయణ చేయవలసినంత గంభీరమైన శ్లోకాన్ని 'అత్రి స్మృతి' అనే ప్రమాణ గ్రంథంనుండీ గ్రహించి ఇలా మనకందించారు.

"నగుణాన్ గుణినో హంతి స్తౌతి మందగుణానపి ।
నాన్యదోషేషు రమతే సా అనసూయా ప్రకీర్తితా ॥"

అని గుణవంతుని గుణములలో దోషములను వెదకకుండుట, తోటివారి స్వల్ప గుణాలను కూడా గొప్పగా భావించి పొగడుట, ఇతరులలోని

దోషములను చూచి ఆనందించకుండుట. ఈస్వభావాన్ని అనసూయత్వం అంటారు. ఇందులో ఏ ఒక్క లక్షణం అనుసరించినా, తరించవచ్చునేదే అమ్మ ఒరవడి. అమ్మలోని ఈ గుణం అన్నయ్యను బాగా ప్రభావితం చేసింది. మనలో ఒక తత్త్వం కొంత లోతుగా ఉంటేనే ఆ గుణం చూసినప్పుడు ఆ హృదయం పొంగటం జరుగుతుంది. ఈ అన్నయ్య మాటలలో చేతలలో నడవడిలో కూడా పై అమ్మ అనుసూయత్వగుణం అనుసరించాలనే తీవ్ర తపన కనిపిస్తుంది.

అన్నయ్య రచన తరువాత, అన్నయ్యను గూర్చి నాలుగు మాటలు: నా విద్యార్థి దశనుండీ 1974-75 నుండీ, అమ్మసేవలలో సంస్థల సర్వతోముఖాభివృద్ధికి నిరంతర కృషీవలులుగా ఉన్నారు. మన సంస్థలలో వెలసిన ప్రతి భవనం వెనుక అన్నయ్య యొక్క గొప్ప సేవ పెద్దమొత్తంలో ఉంటుంది. ఇక్కడి భవన నిర్మాణంలోనే గాక, ప్రతి అభివృద్ధికార్యక్రమంలో తన పాత్రతని ఉండేట్లు చూసుకుంటారు. మా గురువర్యులు శ్రీపన్నాల రాధాకృష్ణశర్మగారితో కలసి భువనేశ్వర్‌లో పర్యటించి భవన నిర్మాణానికి సహకరించారు.

ఒకప్పుడు ఓరియంటల్ కళాశాలలను గూర్చి ప్రభుత్వపరంగా జరిగిన ఒక సమీక్షా కార్యక్రమంలో అన్నయ్య జిల్లెళ్లమూడి మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి యొక్క సమగ్రతని ప్రభుత్వానికి తెలియజేసి ఈ కాలేజీ గొప్పతనాన్ని ప్రభుత్వ దృష్టికి తెలియ చెప్పగలిగారు. కళాశాల భవన నిర్మాణంలో నిర్మాణంకాబోయే భవనాలలో తన గొప్పసేవ ఉండేట్లు పెద్దమొత్తం తాను అందించి, అందరూ అందించగలిగేవిధంగా ప్రయత్నం చేస్తూ ఉంటారు.

అమ్మవద్ద జరిగే పూజా కార్యక్రమాలలోనూ, మంత్రదీక్షా కార్యక్రమాలలోనూ కూడా, ఏలూరు సోదరులు అగ్రస్థానంలో ఉండేట్లు, సోదరులను ప్రోత్సహిస్తారు.

జిల్లెళ్ళమూడి రాగానే విద్యార్థులను కలసి లాలనగా మాట్లాడుతూ

వినే పాఠాలూ, తినే భోజనాలూ ఎలా ఉన్నయ్యో తెలుసుకొని, తన స్థానంలో తన కృషి ఎంత శాతం సఫలం అవుతున్నదో అని తనను తాను పరీక్షించు కుంటారు. విశ్వజననీ పరిషత్తు, మాతృశ్రీ విద్యాపరిషత్తుల అధ్యక్షులుగా ఉంటూ, తనస్థానాన్ని గురించి ఎప్పటికప్పుడు పరీక్షచేసుకుంటూ ఉంటారు. నిత్య నూతన కార్యక్రమాలు చేపట్టి కృతార్థతను పొందుతూ ఉంటారు.

అమ్మ కరుణాకటాక్షాల ప్రసారంచేత ఉభయ సంస్థలకూ అధ్యక్షతను ఎంతో దీక్షగా దక్షతతో నిర్వహిస్తూ, అమ్మ సాహిత్యం మానవ జాతికి అందించే ఉజ్జ్వలతను తన గ్రంథంద్వారా అందించారు. ఉజ్జ్వలమైన ఆ భావజాలమును అందరం అందుకుందాం .

డా॥పి. ఝాన్సీలక్ష్మీబాయి

డా॥శ్రీమతి బి.లక్ష్మీసుగుణ,
మాతృశ్రీఓరియంటల్ కళాశాల,
జిల్లెళ్లమూడి.

ఆకాంక్ష

మనిషి మనిషిగా ఎలా బ్రతకాలి ? ఆ మానవత్వ పరిధినుండి మాధవుడిగా ఎలా ఎదగాలి ? బాధలనెలా స్వీకరించాలి ? సుఖానికి మార్గం ఏమిటి ? అని మనం ప్రశ్నించుకుంటూపోతే, వీటన్నిటికీ సమాధానం ఈ 'పంచదశి' గ్రంథంలో కన్పిస్తుంది. ఈ గ్రంథకర్త శ్రీరామబ్రహ్మంగారికి అమ్మయందు అచంచల విశ్వాసం. అంతటి విశ్వాసం ఏర్పడటానికి కారణం వారు భావించిన విధంగా అమ్మ శ్రీరామచంద్రునిగా దర్శనమివ్వటమే. అమ్మ ఇచ్చిన ఆ అనుభవం పునాదిగా ఏర్పడిన విశ్వాసం కాబట్టి, ఆయనలో అది స్థిరంగా నిల్చిపోయింది. కనుకనే అమ్మపట్ల ఏర్పడిన భక్తిభావంతో అమ్మ ఏర్పరచిన సంస్థనే అమ్మగా భావించి అమ్మ ఆశయాలను నెరవేర్చటానికి నిరంతరం శ్రమిస్తున్నారు.

'అడగందే అమ్మయినా పెట్టదు కాదు, అడగకుండా పెట్టేదే అమ్మ' అని చెప్పిన అమ్మలో ఎప్పుడూ బిడ్డలందరికీ ఏదో పెట్టుకోవాలన్న తపన కనిపించేది. అమ్మతో అనుబంధం ఉన్న ప్రతివారికీ ఇది అనుభవంలో ఉన్న విషయమే. అమ్మ తత్త్వాన్ని ఆకళింపు చేసుకొని, అమ్మభావాలకు వారసులైన శ్రీరామబ్రహ్మం అన్నయ్యగారిలో ఆ తల్లి హృదయం మనకు కన్పిస్తుంది. వృత్తి వేరు, ప్రవృత్తి వేరు. వృత్తి రీత్యా అంకెల లోకంలో ఉన్నప్పటికీ, ప్రవృత్తి రీత్యా అక్షర ప్రపంచంలోకి అడుగుపెట్టి తన రచనలతో అమ్మకు అర్చన కావించుకుంటున్నారు.

'అనుభవం శాస్త్రాన్నిస్తుంది గానీ, శాస్త్రం అనుభవాన్ని ఇవ్వదు'

అన్న అమ్మ ఏంచెప్పినా తన అనుభవమే ప్రమాణంగా చెప్పింది. తత్త్వాన్వేషకులకు, సాధకులకు జ్ఞానమునుగురించి ఆధ్యాత్మికత గురించి వినూత్న దృక్పథాన్ని అందించింది. జీవన సమరంలో విసిగి వేసారిన సామాన్యుడికి జీవితంపట్ల ఒక అవగాహన, బ్రతుకుపట్ల రుచి ఏర్పడటానికి సులభమైన మార్గాలెన్నో సూచించింది. ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి అంతటితో సంతృప్తి పడకుండా అమ్మ సందేశాన్ని అందరికీ అందించాలనే తపనతో శ్రీరామబ్రహ్మంగారు చేసిన ప్రయత్నమే ఈ వ్యాస సంపుటిగా రూపు దాల్చింది. అమ్మను గురించి ఎందరు ఎన్నితీరులలో వ్రాసినా ఎవరి దృక్కోణం వారిదే.

ఈ గ్రంథంలో రచయిత అమ్మ తత్త్వంలోని విశేషాలను ఒక్కొక్క వ్యాసంగా రూపొందించి భగవద్గీత, శ్రీమహాభాగవతం, పతంజలి యోగ సూత్రాలు మొదలయిన గ్రంథాలలోని విషయాలతో సమన్వయం కావించారు. 'సహనమూర్తి అమ్మ' అనే వ్యాసంలో –

"సహనం సర్వ దుఃఖానాం అప్రతీకార పూర్వకమ్
చింతా విలాప రహితం సా తితిక్షా నిగద్యతే ॥"

అని తితిక్షా నిర్వచనాన్ని ఇచ్చి, అమ్మది సహజ సహనమనీ. పై శ్లోకానికి పూర్తిగా అన్వయం కుదురుతుందనీ అన్నారు. నిజమే ! అమ్మ సహనం అసాధారణమైంది. ఇటువంటి సహనాన్నే తితిక్షగా పెద్దలు చెబుతున్నారు.

"తితిక్షానామ దేహ విచ్ఛేద వ్యతిరిక్తం శీతోష్ణాది ద్వంద్వసహనం"

"నిగ్రహ శక్తావపి పరాపరాధ సోఢృత్వం వా తితిక్షా"

శీతోష్ణాది కష్టాలను సహించటమే కాకుండా, తనకు నిగ్రహించగలిగిన, ఎదుర్కొన గలిగిన శక్తి ఉండి కూడా ఇతరులు చేసిన అపరాధాలనూ, అపకారాలనూ సహించడమే తితిక్ష. ఈ లక్షణం అమ్మ చరిత్ర అంతటా పరచుకొని ఉన్నది. అందుకనే, అమ్మ 'సహనమనే దేవతనారాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి' అని చెప్పింది. 'సుఖానికి మార్గం' అనే

వ్యాసంలో బాధల గురించి అమ్మ చెప్పిన అనేక విషయాలను ప్రస్తావించారు రచయిత. 'బాధలు లేనిది జీవితం కాదు, బాధలు లేకపోతే బ్రతుకు వ్యర్థం' అని అమ్మ వాక్యం. ఈ దృష్టితో ఆలోచిస్తే అమ్మ వాక్యంలో ఎంత జీవన సత్యం ఇమిడి ఉందో అర్థమవుతుంది. ఎందుకంటే శిల శిల్పంగా మారాలంటే ఎన్నో ఉలి దెబ్బలను భరించాలి. అలాగే జీవితంలో రాణించాలంటే బాధలే సోపానాలు. బాధవల్లనే వ్యక్తిలో చైతన్యం ఉద్దీప్తమవుతుంది. "తుఫానుకు దడిసే వాళ్ళు జీవన్మృతులు. తుఫానులో నడిచేవాళ్ళు చైతన్యవ్రతులు" అని పెద్దల మాట. కణ కణా మండే అగ్నిలో పుటం పెట్టబడిన బంగారం శుద్ధమైనట్లు, బాధానల జ్వాలాపరితప్తుడైన మనిషి కూడా రాణింపు పొందుతాడు. బాధలు పడటంలోనే ఔన్నత్యం పెరుగుతుందనీ, సహనంలోనే జీవన పరమావధి ఉందనీ, బాధలేనప్పుడు ఆ జీవితం నిరర్థకమనీ స్ఫురింపజేస్తుంది అమ్మ ప్రవచనం.

మానవుడు ఏ గ్రహాలనుండైనా తప్పించుకోగలడేమో కానీ, రాగద్వేషాలు అనే రెండు గ్రహాలనుండి మాత్రం తప్పించుకోలేడు. నాణేనికి బొమ్మా, బొరుసూ ఎలాంటివో జీవితానికి రాగద్వేషాలు అలాంటివి. మరి వీటి ప్రభావంనుండీ బయటపడటం ఎలా అని ఆలోచిస్తే 'ఏం చేసినా దైవం చేశాడనుకోవటమే సుఖానికి మార్గం' అన్న అమ్మ వాక్యం మనకు మార్గదర్శనం చేస్తుంది. ఈవిషయాన్ని జీవితంలో సమన్వయించుకొని ఆచరణలో పెట్టుకోగలిగితే, రాగద్వేష అసూయలకు తావే ఉండదు. ఏ ప్రాణాంత వ్యాధులనైనా నివారించవచ్చేమోగాని, అసూయా నివారణకు మార్గమేది? ఈ అసూయాద్వేషాల వలననే పచ్చటి కుటుంబాలు పతనమవుతున్నాయి. ఈ స్థితినుండి బయటపడాలంటే 'రాగద్వేష అసూయలను పారద్రోలేదే అనసూయత్త్వం, అదే ఈ అనసూయ తత్త్వం' అని వివరించిన అమ్మ తత్త్వమే అనుసరణీయం. ఈ అనసూయ తత్త్వాన్ని విశ్లేషిస్తూ రచయిత అనసూయత్త్వాన్ని గురించి అనేక నిర్వచనాలను ఇచ్చారు.

"న గుణాన్ గుణినో హన్తి, స్తౌతి మందగుణానపి
నాన్యదోషేషు రమతే, సానసూయా ప్రకీర్తితా"

అన్న చందంగా ఆ లక్షణాలు అలవరచుకొని అసూయా సంతతి వారు కాకుండా, అందరూ అనసూయ బిడ్డలు కావాలని ఆయన కోరిక కాబోలు. కవి ఆత్మీయత కావ్యమంతటా గోచరిస్తుంది. అలాగే రచయిత ఎంచుకున్న వ్యాసాలు, ఆయన వ్యక్తిత్వానికి దర్పణాలుగా ఉన్నాయి.

మహాత్ముల జీవితాలే లోకానికి మహత్తర సందేశాలు. అమ్మ జీవితంలో ప్రతి సంఘటనా, అమ్మ చెప్పిన ప్రతి మాటా, అమ్మలోని ప్రతి కదలికా సందేశమే. ఆచరణయోగ్యంగా అమ్మ ఇచ్చిన సందేశం 'పదిమందితో కలసి పనిచేయటం, పదిమందికోసం పనిచేయడం. మమకారాన్ని చంపుకోవడం గాక పెంచుకోవడం, పరిమితమైన ప్రేమను విస్తృతం చేసుకోవడం – ఇదే మానవుడు మాధవుడుగా మారటానికి మంచిదారి అని. ఈ సందేశం ఆచరణవాది శ్రీరామబ్రహ్మంగారి మనస్సును ఎంతగానో ఆకట్టుకుంది. అందువలననే ఈ సందేశం శిలాక్షరంలా నిలిచి పోవాలనే భావంతో కావచ్చు – ఆయన వ్యాసాలలో మరల మరల ఈ సందేశాన్ని ప్రస్తావించారు. ఒక విషయాన్ని విశేషంగా చెప్పదలచు కున్నప్పుడు పునరుక్తి దోషం కాకపోగా గుణమే అవుతుందని శాస్త్రం చెపుతున్నది. కనుక ఆయన ఆకాంక్షించినట్లుగా

అందుకుందాం అమ్మ సందేశం !
అవుదాం అమ్మభావాలకు వారసులం !

ఈ అవకాశాన్ని ఇచ్చిన మాన్య సోదరులు శ్రీ రామబ్రహ్మంగారికి కృతజ్ఞతాంజలులు సమర్పిస్తూ

సోదరి
బి.ఎల్.సుగుణ.

పంచదశి

ప్రేమమయి
జిల్లెళ్ళమూడి అమ్మ

ధర్మగ్లాని కలిగినపుడు 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని భగవంతుడు హామీ ఇచ్చాడు. ప్రేమ అంటే ఏమిటో, అనురాగమంటే ఏమిటో గ్రహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గృహిణి ధర్మమేమిటో, మాతృత్వమంటే ఏమిటో తెలుసుకోలేని అజ్ఞానం అలముకుంది. విలువలు పతనమవుతున్న తరుణంలో, ధర్మాన్ని ఆచరించి, ప్రవచించి, ప్రపంచానికి కనువిప్పు కలిగించడానికి భగవంతుడు స్త్రీరూపధారియై దివినుండి భువికి వచ్చాడు. 1923 మార్చి 28 వతేదీన బాపట్ల తాలూకా మన్నవ గ్రామంలో మన్నవ సీతాపతిరావు, రంగమ్మ దంపతులకు బిడ్డగా అవతరించారు. ఆ బిడ్డ పేరు అనసూయాదేవి. క్షమాగుణం ఆమె తత్త్వం, వివాహానంతరం 'జిల్లెళ్ళమూడి అమ్మగా' ప్రసిద్ధురాలయారు..

గృహస్థాశ్రమం సాధనకు అడ్డురాదని అమ్మ అంటారు. 'మీకు పెండ్లి ఎందుకమ్మా' అని అడిగినవారికి, 'పెండ్లిలో పెద్దపులి ఉందని భయపడేవారి అపోహలు తొలగించడానికి' అని సమాధాన మిచ్చారు. 'శరీరానికీ మనసుకూ ఎలాంటి సంబంధంలేద'ని కూడా

స్పష్టంచేశారు. 'భర్త అంటే శరీరంకాదు భావన' అని నిర్వచించారు. 'నీవెవరు' అన్న ప్రశ్నను ఎన్నిసార్లు అడిగినా 'అమ్మను' అనే సమాధాన మిచ్చేవారు. అమ్మ దృష్టిలో జడమయమంటూ ఏమీ లేదు. అంతా జీవమే, మీరు బురద పూసుకున్నా మరేం పూసుకున్నా, శుభ్రపరచవలసిన బాధ్యత నాది' అంటూ తన మాతృహృదయాన్ని విప్పేవారు.

అమ్మకు వర్ణ భేధం లేదు. 'గుణదోషమే లేని నాకు కులదోష మెక్కడి' దని ప్రశ్నించేవారు. 'సర్వ సమ్మతమే నా మత' మని ప్రకటించారు అమ్మ. ఆధ్యాత్మిక రహస్యాలను గోరుముద్దలు తినిపించినంత హాయిగా విప్పిచెప్పేవారు. 'భిన్నత్వంలేని మనస్తత్త్వమే దైవత్వం' అని నిర్వచించారు. 'నీ బిడ్డను ఎలా ప్రేమిస్తావో అందరినీ అలాగే ప్రేమించ'మని ప్రబోధించారు. తమ బతుకు తాము బతకలేని అభాగ్యులను ఆదుకోవడం ఉన్నత మానవధర్మంగా చాటారు. ప్రతి ఒక్కరినీ భగవత్ స్వరూపునిగా భావించి సేవచేయమన్నారు. ఆ సేవలో కలిగే తృప్తినే ముక్తిగా భావించమన్నారు. ఎవరికివారు వ్యక్తిగత సాధన చేసుకోవడం అన్ని కాలాలలోనూ వర్తించదన్నారు. ఆ సాధన పదిమందితో కలసి చేయడం, పదిమందికీ ఉపకరించే పనులు చేపట్టడం ఉత్తమ మార్గమన్నారు.

అమ్మ జీవితాన్ని అధ్యయనం చేస్తుంటే, నాకు లలితాదేవి ఇలా వచ్చింది అనిపిస్తుంది. లలితా సహస్ర నామములకు అమ్మ జీవిత భాష్యమనిపిస్తుంది.

'వీరు మీ శిష్యులా ?' అంటే అమ్మ 'కాదు, నాశిశువులు' అంటారు అమ్మ.

ఒకనాడు అమ్మకు నివేదన సిద్ధం చేశారు. దాన్ని పిల్లి ముట్టుకుంది. అయినా అమ్మ అభ్యంతరం లేదు ఎందుచేతనంటే, 'అదికూడా నా పిల్లే కదరా !' అన్నారు. వరద వస్తే 'ఇంటికి ఆడపిల్ల వస్తే చీరా, సారే పెట్టవద్దా?' అంటూ చీరా, రవిక, పసుపుకుంకుమలు ప్రేమగా వరదలో వదిలారు.

జిల్లెళ్లమూడిలో మూడు గంటలు వినిపించేవరకు తాను ఉంటానన్నారు. అందులో మొదటిది అన్నపూర్ణాలయపు గంట. అక్కడ నిత్యాన్నదానం జరుగుతుంది. ఇక్కడ భోంచేయడానికి ఒకే ఒక అర్హత ఆకలి, తనను చూడవచ్చిన ప్రతివారినీ అమ్మ ముందుగా 'అన్నం తిన్నావా నాన్నా?' అని అడిగేది. విద్యాలయాలలోని గంట రెండో గంట. ఇది విద్యాబోధనకు కేంద్రం. ఉన్నత విద్యా ప్రమాణాలకు ఇక్కడి పాఠశాలలూ, కళాశాలలూ పెట్టింది పేరు.

శ్రీఅనసూయేశ్వరాలయపు గంట మూడవది. ప్రతిరోజూ ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంకాలం లలితా సహస్రనామార్చన జరుగుతాయి.

బిడ్డల ఆదరణకు నోచుకోని వారిని, అనాథలను అక్కున చేర్చుకుంటుంది ఇక్కడి 'ఆదరణాలయం'. మాతృశ్రీ మెడికల్ సెంటర్ 1978 లో ఆవిర్భవించింది. స్త్రీలకు, పిల్లలకు ఉచిత వైద్యం– పేదవారికి ఉచితంగా మందులు ఇస్తారు. మానవసేవకు అమ్మ సంకల్పించిన అనేక కార్యక్రమాల ఏర్పాట్లు ఇంకా కొనసాగుతున్నాయి.

స్వల్ప శబ్దాలతో క్లిష్టమైన భావాలకు నిర్వచనాలు చెప్పడం అమ్మ విశిష్టత. వీటి వలన మనకు ఆధ్యాత్మిక భావాలను, లౌకిక విషయాలను సంగ్రహించే శక్తి పెరగగలదని నా విశ్వాసం. అందులో కొన్ని :

1. అనుకున్నది జరగదు – తనకున్నది తప్పదు.
2. ధ్యాసే ధ్యానం.
3. వర్గంలేనిది స్వర్గం.
4. వైకల్యంలేనిది కైవల్యం.
5. ఇష్టంలేనిది కష్టం

6. భరించలేనిది బాధ-సహించలేనిది హింస.
7. నిగ్రహం కొరకే విగ్రహారాధన.
8. విశ్వాసమే దైవం.
9. ప్రేమయొక్క రూపాంతరమే ద్వేషం.
10. విరామం లేనిది రామం .

జీవితాన్నిగురించి అమ్మ మాటలు:

1. శిల్పానికి అందం రావాలంటే ఉలి దెబ్బలు అవసరం.
2. జీవితం, జీవనం భగవంతుడు ఇచ్చినవే.
3. జీవితమంటే సమస్యల తోరణం- సమస్యలతో రణం
4. కోరిక వేరు, జీవితం వేరు - రెంటికీ నిత్యం ఘర్షణే.
5. బాధలు లేనిది బతుకూ కాదు - అలలు లేనిది సముద్రమూకాదు.
6. లేనిదానికొరకు ఆశించేది దుఃఖం-ఉన్నదానితో తృప్తిచెందేది సంతోషం.

అమ్మ మహాసమాధిలో ప్రవేశించి అప్పుడే పుష్కరం నిండవస్తోంది. అందరూ కలసి చేసే కార్యాలంటే అమ్మకు ఎంతో ఇష్టం. అందుకే అమ్మ జన్మదినమైన ఈనెల 18 న జిల్లెళ్లమూడి లో సహస్రఘట క్షీరాభిషేకం భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నవి. సోదరసోదరీమణులందరూ ఈ అర్చనలో పాల్గొని, వైభవోపేతమైన ఈ పండుగను దర్శించి అమ్మ కృపకు పాత్రులవుదాము.

(వార్త దినపత్రిక నందు 17-04-1997 న ప్రచురింపబడినది)

అమ్మ సాన్నిధ్యము లభించిన విధము

....అమ్మ "సాహిత్య సౌందర్య పరిశీలన" అనే పేర పరిశోధన చేసిన డా॥ శ్రీమతి బి.యల్.సుగుణతో చేసిన సంభాషణ సారాంశము.....

మహాకారుణ్యరూపిణి, వాత్సల్య పయోనిధి అయిన అమ్మను నేను 12-1-1975లో మొదటిసారి దర్శనం చేసుకున్నాను.

శ్రీ ప్రసాదు (జిడ్డు) Union Bank of India లో పని చేస్తున్నప్పుడు నేను ఆంధ్రా బ్యాంకు మేనేజర్‌గా కటక్ లో ఉన్నాను. అమ్మ స్వర్ణోత్సవాల సందర్భంగా మాతృశ్రీ మాసపత్రిక చందాదారుగా చేర్చాడు. అమ్మ సాహిత్యంతో పరిచయమైంది. 'అనుకున్నది జరుగదు, తనకున్నది తప్పదు' అనే వాక్యం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. ఇది తరువాత అమ్మనోటితో చెప్పినప్పుడు మరింతగా ఆ వాక్యం యొక్క భావం మనసుకు పట్టింది.

అమ్మను మొదటిసారిగా చూడాలనుకున్నప్పుడు, అంతకుముందు నా మనస్థితిని చెప్పటం అవసరమనిపిస్తుంది. నేను అక్షరలక్షల నామజపం చేస్తే మంత్రాధిష్ఠాత రక్తమాంసాదులతో దర్శనమిస్తాడనే శ్లోకాన్ని శ్రీమళయాళ స్వామి రచించిన 'శుష్క వేదాంతతమోభాస్కరము'లో చదివాను. 'శ్రీరామ' అనే నామాన్ని ఏ మాత్రం అవకాశమున్నా జపించాను. అంతకుముందు వరకూ అమ్మను చూడటానికీ, వెళ్లటానికీ అనుమతి యివ్వని మా నాన్నగారు నాకు అమ్మను చూడటానికి అనుమతి ఇచ్చారు. 'దైవం ఒక్కరే కదా ! అమ్మ దైవమయితే నాకు శ్రీరామునిగా దర్శనమివ్వాలి. అంటే అమ్మ ఒక చేతితో 'అభయముద్ర' రెండవచేతితో విల్లు పట్టుకున్నట్లు

ముద్ర పట్టాలి' అని మనసులో భావించివచ్చాను. ఆరోజు ఎన్నోసార్లు ఆ ముద్రలు పట్టి తాను శ్రీరాముడే అనే భావము నాకు అమ్మ స్పష్ట పరిచారు. ఇంకొకటి ఈ సందర్భంగా ఎవరి పరిచయమూ లేకుండా వెళ్లాలని అనుకున్నాను. దర్శనమయి బయటకు వచ్చేటప్పుడు గాని, శ్రీరామకోటేశ్వరరావుగారు కన్పించలేదు. ఇదే రెండుమూడు నిముషాలు ముందర జరిగితే నేను, అనుకున్నట్లు అయ్యేది కాదు ! నాకు మొదటి అనుభవం చాలా సంతృప్తినిచ్చింది.

తరువాత ఒకరోజు ఏలూరునుంచి కొందరు సోదర సోదరీమణులతో కలసి జిల్లెళ్లమూడి వస్తున్నాను. రైలులో కొందరు మిలటరీ సోదరులు బర్తులలో పడుకున్నారు. ఉదయం 6.30 గం. నేను ఒక సోదరుని కాళ్లదగ్గర అతనికి తగలకుండా వత్తిగిల్లి కూర్చున్నాను. అయినా ఆ సోదరుడు కోపంతో 'సాలా' అని హిందీలో తిట్టాడు. ఈసారి తిడితే దవడవాయిస్తానన్నాను. అతడు మూడవసారి అనటమూ, నేను దవడవాయించడమూ జరిగింది. ప్రక్కనే ఉన్న ముగ్గురు మిలటరీ సోదరులు నా చేతులు పట్టుకొన్నారు. బోగీలో ఉద్రిక్తత నెలకొన్నది. ఆశ్చర్యకరమయిన విషయం వాళ్లు నన్ను కొట్టలేదు. జిల్లెళ్లమూడి చేరగానే అందరికన్న ముందుగా నేను అమ్మ దగ్గరకు వెళ్ళి "ఉదయం రైలులో....." అన్నాను. నా వాక్యం పూర్తికాకుండానే అమ్మ "అనరాని మాటలంటే కోపం రాకుండా ఎట్లా ఉంటుంది ? కావలసిన పని గంధర్వులే తీరుస్తారు" అన్నారు. అంటే అమ్మకు మన చుట్టూ జరుగుతున్న ప్రతివిషయమూ తెలుసుననీ, ఆమె రక్షణ మనకు ఉన్నదనీ నాకు అర్థమయింది.

మూడోసారి వచ్చినప్పుడు గుప్పెడు ప్రసాదాన్ని ఇరవై ముప్పై మందికి దోసెళ్ళనిండా పెట్టడం చూసి అమ్మ సిద్ధపురుషురాలు అని అర్థమయింది. ఇంకా ఎన్నో సంఘటనల తరువాత అమ్మ మన మనసులోని మాటలు గ్రహించటం, మనకు దానినిబట్టి సూచనలు ఇవ్వడం, తాను ఆ విధంగా ప్రవర్తించి మన మనసుకు సంతృప్తిని కలుగచేసే ఈ విషయాలన్నీ వ్రాస్తే అది ఒక పెద్ద గ్రంథమే అవుతుంది.

ఇక అమ్మ జీవిత విధానం 'సరే' మంత్రం. తనకు ఏమీ తెలియనట్లు, మనచేత చెప్పించి, మనతో తనకు కావలసిన విధంగా చేయించటం అమ్మ ప్రత్యేకత. అమ్మ మానవతావాది మాత్రమే కాదు, 'సర్వభూతస్థచామాత్మానం సర్వ భూతాని వాత్మని'(గీత : 6-29). మనల నందరినీ తన అవయవాలుగా భావించారు. పిల్లి ముట్టిందని అంటే పిల్ల ముటందని, పత్రికను చూసి 'పుత్రిక' అనీ అన్నారు అమ్మ. ఎంత ఆదమరచి ఉన్నదని మనం భావించినా, సర్వకాల సర్వావస్థలయందూ 'నేను అమ్మను, మీరు బిడ్డలు' అనే భావనే అమ్మలో కన్పిస్తుంది. అమ్మ ఒకసారి 'గీతలో చెప్పనిది నేను చెపుతున్నది లేదు. చెప్పేతీరు వేరుకావచ్చు' అని అన్నారు.

అమ్మ అన్ని సంస్థలకూ ఆలయాలనే నామకరణం చేశారు. అనసూయేశ్వరాలయం, హైమాలయం, అన్నపూర్ణాలయం, విద్యాలయం, వైద్యాలయం, ఆదరణాలయం అని. ఎక్కడ పనిచేసినా నీవు చేసేది ఈశ్వరుని సేవ అనే స్ఫురణ మనలో బాగా పాదు చేసుకోవాలి. అమ్మ దృష్టిలో ఒకటి తక్కువా, మరొకటి ఎక్కువా అని కాదు. అన్నపూర్ణాలయంలో అంట్లుతోమినా, అనసూయేశ్వరాలయంలో రుద్రాభిషేకం చేసినా, ఆదరణాలయంలో వృద్ధుల మనస్సుకు ఊరట కలిగించే మాటలు మాట్లాడినా - అంతా ఒకటే. ఎక్కడ ఏ పని చేసినా భగవత్సేవగానే భావించాలి.

'బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా'
(గీత : 5 - 10)

ఇది మనకు నేర్పటానికి తాను అన్నపూర్ణాలయం మొదలైనవి పెట్టినట్లు మనం అర్థంచేసుకోవాలి. 'నీవు జగజ్జననివి మాత్రమే కాదమ్మా ! జగద్గురువు కూడా' అన్నప్పుడు

'జ్ఞానం అంటే మాటలు కావుగా, నేను చేయకుండా మీకు

చెప్పకూడదుగా, అందుకే ఈ అన్నపూర్ణాలయం' అన్నది అమ్మ చిరునవ్వుతో (మాతృసంహిత; పుట. 552) అలాగే మిగతావీ అనుకోవాలి.

అమ్మ సందేశం "**పదిమందితో కలసి పనిచేయడం ; పదిమందికోసం పనిచేయడం, మమకారాల్ని చంపుకోవడం కాక పెంచుకోవడం, పరిమితమైన ప్రేమను విస్తృతం చేసుకోవడం, నేటి మానవధర్మం ఇదే ననుకుంటున్నాను. ఇదే మానవుడు మాధవుడుగా మారడానికి మంచిదారి**".

సుఖం ఎక్కడ ఉందీ అంటే, తృప్తిలో ఉంది. సుఖానికి మార్గం ఒక్కటే - ఏది చేసినా దైవం చేశాడనుకోవటమే అని.

"తెలియనిది తెలియ చెప్పటానికే నారాక"

"అంతా ఉన్న అమ్మ తెలియటానికి ఈ అమ్మ" (అమ్మ, అమ్మ వాక్యాలు. 1578)

తల్లి ధర్మం నెరవేర్చడంకోసమే వచ్చానని (అఅవా. 1434, 2165) అమ్మ తన అవతార కారణాన్ని స్పష్టం చేశారు.

అమ్మ లలితయే

...'మాతృశ్రీ జీవతమహోదధి తరంగాల' లో శ్రీగుండేలురావుగారు అమ్మను గురించి...

"నామాట నమ్ము, నారాముడే నాకోసం ఇట్లా అవతరించాడురా, లేకపోతే నాపై అంత కరుణ ఎవరికి ఉంటుంది ? అసలు ఆ దయార్ద్ర హృదయం ఒక్క నా రాముడికి మాత్రమే ఉన్నది ! ఆ నలినాయతలోచనాలు, ఆ విశాలఫాలభాగము, ఆ కరుణామయదృక్కులూ, ఆ వచోమాధుర్యమూ, ఆ గంభీరాకృతీ, ఓహ్ ! నా రాముడే, అన్నయ్యా- నిస్సందేహంగా రఘురాముడే అన్నయ్యా ....

"నేనేదో చెపుతున్నానని అనుకోవద్దు. ఈ అమ్మ కేవలం రాముని రూపమే. ఎవరేమనుకున్నా నీవు మాత్రం యీ అమ్మను నమ్ముకో, మనసా పూజించుకో. నాకు వ్యవధి లేదు – లేకపోతే ఈ రహస్యం ఎంతమందికి వెల్లడించేవాడినో, వేయినోళ్ళతో జగత్తంతా చాటేవాడిని" అన్నారు.

ఎంత సత్యం ! మహాత్ములెప్పుడూ మట్టిలో మాణిక్యంవలే నిగూఢంగానే ఉంటారు. వారి కరుణ ప్రసరిస్తేగాని, ఎవరూ వారిని ఎరుగలేరు.

అమ్మ సత్యనారాయణస్వామిగా, కృష్ణుడుగా, రాజరాజేశ్వరిగా, అనేకమందికి వారి వారి గురువులుగా దర్శనమిచ్చిన సంఘటనలు మన అందరికీ తెలిసే ఉన్నాయి. భగవద్గీతలో కూడా ఎవరు ఏరూపంగా ఆరాధిస్తే, ఆ రూపంగానే తాను కనిపిస్తానని కృష్ణుడు చెప్పిన విషయం చూడండి.

"యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్" ॥
(గీత : 7-21)

ఏ యే భక్తుడు ఏ దేవతా రూపమును శ్రద్ధగా పూజించునో, ఆయా భక్తుని శ్రద్ధను నేనే ఆయా దేవతయందే స్థిరముగా ఉంచుచున్నాను.

ఏ విషయాన్నైనా నమ్మాలి అంటే మూడు అంశాలు కావాలి, గురువాక్యం, శాస్త్ర ప్రమాణం, సొంత అనుభవం సరిపోవాలి.

అమ్మ లలితా పరమేశ్వరి అని ఎందరో మహాత్ములు వారి నమ్మకాన్ని ప్రకటించారు. శ్రీశ్రీశ్రీ పూర్ణానందస్వామి, శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు(అమ్మను శ్రీరామునిగా - లలితగా సంభావించారు). శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీస్వామి, శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు, శ్రీబషీరు బాబా, మొదలైనవారు అమ్మను అర్చించారు, ఆరాధించారు. అందుకే అమ్మ 'బుధార్చితా'.

జిల్లెళ్లమూడి అమ్మ వాత్సల్యరూపిణి. మనపై అనుగ్రహంతో, కరుణతో లలితా సహస్రనామ పారాయణ చేయమని ప్రోత్సహించారు. ఆమె లలితా స్వరూపిణి. ఆ విషయమును మనం గుర్తించడానికే మన చేత ఈ పారాయణ చేయించారేమోనని నేను భావిస్తున్నాను.

అమ్మ 'చారురూపా' , 'సింధూరారుణవిగ్రహా', 'మహా లావణ్య శేవధిః'. అమ్మ వద్దకు అనేకమంది నమస్కారం చేయకూడదు అని దృఢ సంకల్పంతో వచ్చేవారు. కానీ ఆ దివ్య సౌందర్యరాశిని చూడగానే మంత్రముగ్ధుల వలే సాష్టాంగ ప్రణామములు ఆచరించేవారు. డా.పొట్లూరి సుబ్బారావుగారు, అమ్మ వద్దకు మొదటిసారి వచ్చినప్పుడు ఒక సామాన్య స్త్రీకి నమస్కారము చేయటమేమిటని, వచ్చిన తరువాత అప్రయత్నంగా అమ్మకు నమస్కారం చేశారు.

అమ్మను దర్శించిన వారు అమ్మ మందహాసమును చూస్తే అన్ని

కష్టాలనుమర్చిపోవటమే. లలితా సహస్ర నామములలోని 'స్మితముఖీ', 'వికసిత వదనా', 'చారుహాసా', 'దరహాసోజ్జ్వలన్ముఖీ', 'మందస్మిత ప్రభాపూర మజ్జత్ కామేశ మానసా', ఆమెకు అన్వయిస్తాయని అనిపిస్తుంది.

ఆమె మాటలు మృదుమధురంగా ఎవరికి వినబడాలో వారికి మాత్రమే వినిపించేవి.'నిజసల్లాప మాధుర్య వినిర్భర్త్సిత కచ్ఛపీ' అనే నామాన్ని గుర్తు చేస్తాయి.

అమ్మ 'స్వభావ మధురా' , 'శాంతిమతీ'.

అమ్మ ప్రేమను గురించి వర్ణించనలవి కాదు. ఆ ప్రేమను చవిచూచిన లక్షలాది బిడ్డలే అందుకు సాక్షులు. ('తల్లిహృదయం' అనే వ్యాసంలో కొన్ని ఉదాహరణలు చదువుతారు). అందుకే అమ్మ తన ప్రేమను గురించి ఇలా అన్నారు :

"ఈ గదిలోకి రానంతమాత్రాన, నన్ను చూడనంతమాత్రాన నాకు మీమీద ప్రేమ తగ్గుతుందని అనుకోవద్దు...... , తల్లికి మానసికంగా ఎవరిమీద ఎక్కువ ప్రేమ ఉంటుంది ? దూరంగా ఉన్నవాడిమీదే. ఏదైనా, ఉండే ప్రేమ ఎక్కడ ఉన్నా, ఎట్లాఉన్నా, ఉంటుంది. అన్నం వండేవారిమీద ఎంత ఉంటుందో, చిమ్మేవాడిమీదా అంతే. నాలుగు రూపాయిలు దిబ్బెనలో వేసినవాడిమీదా అంతే ఉంటుంది. వేయనివాడిమీదా అంతే ఉంటుంది. ఇందులో ఎక్కువతక్కువలు లేవు. ఆవరణలో తిరిగే కుక్కలూ-పిల్లులూ ఎంతో మీరూ అంతే ". (అమ్మతో సంభాషణలు - పుట 43)

"సృష్టి అంతా ప్రేమమయం, ధర్మాధర్మాలు, పాపపుణ్యాలు, నీతి అవినీతులు........, అన్నీ ప్రేమలో ఇమిడి ఉన్నాయి. ప్రేమకంటే భిన్నమైంది మరొకటి లేదు. ప్రేమయే సర్వం. మానవత్వం, దైవత్వం ప్రేమలో ఇమిడి ఉన్నాయి" అన్నారు అమ్మ.

"కారణాలతో కూడింది ప్రేమకాదు-అవసరం అనీ, ప్రేమ వ్యాపారం కాదు" అనీ అన్నారు.

'ఆబ్రహ్మకీటజననీ' – పిల్లిని పిల్లగానూ, గడ్డను బిడ్డగానూ, శిష్యులను శిశువులుగానూ, పత్రికను పుత్రికగానూ, వరదను బిడ్డగానూ చూసిన తల్లి ఆమె.

ఆమె 'కరుణారస సాగరా', 'సాంద్ర కరుణా', 'దయానిధి' , 'అవ్యాజ కరుణామూర్తి'.

"సృష్టి అనాది, నాది" అన్నారు అమ్మ. "మీరందరూ నా అవయవా"లని అన్నారు. విశ్వమంతటినీ తన బిడ్డగా చూడగలిగిన అమ్మకు క్రోధం ఎక్కడ ? ఎవరి పైన ? కనుక ఆమె 'నిష్క్రోధా'.

ఆమె 'భక్తప్రియా', 'భక్తివశ్యా', అనేక భక్తుల అభీష్టములను తీర్చి అనేకమందిని కష్టాలనుంచీ గట్టెక్కించిన సంఘటనలు లక్షలు.

ఎందరి భయాలనో తొలగించిన అమ్మ 'భయాపహా'.

లక్షమందికి పైగా ఒక్క పంక్తిలో అన్నంపెట్టిన అమ్మ 'అన్నదా'.

అమ్మ 'మాతృకావర్ణరూపిణీ', 'వాగ్దేవీ', 'కావ్యాలాప వినోదినీ'.

ఆమె 'సర్వజ్ఞ'. భూత భవిష్యత్ వర్తమానకాలములను గురించి ఎన్నో విషయాలు ఆమె చెప్పగలిగారు.

"మమకారాన్ని చంపుకోవటం కాదు, దాన్ని విస్తృతం చేసుకోవాలి" అని చెప్పిన అమ్మ 'నిర్మమా', 'నీరాగా', 'నిర్భేదా'. భేదమెరుగని విధానాలు ఆమెవి. చరాచర సృష్టిని తన అవయవాలుగానే దర్శించిన మహాత్మురాలు. సర్వత్రానురాగమే విరాగమన్నారు.

అమ్మ 'నైష్కర్మ్యా', గీతలో చెప్పబడిన సంగరహితంగా, ఫలాపేక్ష లేకుండా, కర్తృత్వ రహితంగా చేసే కర్మ, అది కర్మ కాదనే విషయం అమ్మకు పూర్తిగా సరిపోతుంది.

ఆమె 'ప్రియవ్రతా', వ్రతాలంటే చాలా ఇష్టం. వ్రతాలు సర్వత్రా ఉండే దైవలక్షణాలను తెలియజేయటానికే ననీ, గొమ్మలలో కూడా దైవమును దర్శనం చేసుకోటానికే అనీ అన్నారు.

అమ్మది 'సరే' మంత్రం. అన్నిటికీ 'సరే' అనేవారు. అందుకే ఆమె 'ప్రియంకరీ'.

ఆమె 'యజ్ఞప్రియా', 'పంచయజ్ఞప్రియా'. ఆమె 'యోగదా', ఒకసారి ఏలూరునుంచి శ్రీమురాల నారాయణరావుగారు శ్వాసకు సంబంధించిన కొన్ని సందేహాలను అమ్మను అడిగి తెలుసుకోవాలనుకున్నారు. అమ్మ ఒక కుక్క శ్వాస ద్వారా నారాయణరావుగారి సందేహాలను తీర్చింది.

అమ్మ 'సుమంగళీ', 'సువాసినీ', 'సువాసిన్యర్చన ప్రీతా'.

అనంత రూపిణి అయిన అమ్మ తత్త్వానికి అన్ని నామాలూ ఇలా సమన్వయించుకోవచ్చు. లక్షలాదిమంది భక్తులు అమ్మను దర్శించుకొని తరించారు. ఎవరి దృక్పథం వారిదీ, ఎవరి అనుభవం వారిదీ. ఎప్పుడైనా శాస్త్రం కంటే స్వానుభవమే ఎవరికైనా ప్రమాణం. "అనుభవం శాస్త్రాన్ని ఇస్తుంది, కానీ శాస్త్రం అనుభవాన్నివ్వదు' అని అమ్మ వాక్యం. కనుక అమ్మ ప్రేమతత్త్వాన్ని, అనంతకల్యాణగుణాలను అనుభవించి, ఆనందించిన సోదరీసోదరులు అమ్మను లలితగా, రాజరాజేశ్వరిగా దర్శించి, సంభావించి, ఆరాధించారు.

"అంతా ఉన్న అమ్మను తెలియటానికే ఈ అమ్మ" అన్న అమ్మ వాక్యం ఈ విషయాన్ని అమ్మ కూడా పరోక్షంగా అంగీకరించారనటానికి నిదర్శనం

శ్రీ లలితా సహస్రనామము - మాతృతత్త్వము

ఓం

అం ఆ

జయహో మాతా శ్రీఅనసూయా

రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి !

లలితా సహస్రనామాల్లో మాతృదర్శనం చేయడమంటే, మనం మన యథార్థ స్థితిని - లలితా రూపులం మనం అనే గుర్తింపు పొందడమే.

"అరుణాం కరుణా తరంగితాక్షీం
ధృత పాశాంకుశ పుష్ప బాణచాపామ్
అణిమాదిభి రావృతాం మయూఖై
రహ మిత్యేవ విభావయే భవానీమ్"

అని గదా ధ్యాన శ్లోకం !

"ఆత్మైవ లలితా ప్రోక్తా" అన్న మాట యీ భావాన్నే రూఢి చేస్తోంది.

మాతృశ్రీ అనసూయాదేవిని (ఈ వ్యాసంలో మాతృశ్రీ అన్నప్పుడు శ్రీ అనసూయాదేవి అని గ్రహించ ప్రార్థన) ఒక సోదరుడు "నేను బ్రహ్మను అనుకోవటమా ? లేక అన్పిస్తుందా ?" అని అడిగితే, "ముందుగా అనుకుంటే, తరువాత అనిపిస్తుంది" అని అన్నారు.

అసలు తత్త్వము అంటే 'తత్-త్వమ్'-నీవు అదే (అయి ఉన్నావు) అని గదా గురూపదేశం !

మాతృశ్రీ "అంతా అదే నాన్నా - ఎంత వెదికినా నాకు అది కానిది గోచరించడం లేదు" అన్నారు. " మాతృత్వం వేరూ - మాతృతత్త్వం వేరూ" అని చక్కని మాట చెప్పారు, "అమ్మా ! నీ తత్త్వం ఏమిటి ?" అంటే "రాగ, ద్వేష, అసూయలను పారద్రోలేదే అనసూయ తత్త్వం - అదే ఈ అనసూయ తత్త్వం" అన్నారు.

మాతృత్వాన్ని ప్రతిపాదించే నామాలు లలితా సహస్రంలో ఎన్నో ఉన్నాయి. "శ్రీమాతా", "మాతా", "అంబా", "అంబికా", "అనేకకోటి బ్రహ్మాండ జననీ", "ఆబ్రహ్మ కీటజననీ", "సిద్ధమాతా", "విశ్వమాతా", "గోమాతా", "వియదాది జగత్ప్రసూః", "వేదజననీ", "వీరమాతా" , "ప్రసవిత్రీ", "త్రిపురాంబికా" - ఇలా ఎన్నో నామాలు.

మాతృత్వానికి లింగ వయోభేదాలు లేవు. "వయోఽవస్థా వివర్జితా" గదా ! మాతృశ్రీ సప్తవర్షముల బాలికగా ఉన్నప్పుడే మాతృతత్త్వం నిండి ప్రేమతత్త్వాన్ని ప్రసరింపచేసింది. తనకంటే వయస్సులో పెద్దవాళ్ళను కూడా బిడ్డలుగా భావించింది.

మాతృతత్త్వం అంటే అనురాగం, వాత్సల్యం, త్యాగం, సహనం తన బిడ్డల శ్రేయస్సు చూడడంలో తల్లికి ప్రతిఫలాపేక్ష లేదు. తల్లికి తప్పే కన్పించదు గదా ! మాతృశ్రీ మనలనందరినీ తన అవయవాలుగానే చెప్పింది. 'మీరు కానిది నేనేమీ కాదు' అని అంది. హరుని నేత్రాగ్నిచే దగ్ధమైన మన్మథుని శ్రీమాత అనుగ్రహంతో పునర్జీవితుని చేస్తుంది("హర నేత్రాగ్ని సందగ్ధ కామ సంజీవనౌషధిః"). ఆమె తత్త్వమే ప్రేమ కనుక "ప్రేమరూపా". మాతృశ్రీ "ప్రేమకంటె భిన్నమైనది మరొకటి లేదు, ప్రేమయే సర్వం, మానవత్వం, దైవత్వం ప్రేమలో యిమిడి ఉన్నాయి" అన్నారు. ఆమె మూర్తీభవించిన ప్రేమ కనుక "ప్రేమరూపా". "కారణాలతో కూడింది ప్రేమకాదు - అవసరం అనీ, ప్రేమ వ్యాపారం కాదు" అనీ మాతృశ్రీ అన్నారు. ఆమె అవ్యాజ కరుణామూర్తి" "దయామూర్తిః", "సాంద్రకరుణా", "కరుణారస సాగరా", "మైత్ర్యాది వాసనాలభ్యా".

మన కన్నీటిని చూస్తే అమ్మ సార్ద్ర నయన అవుతుంది. ఒక వ్యక్తి మంచితనమే అమ్మని కదిలించేస్తుంది. తనకు రాచకురుపు కూడా ముల్లుతో సమానం కాదు. " గడ్డ కూడా బిడ్డే ! వాటికీ తల్లినే ! " అంటుంది. మన వేదన అమ్మ హృదయాన్ని స్పందింపచేస్తుంది, ద్రవింపచేస్తుంది. అందుకే "నిత్యక్లిన్నా" – ఎల్లవేళలా దయారసంతో నిండి ఉంటుంది.

తల్లి అంటేనే రక్షణ – "రక్షాకరీ" కదా ! మనలను ఆపదలనుంచి కాపాడుతుంది. "సర్వాపద్వినివారిణీ" కదా ! మనందరి జన్మ, జరా, మృత్యు, రోగముల భయమునూ – దుఃఖము, ఇతర భయాలనూ పోగొట్టుతుంది – "భయాపహా" కనుక, "జరాధ్వాంత రవిప్రభా", "జన్మమృత్యు జరాతప్త జన విశ్రాంతిదాయినీ", "సర్వవ్యాధి ప్రశమనీ", "సర్వ మృత్యు నివారిణి", "సంసార పంక నిర్మగ్న సముద్ధరణ పండితా", "దౌర్భాగ్య తూల వాతూల" మొదలుగా గల నామాలు, ఆమె మనకు ఇచ్చే రక్షణ తత్త్వమును తెలియచేస్తున్నాయి. "దుఃఖహంత్రీ" మాత్రమే కాదు, "సుఖప్రదా", "సుఖకరీ" అమ్మ.

"మృత్యుంజయుడు అంటే మృత్యువంటే భయం లేకపోవటమే" అన్నారు మాతృశ్రీ. మృత్యువును తప్పించుతుంది అనుకోకూడదు – మృత్యువంటే మనకు భయం లేకుండా చేస్తుంది.

మననుండి ఆమె ఏమీ తీసుకోదు – "నిష్పరిగ్రహా", తనవన్నీ మనకు ఇస్తుంది. ఆమె "పురుషార్థప్రదా" "వాంఛితార్థప్రదాయినీ". అడిగితేనే ఇస్తుందా ? మాతృశ్రీ "అడిగితే అడిగిందే ఇస్తాను. అడుగకపోతే బిడ్డకు కావలసింది ఇస్తాను" అన్నారు.

అమ్మ "మహాశనా" "అన్నదా" మన మనోరథాలనన్నిటినీ పూరించే "కామధుక్", "వసుధా", "ధన ధాన్య వివర్ధినీ" !

అమ్మ "నిర్మమా", "నీరాగా","మమతాహంత్రీ", "రాగమథనీ"

(iv)

అంటే అమ్మకు అనురాగము, మమతలు లేవని కాదు - మాతృశ్రీ చెప్పినట్లు, పరిమిత మమకారం పోయి, అపరిమిత మమకారం కలుగచేస్తుందని భావించాలి.

"సర్వత్రానురాగమే విరాగ" మని కదా అమ్మ నిర్వచనం !

"దుష్టదూరా", "దురాచారశమనీ" అయిన అమ్మ మనలను శిష్టులుగా తీర్చి దిద్దుతుంది.

ఆమె "నిష్క్రోధా", "నిర్లోభా", "నిర్మోహా" - మన క్రోద లోభ మోహములను నాశనం చేస్తుంది. "క్రోధశమనీ", "లోభనాశినీ", "మోహనాశినీ" !

ఆమె "నిష్పాపా", మన పాపాలను దగ్ధం చేస్తుంది - "పాపారణ్య దవానలా", "పాపనాశినీ", "మహాపాతకనాశినీ", "కలికల్మషనాశినీ" కనుక.

మనలోని అసురగుణాలను శమింపచేస్తుంది - "దైత్యశమనీ", "దైత్యహంత్రీ", "రాక్షసఘ్నీ" అయిన అమ్మ. ఈ సందర్భంలో మాతృశ్రీ నరకాసురుని గురించి చెప్పినట్లు, "వాడూ బిడ్డే గదా - వాడి రాక్షస, దైత్య గుణాలను శమింపచేయటమే కాని, వాడిని సంహరించటం కాదు", బిడ్డను సరిచేసుకోవాలనే తపన, ప్రేమ - ఇదే అమ్మ తత్త్వం.

అమ్మ ప్రథమ గురువు. "గురుమూర్తిః" ఆమె "నిస్సంశయ", మన సంశయాలన్నిటినీ నివృత్తి చేస్తుంది - "సంశయఘ్నీ".

ఆమె "దక్షిణామూర్తి రూపిణి", "గురుమండల రూపిణి" "జ్ఞానదా", ఆమెది భేదమెరుగని విధానం ("నిర్భేదా"). మనలోని భేదభావనను నాశనం చేస్తుంది. "భేదనాశినీ" "నిర్ద్వైతా" "ద్వైతవర్జితా" అయిన అమ్మ మనకు ముక్తి నిస్తుంది. "ముక్తిదా", "సద్గతిప్రదా", "శివజ్ఞాన ప్రదాయినీ", " నిర్వాణ సుఖదాయినీ", "సద్యః ప్రసాదినీ", "కైవల్య పదదాయినీ" !

అమ్మ భక్తికి వశమవుతుంది. "భక్తివశ్యా", "భక్తనిధిః", "భక్తసౌభాగ్య దాయినీ", "భక్తప్రియా", "భక్తహార్ద తమోభేదభానుమద్భానుసంతతిః", "సమస్త

భక్త సుఖదా", "భక్తచిత్త కేకి ఘనాఘనా ".

అమ్మ బిడ్డలకు ప్రియమును చేస్తుంది "ప్రియంకరీ". మాతృశ్రీ అందుకే "నాది 'సరే'మంత్ర"మన్నారు. "నా మతం సర్వ సమ్మతం" అన్నారు.

సుఖములను ఇస్తుంది- "సుఖకరీ",
శుభములను ఇస్తుంది- "శుభకరీ",
శాంతమును కలుగచేస్తుంది - "శంకరీ".
అద్వైతమూర్తి అమ్మ !

"నిర్ద్వైతా", "ద్వైతవర్జితా", "భేదనాశినీ", "నిర్భేదా" "కేవలా" "ఏకాకినీ" అనే నామాలు అమ్మ అద్వైత స్థితిని తెలియచేస్తున్నాయి. మాతృశ్రీ చెప్పిన మాటలు మనకు ఈ భావనను చక్కగా అర్థం చేసుకొనటానికి ఉపకరించుతాయి. "అద్వైతం అంటే ద్వైతం గానిది. రెండుగా కన్పిస్తున్నా ఆ రెండూ ఒకటని గుర్తించే స్థితి అద్వైతం. రెండు లేని స్థితిలేదు. కనబడేదీ, చూచేదీ ఉన్నది" అన్నారు.

సర్వసృష్టీ భావనామయం.

"భవోయం భావనామాత్రం న కించిదితి నిశ్చయం"
(అష్టావక్ర గీత)

అమ్మ మన కర్మను, భావమును - సర్వమునూ తెలుసుకుంటుంది. "కృతజ్ఞా", "భావజ్ఞా", "సర్వజ్ఞా" ఆమె "భావమాత్ర సంతుష్ట".

"సదాతుష్టా", "స్వాత్మారామా", "స్వభావమధురా" అయిన అమ్మను భావనతో తెలిసికొని, భావనకి అందని దానిని భావాతీతానుభవాన్ని పొందాలనే మన ప్రయత్నం.

మాతృతత్త్వాన్ని వివరించే నామాలు భావన చేయటంద్వారా లలితా స్వరూపులం అగుదుముగాక !

("ముముక్షువు" మాసపత్రిక 1997-జనవరి సంచికలో ప్రచురితంది)

తల్లి హృదయం

(...మాతృశ్రీ అనసూయాదేవి - జిల్లెళ్లమూడి అమ్మ - తత్త్వాన్ని మనకు పట్టిచూపే ప్రయత్నమే ఈ వ్యాసం -షం॥....)

మమతామయి, అనురాగ ప్రేమ వాత్సల్యాలు మూర్తీభవించిన అమ్మను గురించి చదివినా, విన్నా మన హృదయాలు పవిత్రమవుతాయి. మన భావాలు విస్తృతమయి దైవత్వం వైపుకు పరుగులిడుతాయి.

"ఆత్మవత్సర్వభూతాని" అని మన మహర్షులు ఉపనిషత్తులలో చెప్పారు. మనిషికి తనకంటే ఈ లోకంలో అధికమైనదీ, ప్రియమైనదీ తన సంతానమే. అందుకే అమ్మ ఈ జగత్తునంతా తన సంతానంగా చూసింది. మన బిడ్డలను మనం ఎలా ప్రేమిస్తామో, అందరినీ - సర్వజీవులనూ - అలాగే ప్రేమించమని అన్నది.

సోదరులు శ్రీఅచ్యుతుని రామకృష్ణశర్మగారు ఒకసారి అమ్మను "నీవెవరివి ?" అని అడిగారు.

"అమ్మను" అన్నారు.

"ఎవరికి ?"

"నీకూ, మీకూ, అందరికీ - పశుపక్ష్యాదులకూ, క్రిమికీటకాదులకూ........" అని అమ్మ సమాధానం.

అమ్మ జీవితంలోని కొన్ని సందర్భాలను పరిశీలించుకుందాం:

ఒకసారి అమ్మకు నివేదనకు తయారుచేసిన అన్నాన్ని పిల్లి ముట్టుకున్నదని మరల తయారుచేయాలని అనుకుంటున్న విషయం అమ్మ గమనించి, "పిల్ల ముట్టుకున్నది" అని సరిచేసి, సర్వులకూ తాను అమ్మనన్న విషయాన్ని గుర్తుచేసి అందరినీ ముగ్ధులను చేశారు.

* * *

"మాతృశ్రీ" పత్రిక వచ్చినదని అమ్మకు ఇచ్చినపుడు, పత్రిక కాదు నాన్నా ! పుత్రిక !" అని అమ్మ సవరించారు.

*   *   *

"అక్షరదీపాలు" గ్రంథాన్ని హైదరాబాదు సోదరులు శ్రీవీరమాచనేని ప్రసాదరావుగారు, డాక్టరు శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు ఇంగ్లీషులోనికి అనువదించే సందర్భంలో, ఆ వాక్యాలన్నీ "అంతా అదే"ననే పరమార్థం తెలియచేస్తాయని అమ్మ చెప్పిన మాటను గుర్తు చేసుకున్నారు. కొన్ని వాక్యాలు ఆ అర్థానికి భిన్నంగా ఉన్నాయేమోనని భావించి, వాటిని అమ్మ దృష్టికి తీసుకునివచ్చి, తొలగించేందుకు అమ్మ అనుమతి కోరారు. అమ్మ సంపూర్ణత్వానికి అవి విరుద్ధంగా లేవని వ్యాఖ్యానించి అక్కడ ఉన్నవారందరినీ ఆశ్చర్యచకితులను చేయడమే కాక, ఇలా అన్నారు: "నా ప్రతిష్ఠకు భంగం వస్తుందని మీ ఆలోచనా ? నాన్నా! ఒకటి అడుగుతాను – ఆలోచించండి. ఒక తల్లి ఉన్నది. నలుగురు కొడుకులను కన్నది. అందులో ముగ్గురు కొడుకులు మీ ఆలోచన ప్రకారం బుద్ధిమంతులూ, తెలివిగలవాళ్ళూ; ఒకడు మాత్రం దుర్మార్గుడూ, మందబుద్ధీ. మరి ఆ ముగ్గురివల్లా ఆ తల్లిదండ్రులకు పరువుప్రతిష్ఠలు కలిగితే, ఆ ఒక్కడివల్లా వారికి అపకీర్తి వస్తున్నదికదా అని, ఆ ఒక్కడినీ తమ సంతానం కాదంటారా ? లేక ఆ సంతానాన్ని రూపుమాపుదామను కుంటారా ?" ఆ చివరి మాటలు పలుకుతుంటే అమ్మ కంఠస్వరం గద్గదమయింది.

అమ్మ వాక్యాలు ఆమెకు సంతానమే. వాటిపట్ల ఆమె కంత మమకారం – ప్రేమ.

*   *   *

అమ్మకు ఒకసారి చాలా పెద్ద గడ్డ(రాచకురుపు) లేచి విపరీతంగా బాధపెడుతున్నప్పుడు, "ఎందుకమ్మా నీకీ గడ్డ ?" అంటే, "అదీ బిడ్డే,

(v)

గదరా, నాన్నా ! మీకంటే అదే నయం, నన్నంటిపెట్టుకుని ఎప్పుడూ ఉంటుంది !" అని అన్నారు.

1969 జూన్ నెలలో తుఫానుతో వరద వచ్చి జిల్లెళ్ళమూడి జలమయం అయింది. అందరూ హాహాకారాలు చేస్తూ గుండెలవిసి తల్లడిల్లారు. అమ్మ గదిలోనుండి వెలుపలికి వచ్చి నాలుగుదిక్కులూ ఒక్కసారి కలయచూశారు. ఎంతో ఆశతో సోదర సోదరీమణులు అమ్మవంక చూస్తున్నారు. అమ్మ పెదవులపైనా, కనుకొలుకుల్లోనూ దరహాసదీప్తులు భాసించాయి. అమ్మ "ఆడపిల్లను ఊరికే పంపటమెందుకూ ! చీరె, రవికా, పసపుకుంకుమలూ, కొబ్బరిచిప్పలూ గంగా భవానికి ఇచ్చి పంపండి !" అన్నారు. వరద తిరుగుముఖంపట్టింది.

* * *

"నక్సలైట్లూ నాబిడ్డలే" అని అన్నారు. ఒక సందర్భంలో అమ్మ. "కొందరు పిల్లలు అడిగి తీసుకుంటారు. కొందరు పిల్లలు అడక్కుండా తీసుకుంటారు. కొందరు పిల్లలు ఆగడం చేసి తీసుకుంటారు. వీరు ఈరకం పిల్లలు........" అని విలాసంగా వర్ణించారు.

* * *

ఈ సృష్టినంతనూ తన సంతానంగానే భావించి మురిసిపోయే అమ్మను, నెల్లూరు వెళ్ళినప్పుడు శ్రీరంగనాథస్వామివారి ఆలయానికి, ఆ ఆలయ నిర్వహణాధికారులు సభక్తికంగా ఆహ్వానించారు. అమ్మ ఆలయానికి వెళ్ళారు. ఆలయంలో ప్రవేశించగానే తల్పశాయి అయిన శ్రీరంగనాథుడు కన్పించాడు. గర్భగుడిలోని శ్రీరంగనాథుని సమీపించారు. వాత్సల్యం పొంగులువారటం, ముఖంలో, కన్నుల్లో ద్యోతకమయింది. స్వామిని ప్రేమగా నిమరటం ఆ ప్రేమాన్విత స్పర్శతో పులకించిపోవటం ప్రక్కనున్నవారికి తెలుస్తూనే ఉంది. అర్చకస్వాములందించిన జలాన్ని ప్రేమతో చిలకరించారు. తనకు వేసిన సుమమాలను తన మెడనుండి తీసి అనురాగపూర్వకంగా శ్రీరంగనాథుని అలంకరించారు. అమ్మ

మాములుగా ఏ బిడ్డ ఇంటికి వెళ్ళినప్పుడయినా ప్రేమను ఎలా అభివ్యక్తం చేస్తారో, ఆ దేవాలయంలోనూ అలాగే చేశారు.

అమ్మ హైమాలయంలో ప్రతి పర్వదినంలో ఇలాగే చేస్తూ ఉండటమూ, అందరూ పులకరించటమూ అనుభవవిదితమే.

*　　　*　　　*

"నేను గురువును కాదు, మీరు శిష్యులు కారు – నేను అమ్మను; మీరు శిశువులు(బిడ్డలు)" అన్నారు అమ్మ.

*　　　*　　　*

"అమ్మ" అంటే ! -

అమ్మ వివిధ సందర్భాల్లో వివరించారు –

"తల్లి అంటే తొల్లి".

"అమ్మ అంటే అంతులేనిదీ, అడ్డులేనిదీ".

"ఏం చేసినా మారనిదీ, చెదరనిదీ, ఎక్కడుంటే, అదే తల్లి తత్త్వం".

"రక్షణే తల్లి".

"ఎక్కడ బాధ్యత నిర్నిబంధంగా స్వీకరించబడుతుందో, అదే మాతృతత్త్వం."

"తల్లే బిడ్డకు 'సరెండర్' అవుతుంది. అదే తల్లి లక్షణం. అదే తల్లికి ఇష్టం".

"తనను కన్నవాళ్ళమీదకంటె, తాను కన్నవాళ్ళమీద ప్రేమ ఎక్కువ".

తల్లి ధర్మం కోసమే రాక

"నేను ప్రత్యేకించి ఏ ధర్మం కోసమూ రాలేదు. తల్లి ధర్మంకోసం వచ్చాననుకుంటున్నాను. ఈ రూపం అది. ఈ స్థానం అలాంటిది. కనుక నాకు ఎవరైనా, ఎలాంటివాడైనా బిడ్డే. మీరు నన్ను వెతకడం కాదు. నేనే

మిమ్మల్ని వెతుక్కోవాలి. నా బాధ్యత అలాంటిది. అందరికీ సుగతి అన్నానంటే, మీదేంలేదు కనుక; మీరు బురద పూసుకున్నా, దాన్ని కడిగి శుభ్రపరచవలసిన బాధ్యత నాది. దానికి మాతృతత్త్వం కావలసి వచ్చింది- వచ్చాను" అన్నారు అమ్మ.

అమ్మ తన అవతార లక్షణాన్ని చక్కగా వివరించారు. దుష్టసంహారమంటే దుష్టులను సంహారం చేయడమేనని మన భావన. కాని అమ్మ వారిలోని దుష్టగుణాన్ని మాత్రమే సంహరించి, వారిని రక్షించాలి అని చెప్పారు. నరకాసుర వధను గురించీ, నక్సలైట్లను గురించీ అమ్మ మాటలు ఈ భావాన్ని స్పష్టంగా తెలియచేస్తాయి.

"గుణభేదమే లేని నాకు కులభేదమేమిటి ?" అన్నారు. మన చర్యలకు బాధ్యత మనకు ప్రేరణ ఇచ్చిన శక్తిదేనని చెపుతూ మీదేమున్నది ?" అని ప్రశ్నించారు. పైగా మరొకసారి అన్నారు - "మంచివారిని లోకమెలాగూ ఆదరిస్తుంది; గౌరవిస్తుంది; ప్రేమిస్తుంది; చెడ్డవారిని అందరూ అగౌరవిస్తారు. అసహ్యించుకుంటారు, బహిష్కరిస్తారు. ఇక నేనూ వారిని దగ్గరకు తీసుకోకపోతే వారి గతి ఏమవుతుంది ? కాకపోతే వారిని లాలింపుతో బుజ్జగింపుతో సరిచేసుకోవాలి. అందుకే నా ఒడిలోనూ, ఈ ఆవరణలోనూ వారికి తావున్నది" అని.

"తల్లికి తప్పే కనిపించదు" అని ఉద్ఘాటించారు.

"పిల్లల ప్రత్యేకతలను బట్టి కాదు, తల్లికి గుర్తు ! తన పిల్లలు కాబట్టే" అన్నది. "గొఱ్ఱెల కాపరికి ఏ గొఱ్ఱెకు ఆ గొఱ్ఱె గుర్తుంటుంది" అన్నారు అమ్మ.

"అమ్మకు ప్రేమించటం సహజం !
అమ్మ ప్రేమకు అవధులు లేవు !"

అమ్మ ఆలోచనలు - విచారములు

ఒకసారి "సతులకై కొన్నాళ్ళు.........సుతులకై కొన్నాళ్ళు ......" అనే త్యాగరాజు కీర్తన వింటూ "నా పరిస్థితీ అదే - నాకిదంతా

ఈ సంతానంకోసమేగదా ! నేను స్నానం చేసినా చీరకట్టుకున్నా, అది మీ కోసమే" అన్నది అమ్మ.

మరొకసారి "నాకేదయినా ఆలోచన ఉంటే మీరు తినటంగురించే - ఎవరు తిన్నారో, ఎవరు తినలేదోనని ! నాకేదయినా విచారమంటూ ఉంటే, మీకు తృప్తిగా పెట్టుకోలేకపోతున్నాను-అనే !" అని స్పష్టం చేశారు అమ్మ.

మనకూ ఆనందం ఉంటుంది. అమ్మకూ ఆనందం ఉంటుంది. మనకూ విచారం ఉంటుంది. అమ్మకూ విచారం ఉంటుంది. అయితే మన ఖేదమోదాలు సంకుచిత పరిధులకు పరిమితమై ఉంటాయి. అమ్మ ఖేదమోదాలు సర్వసృష్టినీ ఆధారం చేసుకుని అల్లుకుని ఉంటాయి.

తల్లి స్వభావం

"ఆకలి బాధను మీరు సహించవచ్చుగాని, నేను సహించలేను. అది నాకే బాధ" అన్నారు అమ్మ ఒకమారు.

ఆకలి రుచితెలిసిన అమ్మ అహరహమూ అందరి ఆహార విషయంలోనూ ఎంతో శ్రద్ధతీసుకొనేవారు.

"ఆకలికి బీదవాడనీ, భాగ్యవంతుడనీ భేదమేమున్నది? భాగ్యవంతుడికి యినపపెట్టెలోని డబ్బుగాని, బ్యాంకులోని డబ్బుగాని, మరెక్కడయినా తనకోసం తయారు చేస్తున్న విందుగాని-ఆకలిని తీర్చగలుగుతుందా ? కనుకనే నేనెప్పుడూ మీ బీదతనాన్నిగాని, భాగ్యాన్ని గాని చూసి అన్నం తినమని చెప్పను - మీ ఆకలిని చూసి మాత్రమే చెపుతాను. అన్ని అంతస్థులకూ, స్థితులకూ, వయస్సులకూ, యోగ్యతా యోగ్యతలకూ అతీతమైన ఆకలి బాధ భరించటం కష్టం నాన్నా !" అని వివరించారు.

మనకు అన్నం పెడుతూ, మనం తింటుంటే తాను త్రేన్చుతూ "మీరుతింటే నేను తిన్నట్టే, నాన్నా !" అంటారు. "మీకు పెట్టుకోకపోతే, మీరు తినకపోతే నేను చిక్కిపోతాను". అని పదేపదే అంటూ, ఆప్యాయంగా,

ఆనందంగా కబుర్లూ కథలూ చెపుతూ, అల్లరి పిల్లలను తల్లి చంకన వేసుకుని ఆకాశాన్నీ, చందమామనూ చూపించి అన్నం తినిపించినట్టు, స్వయంగా అన్నం పెట్టిన తరువాత వాళ్ళ మూతిని తానే కడిగి తానే తన చీరచెంగుతో తుడుస్తారు. ఆ తరుణంలో అమ్మ నయనాంచలాల దీప్తిలో ఎంతో సంతృప్తీ, ఆనందమూ స్పష్టంగా కనిపిస్తాయి.

అలాగే, అందరికీ వస్త్రాలు పెడుతారు. వాళ్ళు కట్టుకుంటే తాను ఆనందిస్తారు. "ఈ చీర నేను కట్టుకునే కంటే నువ్వు కట్టుకుంటేనే ఎంతో బాగున్నదమ్మా !" అంటారు.

ఒకసారి ఒకసోదరుడు "మీ ధ్యేయమూర్తి ఎవరమ్మా ?"

అని ప్రశ్నిస్తే, సమాధానంగా "మీరే నాధ్యేయమూర్తులు" అనీ,

"మీరు దేవుణ్ణి చూశారా ?" అన్న మరొకరి ప్రశ్నకు "మీరు దేవుడుకాకపోతే గదా !" అనీ సమాధానం చెప్పారు అమ్మ.

"కనిపించేదంతా దైవమే" అమ్మదృష్టిలో !

అందుకే అంతశ్రద్ధగా, జాగ్రత్తతో, ఎవరికి ఏది అవసరమో ఆవిధంగా అమ్మ పెట్టేవారు. ఇది అంతా మనకు నేర్పటానికే, "మీచేత పెట్టించటానికే నేను పెట్టేది" అని అమ్మే చెప్పారుగదా !

ఒకసారి, బాపట్లలో ఇండ్లు తగులబడి సోదరీ సోదరులు ఆహారపానీయాలు అందక ఇబ్బందిలో ఉన్నారు. "విశ్వజననీ పరిషత్" వారు వారికి అన్నం అందించేపనిని ఆనందంగా స్వీకరించి అన్నం పొట్లాలు తయారుచేస్తున్నారు. ఇంతలో ఒక సోదరుడు తనకు సందేశమివ్వమని కోరగా, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయమని అమ్మ సందేశం ఇచ్చారు. ఆ సోదరునికి, ఆ సందేశంలోని సూచన, సందేశం బోధపడలేదు. అమ్మవైపు చూస్తూ నిలబడి ఉన్నాడు. అమ్మే మళ్ళీ వివరించి "వాళ్ళు అక్కడ ఆకలితో ఎదురుచూస్తూ ఉంటారు. నలుగురూ కలసి త్వరగా వారికి అన్నం అందించండి" అన్నారు. ఆ మాటలు పలికేప్పుడు అమ్మ

కంఠం గద్గదమైంది. ఆదరంగా పెట్టటమే గాక, ఆకలితో ఉన్నవారికి త్వరగా అందించాలని అమ్మ ఎంత ఆతురత చూపిస్తున్నారో చూస్తే, మనకు తల్లి హృదయం అర్థమవుతుంది.

ఆవుముందు మేత లేకపోతే, మేత వేసేంతవరకూ, ఎవరినీ తన ఎదురుగా కనిపించనివ్వరు. ఆకలితో ఉన్నవారిని అన్నం తినేంతవరకూ వెంటపడతారు.

అమ్మ చిన్నతనంలోనే ఒకరోజున "అన్నయ్య ఇంకా అన్నానికి రాలేదు. అందరం తిన్నాం. తల్లికి ఒకబిడ్డ రాకపోయినా దిగులే" అన్నారు అమ్మ.

"అదేమిటమ్మా, అన్నయ్యను పట్టుకుని బిడ్డ అంటావు !" అని అన్నది మరిడమ్మగారు.

"ఎవరు అన్నం తినకపోయినా బాధపడేతల్లి ఉన్నది" అన్నది అమ్మ.

ఒకసారి "మీరు అడిగిందల్లా ఇవ్వను, మీకు ఏంకావాలో తెలుసుకుని అది మాత్రమే యిస్తాను" అన్నారు అమ్మ.

ఒక సోదరుడు రాచఉసిరికాయలు అమ్మకు నివేదన చేశాడు. పళ్ళన్నీ అమ్మ ఒక్కతే తింటున్నది. "అదేమిటమ్మా, ఎదురుగా ఉన్న సంతానాన్నే విస్మరించావు !" అని అడిగితే, "అసలే మీకందరికీ జలుబుచేసి ఉన్నది. ఇక ఆ పళ్ళు తింటే మీరు మరీ బాధపడవలసి వస్తుందని అన్నీ నేనే తింటున్నాను" అని అన్నారు అమ్మ.

మనం మన కష్టాలను గురించి అమ్మకు విన్నవించుకుంటాము. "చెప్పుకుంటే తీరుతుందని మీరు చెప్పుకుంటారు. నేను చెప్పుకుంటే మీరు బాధపడతారని నేనే పడతాను" అన్నారు అమ్మ ఆర్ద్ర హృదయంతో. ఇదీ తల్లి హృదయం.

ఒకసారి శ్రీశ్రీశ్రీలక్ష్మణయతీంద్రులవారు తన్మయులై "క్వ ణ త్ కి ం కి ణి" అన్న కావ్యంనుంచి కన్నయ్యను గురించి కవితాగానం చేస్తున్నారు. వారిని చాలా బరువుగా ఉన్న పూలమాలతో అలంకరించి సత్కరించారు కార్యకర్తలు. దాని దారం వారిమెడను ఒరుసుకున్నది. ఆబాధను అమ్మ చూచి శ్రీరామచంద్రమూర్తితో చెప్పి దండ తీయించారు. అప్పుడు శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులవారు చిరునవ్వుతో "అమ్మ అంటే ఇదీ. 'అమ్మ' నిర్వచనం కోసం నిఘంటువు చూడకండి. ఇక్కడ చూడండి! .... ఇది అమ్మ అంటే !" అని నిర్వచించారు.

అమ్మ తన బిడ్డల బాధను ఎంతమాత్రం చూడలేరు.

ఒకసారి శ్రీమతి సక్కుబాయి, అమ్మను తనకారులో ప్రయాణం చేయమని కోరింది. అమ్మ చిరంజీవులు లాల, పార్థులను తనవెంట రమ్మన్నారు. బాపట్లలో రవిని కూడా ఎక్కించుకున్నారు. కారు రేపల్లె దారికి మళ్ళింది. భట్టిప్రోలు వచ్చింది. అది లాల, పార్థుల జన్మస్థలం. అమ్మే ఆ కారును వాళ్ళ ఇంటికి పోనీయమని చెప్పారు. నిద్రిస్తున్న ఆ తల్లిదండ్రులను లేపారు. ఆ గృహిణి "సాయంకాలంనుండీ, ఈ దీనురాలిపై అమ్మకు దయ తప్పిందని బాధపడుతున్నాను. అది సరికాదని చెప్పటానికి నీవే స్వయంగా వచ్చావా ! ఎంతకరుణామయివమ్మా !" అని కన్నీటిలో కరిగిపోయింది.

"అమ్మా ! పిలవకుండానే వాళ్ళఇళ్ళకు వెళ్ళావేమమ్మా !" అని అడిగితే, "వాళ్ళు రమ్మని పిలిచేదేమున్నది ? వాళ్ళబాధే నన్ను పిలిచింది. బాధకంటే వేరే పిలుపేమున్నది ?" అన్నారు అవ్యాజానురాగమూర్తి అమ్మ.

కొండయ్య అనే సోదరులు గుంటూరులో సోడా వ్యాపారం చేసుకొనేవారు. అమ్మ గుంటూరు వచ్చినప్పుడు తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు. "నా కోసం ఏమీ ఖర్చు పెట్టవద్దు. నాకోసం మీరు తిరగవద్దు. నా వీలు చూచుకొని నేనే మీ ఇంటికి వస్తాను. వచ్చి మీ ఇంట్లో లక్ష్మి(కొండయ్యగారి శ్రీమతి) ఆపూట ఏమి వండితే, దానినే

తింటాను. నా కోసం చీరెలు, సారెలు కొనవద్దు. అటు చూడు ! – నువ్వు చినిగిపోయిన చొక్కా తొడుక్కుని నాకు కొత్త చీరె కొంటే మాత్రం నాకేమి హాయిగా ఉంటుంది ?" అని, ఆ రాత్రి వాళ్ళ ఇంటికి వెళ్ళింది. పూజ అయిన తరువాత అమ్మ తానే స్వయంగా వంటింట్లోకి వెళ్ళి అన్నమూ, పులుసూ కలుపుకుని తింటూ, వంట చాలా బాగున్నదని మెచ్చుకున్నారు.

1962 లో చీరాలలో బెస్తవాళ్ళ ఇళ్ళకు, యానాదుల ఇళ్ళకు వెళ్ళిన అమ్మకు విధినిషేధాలేమున్నాయి !

సోదరుడు శ్రీ నంగాపు శ్రీనివాస్, అతని భార్య రమణమ్మ – "అమ్మ మన ఊళ్ళో ఉన్నప్పటికీ మన ఇంటికి పిలవలేము గదా !" అనుకున్నారు. ఆ విషయం గ్రహించి పిలవకపోయినా వారింటికి వెళ్ళి "పిచ్చివాడు. అమ్మను పిలవటానికి ఒక తాహతు కావాలి అనుకుంటున్నాడు. అదేమీ అవసరం లేదు....." అంటూ వారి పేద గుడిసెలోకి దూరి వెళ్ళి వాళ్ళు పెట్టిన చీరె కట్టుకుని "మేడలో కంటే, గుడిలో కంటే, గుడిసెలోనే హాయిగా ఉంటుంది" అన్నారు అమ్మ.

అభయ ప్రదాత

అనేక పర్యాయాలు "ఈ సృష్టినాది" అనీ, "మీరంతా నా సంతానమే" అనీ, "మిమ్మల్ని శుభ్రపరచవలసిన బాధ్యత నాదే" అనీ, "మీకు ఏది వచ్చినా – సుఖంగాని, దుఃఖం కాని అది నేనిచ్చినదే" అనీ తత్త్వబోధచేసిన అమ్మ "నేను నీవెన్నంటే ఉంటాను" "నీకేమీ భయంవద్దు" "నీ బాధ్యత నాది" "ఈ విషయం నేను చూచుకుంటాను" మొదలైన వ్యక్తిగత వాగ్దానాలు చేసిన సంఘటనలు అరుదుగా అయినా ఉన్నాయి.

శ్రీకొండముది శ్రీరామచంద్రమూర్తి కుమారుడు ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఒక లేఖ వ్రాసి ఇంటిలో ఉంచి అదృశ్యమయినాడు ఒకసారి. తల్లడిల్లుతున్న తండ్రికి అమ్మ "ఇకనుండి నీవా బాధ నాకు వదిలెయ్యి – నేను చూచుకుంటాను. నీవు నిశ్చింతగా ఇంటికి వెళ్ళు" అని హామీ ఇచ్చారు. "దుఃఖించే హృదయానికి ఉపశమనం అవసరం.......

ఆ దుఃఖ ప్రభంజనానికి బాధితుని ప్రాణదీపం కొండెక్కకుండా కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది !" అన్నారు అమ్మ ఆ సందర్భంలో.

సోదరుడు శ్రీ తూనుగుంట్ల త్రిలోక అప్పారావు – ఏలూరుకు చెందిన నూనె పీపాలతో ఉన్న లారీని దొంగతనంగా డ్రైవర్ తరలించినప్పుడు, శ్రీమతి కుసుమాంబకు (అప్పారావుగారి భార్యకు) ఫోనులో అమ్మ "నువ్వేమీ భయపడొద్దు, నేను ఉన్నాను. అన్నీ చూసుకుంటాను." అని హామీ ఇచ్చారు. ఆతరువాత డ్రైవర్ లో పరివర్తన వచ్చి కథ సుఖాంతం అయింది.

రక్షణ

సోదరి కుమారి ఝాన్సీలక్ష్మి జుట్టు మోటారులో చిక్కుకున్నప్పుడూ, నీళ్ళట్యాంకు శుభ్రపరచటానికి వెళ్ళి ముప్పై అడుగుల ఎత్తునుండి ఒక విద్యార్థి క్రిందపడినప్పుడూ,ఎలక్ట్రిక్ తీగతో చేయికాలి సోదరుడు జేమ్సు ప్రమాదంనుంచి బయటపడినప్పుడూ, గుంటూరునుంచి వచ్చిన సోదరీమణులకు బస్సు దొరకదని తానే స్వయంగా కారులో వెళ్ళి బాపట్లలో దిగబెట్టినప్పుడూ – అమ్మ అయా సన్నివేశాల్లో ఎలా రక్షించారో తలుచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

త్యాగమూర్తి

ఒక గ్లాసు మజ్జిగ త్రాగితే తగ్గిపోయే తన కడుపులోని మంటను, అవి తాను త్రాగితే తన పిల్లలకు ఎక్కడ తరిగిపోతాయో అని, ఆ మంటను అలాగే సహించటం తల్లికి తప్ప ఎవరికి సాధ్యమవుతుంది !

ఒక వైద్యుడు తన వైద్యవృత్తిని ప్రారంభిస్తూ, తాను తనవృత్తిలో ప్రగతిని సాధిస్తే అమ్మకు ఏమయినా సమర్పించుకుంటానని అనుకున్నాడు. వృత్తిలో అసాధారణమైన విజయం లభించింది. ఆయన అమ్మకు ప్రయాణాలకు ఉపయోగపడుతుందని 'అంబాసిడర్' కారును సమర్పించుకుంటానని అమ్మతో విన్నవించుకొన్నాడు.

"పదిమందికీ పనికివచ్చే పని చెయ్యి. ప్రస్తుతం పిల్లలు భోజనం చేయటానికి సరైన వసతి లేక ఏదో షెడ్డు వేయించాలనుకుంటున్నారు. అందుకు నీకు తోచినంత యివ్వు" అని అమ్మ అనగానే, ఆ వైద్యుడు ఆనందంగా అంగీకరించి, అలాగే చేశాడు.

"నాకు సరదా లెందుకు నాన్నా ! పిల్లల అవసరం చూడండి. వారి యిబ్బందులు తీర్చండి" అని ఒక్క తల్లి తప్ప ఎవరనగలరు !

మార్వాసోదరి అమెరికా వెళుతూ "అమ్మా ! నేను కొన్ని నెలలు ఉద్యోగంచేసి కొంతడబ్బు నిలువచేస్తాను. ఆ పైకంతో నీకు కారు పంపమంటే కారు పంపుతాను, లేకపోతే నేను మళ్ళీవచ్చి నీదగ్గర కొంతకాలం గడుపుతాను" అంటే అమ్మ ఆమెనే రమ్మన్నారు.

"తల్లికి బిడ్డే సొమ్ము" అని చిన్నతనంలో చెప్పారు గదా అమ్మ !

అలాగే సోదరుడు రిచర్డ్సను పుస్తకం అమెరికాలో ముద్రించేబదులు జిల్లెళ్ళమూడి వస్తే, యిక్కడే ఉండి ముద్రణ చేయించవచ్చునని చెప్పారు - మమతల ఒడి అయిన అమ్మ.

జిల్లెల్లమూడి - అందరిల్లులో - దొంగలు పడిన వార్తవిని అమ్మనూ, జిల్లెళ్ళమూడిలో ఉన్న సోదరీసోదరులనూ చూచి వద్దామని ఏలూరునుండి కొంతమంది సోదరులం వెళ్ళాము. "మిమ్మల్నందరినీ చూడాలని అనిపించింది, ఇలా జరగకపోతే మీరందరూ యిప్పుడు వచ్చేవారుకాదు గదా ! అని ఎంతో ముచ్చటపడిపోతూ అన్నారు అమ్మ.

సేవామూర్తి

అమ్మ ఎందరో బిడ్డలకు తాను స్వయంగా సేవ చేసేవారు. సంస్థలో ఉన్నవారందరూ ఒకసారి 'ఫ్లూ' జ్వరంతో బాధపడుతూ ఉన్నప్పుడు, అమ్మే స్వయంగా జావకాచి అందరికీ అందచేశారు.

ఒకసారి రాధన్నయ్య పాడుతున్నాడు. అతడికి కాలినొప్పి ఉంది.

అది ఎవరికీ తెలియదు. అమ్మ అన్నయ్య కాలినొప్పిని గ్రహించి, అతని కాలిపై మర్దన చేయటంతో ఆ బాధ ఉపశమించింది.

గుండేలురావుగారికీ, హస్పిటల్‌లోని కుష్ఠరోగులకూ - మరెందరికో అమ్మ స్వయంగా సేవలు చేశారు.

అమ్మ తనకు ఎన్ని బాధలొచ్చినా, ఎంత కష్టమయినా సహిస్తారు. కాని, బిడ్డలబాధను చూచి కరుణతో చలించిపోతారు. మన కష్టాలను తన కష్టాలుగా,మన ఆనందాన్ని తన ఆనందంగా భావిస్తారు.

మానసికవ్యాధితో బాధపడుతున్న సోదరీసోదరులను ఎందరినో అమ్మ తన దగ్గర ఉంచి, వారికి కొండంత ధైర్యాన్నిచ్చి వారి ఆలనా పాలనా ప్రత్యేక శ్రద్ధతో చూడటం అందరికీ తెలిసిన విషయమే.

అందరికీ ప్రేమతో, ఆదరంతో ఆనందంతో అన్నం పెట్టే అమ్మ - ఒక్కొక్కరు వెళ్ళిపోతుంటే ఎంతో బాధపడతారు.

గ్రీకు సోదరుడు పోలో, అమెరికా సోదరి మార్వా, సోదరుడు రిచర్డు వెళ్ళేటప్పుడు అమ్మ చలించి కన్నీరు పెట్టుకున్నారు - "వారు వెళ్ళినందుకు కాదురా, వాళ్ళు నన్ను వదలి ఉండలేరనే బాధ తలపుకు వచ్చి !" అని అమ్మ అన్నారు. అంత సున్నితమెంది అమ్మ హృదయం. తాను మమకారం వదులుకోననీ, మమకారాన్ని అందరూ విస్తృతం చేసుకోవాలనీ కదా అమ్మ ఉపదేశం ! ఆ ప్రేమకు హద్దులు - పరిమితులు లేవు. ఆమె ప్రేమ సహజం.

అందుకే ఆమె జగత్తుకు మాత అయింది.

.....శ్రీ కొండముది రామకృష్ణ అన్నయ్య ప్రథమ వర్ధంతి సందర్భంలో అమ్మ శ్రీచరణ సన్నిధిలో 10-9-99 న చదివిన వ్యాసం. ....

("ముముక్షువు" మాసపత్రిక 2000, మార్చి- సంచికలో ప్రచురితమైంది.)

అనసూయ తత్త్వం

అమ్మ అనుగ్రహ రూపిణి. వాత్సల్య నిధి. మందమతులయిన మనలను ఏదో విధంగా తీర్చిదిద్దాలని అమ్మకు తపన, మనం గ్రహించుకోలేమని దయతో ఎన్నో నిర్వచనాలను చెప్పారు. తన తత్త్వాన్ని విడమర్చి మనకు తెలియ చెప్పారు. అలాంటి ఒక విషయాన్ని గురించి మీ ముందుంచుతాను.

"రాగ ద్వేషాసూయలను పారద్రోలేదే అనసూయ. అదే అనసూయత్వం. ఈ అనసూయ తత్వం" అని చెప్పారు అమ్మ. (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు, పుట 88)

"రాగమంటే 'కావాలి' అని గదా, ఒక విధంగా ద్వేషం కూడా రాగమే. ఉదాహరణకు - ఒకరిని చంపాలి అనేది ద్వేషం. ఆ చంపడం అనేది కోరికేగా ?" అని రాగద్వేషాలను గురించి నిర్వచించారు అమ్మ. (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు పుట. 282) మానవుని నడక నవగ్రహాల పైన ఆధారపడి లేదు, రాగద్వేషాలనే రెండు గ్రహాలమీద. ఆరెంటికీ ఆధారం 'నేను' అన్నారు అమ్మ (అమ్మ-అమ్మవాక్యాలు. 300)

"రాగద్వేషాలు రహితమైనదే అనసూయ"(అమ్మ-అమ్మ వాక్యాలు489) "రాగమంటే, అది కావాలి, అనుకోవడం", అది తనది అనుకోవడం, అదీ తనూ ఒకటే అనుకోవడం" అని రాగం యొక్క పరిణామక్రమాన్ని సోపాన పరంపరగా స్పష్టపరిచారు. (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు, పుట 281)

భగవద్గీత రాగద్వేషాల గురించి క్రింది విధంగా అంటుంది -

"రాగద్వేష నియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి" (గీత : 2-64)

తన అధీనముగావించుకొనిన అంతఃకరణము గల సాధకుడు, తనకు వశమైనట్టి రాగద్వేషములను వదిలిన యింద్రియములతో, విషయములలో తిరుగాడుచుండియూ, అంతఃకరణ ప్రసన్నత పొందుచున్నాడు.

"ఇంద్రియస్యే న్ద్రియాస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయో ర్నవశమాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపన్థినౌ ॥" (గీత : 3-34)

ప్రతి యొక్క యింద్రియము విషయములోను **రాగద్వేషాలు** దాగి ఉంటాయి. మానవుడు ఆ రెండింటికీ లోబడరాదు, ఎందుకనగా అతని **కల్యాణమార్గాన్ని అడ్డుకొనే భయంకర శత్రువులు** ఈ రెండు మాత్రమే.

ఇక అసూయ లేకపోవటం అంటే ఏమిటో ఈ క్రింది శ్లోకం తెలియజేస్తుంది.

"నగుణాన్ గుణినో హన్తి స్తౌతి మంద గుణానపి ।
నాన్య దోషేషు రమతే సానసూయ ప్రకీర్తితా ॥"
(అత్రి స్మృతి - 34 శ్లో)

గుణవంతుని గుణములలో దోషమును వెదకనివాడు, పరుల స్వల్ప గుణములను సైతము ప్రశంసించువాడు, ఇతరుల దోషములను చూచి ఆనందింపనివాడు, అగునట్టి మనుష్యుని స్వభావమును అనసూయ (దోషదృష్టి లేని స్వభావము) అని యందురు.

అసూయ ఎంత చెడ్డదో, భగవద్గీత మనకు తెలియ చేస్తుంది. ఈ దోషదృష్టి వున్న వానికి భగవద్గీతను బోధించ వద్దని శాసిస్తున్నది. ఈ క్రింది గీత శ్లోకాలను పరిశీలించుదాం.

"యే మే మతమిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే ఽపి తేకర్మభిః ॥"
(గీత : 3-31)

ఏ మనుజులైనను సరే, దోషదృష్టిరహితులై, శ్రద్ధాళువులై , నా యీ మతమును సర్వదా అనుసరించుచున్నారో వారలు సకల కర్మలనుండి విముక్తులగుదురు.

"యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।
సర్వజ్ఞానవి మూఢాంస్తా న్విద్ధి నష్టా నచేతసః ॥ (గీత : 3-32)

ఏ మనుష్యులు నా యందు దోషారోపణ గావించుచు,నా యీ మతాన్ని అనుసరించక యుందురో, అట్టి మూర్ఖులను సకల జ్ఞానములలోను మోహితులయి నశించినవారిగానే తెలిసికొనుము.

పై భావాన్ని అమ్మ ఎంత సులభంగా చెప్పారో చూడండి :

"ఇతరులను ఎగతాళి చేసే వాడికి ఏమీ రాదు". (అఅవా. 1253) శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో నీవు అనసూయవంతుడవు కనుక ఈ రహస్య విద్యను బోధిస్తున్నాను అంటాడు.

"ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।" (గీత : 9-1)

అసూయ ఉన్నవాడికి ఆధ్యాత్మ విద్య బోధ చేయకూడదంటాడు.

"న చా శుశ్రూషవే వాచ్యం నచ మాం యోఽభ్యసూయతి ।"
(గీత :18-67)

అనసూయత్వం వలన కలిగే లాభాన్ని గురించి గీత యిలా అంటుంది.

"శ్రద్ధావా ననసూయశ్చ శృణుయాదపి యో నరః ।
సోఽపిముక్తః శుభాంల్లోకాన్ ప్రాప్నుయా త్పుణ్యకర్మణామ్ ॥
(గీత : 18 - 71)

ఏ మానవుడు శ్రద్ధాయుక్తుడై, దోషదృష్టి రహితుడై, గీతాశాస్త్రమును శ్రవణము చేయునో వాడునూ పాప విముక్తుడై ఉత్తమ కార్యాచరణము గావించువాడు పొందు శ్రేష్ఠ లోకముల పొందును.

ఇక అమ్మ విషయానికి వస్తే "తల్లికి తప్పదు కాదు, తల్లికి తప్పే కనిపించదు" (అఅవా. 271). ఇది (ఆ తప్పు) మీదని అనిపించదు నాకు. మీకు ఆ స్వభావాన్నిచ్చి ఆ ప్రేరణ చేసిన శక్తిదనిపిస్తుంది (అఅవా. 773)

అమ్మ గుణాలను దోషములుగా చూడటం కాదు, దోషాలను కూడ గుణాలుగా చూస్తారు. ఒకసారి యిలా అన్నారు. "నన్ను తిట్టకపోతే ఎవరిని తిడతావు ? నీ ఇష్టం వచ్చినట్లు తిట్టు. నాకేమీ బాధ లేదు. తీపి పదార్థం బాగా తింటుంటే వెగటు పుడుతుంది. మధ్యలో కారం తింటే ఎంతో బాగుంటుంది. నీ తిట్లూ అంతే". (అఅవా 1436)

"మీ మచ్చలు వెదకటం అంటే అదే నాకు పెద్ద మచ్చ". "నేను కని, పెంచిన పిల్లల్లో లోపం వెదకడమంటే లోపం నాదే" అన్నారు అమ్మ. (అఅవా. 3090)

"మీ అందరిలోని మంచియే నాకు కనబడుతూ ఉంటుంది". (అఅవా 1544)

"ఇతరులలో మంచి చూడటమే మన మంచితనం, ఇతరులలో చెడును చూడటం మంచితనం కాదు గదా ! సర్వత్రా మంచిని చూడటమే మంచితనం" అన్నారు అమ్మ. (అఅవా. 330). "ఎదుటి వారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం వెలుగుతుంది" (అఅవా. 969)

అందుకే అమ్మ "ఇతరులను విమర్శించటం అవివేకం" (అఅవా 266) "తనను తాను విమర్శించుకోవటం వివేకం" అన్నారు. (అఅవా. 265)

అందుకే మనం మనలను విమర్శించుకుని వివేకవంతులమవుదామా !

('విశ్వజనని' 2004 - జనవరి సంచికలో ప్రచురితమైంది)

సహనమూర్తి అమ్మ

సహనం, ఓర్పు, క్షమ, తితిక్ష - ఇవి అన్నీ దాదాపు ఒకే అర్థాన్నిస్తాయి. మనం ఇతరులను ప్రేమించాలి అంటే సహనం, ఓర్పు ఎంతో అవసరం.

అమ్మ సహనాన్ని గురించి ఇలా అన్నారు -

"తన ఇష్టాన్ని చంపుకుని, ఒకరి ఇష్టాన్ని - తన ఇష్టం చేసుకోవటమే సహనం. అది కురుపే కావచ్చు - జ్వరమే కావచ్చు. అట్లకాడ గుచ్చుకున్నప్పుడు ఇటునుంచి అటు వచ్చింది. చాకు గుచ్చుకున్న గుర్తు మొన్నటిదాకా ఉంది. ఇటునుంచి అటు వచ్చింది".

(అమ్మతో సంభాషణలు - పుట 87)

మోక్షసాధన లక్షణాలలో తితిక్ష గణనీయమైంది. "తితిక్షస్వ" అనేది భగవదాజ్ఞ.

"మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।

ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥" (గీత : 2-14)

ఓ కుంతీపుత్రా ! శీతోష్ణములు, సుఖదుఃఖములు కలుగజేయు ఇంద్రియ విషయ సంయోగములు పుట్టుక, నాశనము కలవి, శాశ్వతములు కావు. కాబట్టి ఓ భరతవంశజుడా ! వానిని నీవు (ధైర్యముతో) సహించుము.

సుఖదుఃఖాలు భగవంతుని ప్రసాదాలు. ఈ విషయాన్ని భగవద్గీత 10వ అధ్యాయంలో 4-5 శ్లోకాలు స్పష్టపరుస్తున్నాయి.

సుఖదుఃఖాలు "ఆగమాపాయినోఽనిత్యాః" అని, భగవంతుడే

(IX(i))

వాటినుండి బయటపడే మార్గం చూపించాడు. ఈ సహనం, తితిక్ష వలన వచ్చేలాభాన్ని గురించి,

యంహి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ (గీత: 2-15)

ఓ పురుషపుంగవా ! సుఖదుఃఖాలను సమంగా ఎంచుకొనునట్టి ఏ ధీర పురుషుని యింద్రియవిషయ సంయోగములు కదలింప జాలవో, అతడు మోక్షప్రాప్తికి (అమృతత్వానికి) యోగ్యుడగును.

ఓర్పు అనే విషయానికి వస్తే, దానిని కేవలం ఒక గుణంగా మాత్రమే చూడకుండా, అది ఎంతటి ప్రధానమైన సుగుణమో గుర్తిస్తాము. అంతే కాదు, భగవంతుని దృష్టిలో మానవులందరూ సరిసమానంగానే సృష్టించబడ్డారనీ, కానీ మన మధ్య తారతమ్యాలు ఏర్పరచుకుని, మనలను మనమే విభజించుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, మనము ఆ సృష్టి యొక్క మౌలికపు విలువలను నాశనం చేయడమే అవుతుంది. **సహనం అంటే భగవంతుని ఆశయానికీ అనుగుణంగా ఉండటమే.** అలా అనుగుణంగా ఉండడంవలన మనం గమ్యంవైపునకే ముందుకు వెడతాం. ఆ విధంగా మనకు ప్రయాణంలో ఏవిధమైన కషాలూ, ఇబ్బందులూ లేకపోవడమే గాక, మనం రెట్టింపు వేగంతో ముందుకు సాగగలం. అప్పుడు దీనిలోనే, ఈ జన్మలోనే మనం మనగమ్యంవైపు త్వరితంగా పురోగతిని సాధించే అవకాశం ఏర్పడుతుంది.

("పరిపూర్ణ ప్రేమమూర్తులు నా గురువర్యులు" - శ్రీపార్థసారథి రాజగోపాలాచారి. పుట 41)

తితిక్షను గురించి శ్రీశంకరాచార్యులు వారు

సహనం సర్వదుఃఖానాం, అప్రతీకార పూర్వకమ్ ।
చింతావిలాపరహితం, సా తితిక్షా నిగద్యతే ॥
(వివేకచూడామణి)

అని నిర్వచించారు.

ఇది షడ్గుణ సంపత్తిలో ఒకటిగా పెద్దలు చెప్పారు.

అమ్మ దుర్భరమైన బాధలన్నిటినీ ఓర్పుతో అనుభవించారు. ఆమెది "సహజ సహనం" పైశ్లోకానికి పూర్తిగా అన్వయం కుదురుతుంది.

అమ్మకు అవనియే ఆరాధ్యదైవం

"ఒక మూల ఉన్న మట్టితో గుప్పెడు చేతికి తీసుకుని, ఆ మట్టివంక తదేకంగా చూస్తూ-

అమ్మా! నీలో పుట్టి నీలో పెరిగి నీలో లయమయ్యే వస్తువులన్నిటికీ పూజచేస్తూ, నిన్ను గుర్తించనివ్వకుండా చేస్తున్నావా?

దున్నినా,తన్నినా సహిస్తున్నావు. మంచీ చెడూ విభేదం లేకుండా అన్నిటినీ భరిస్తున్నావు. నీ గుండెలల్లో ఎన్ని అగ్నిపర్వతాలున్నాయో? వాటిని నీలోనే దాచుకుని పైకి నిశ్చలంగా కనిపిస్తూ యీ సర్వజగత్తుకూ ఆహారం యిచ్చి పోషిస్తున్నావు.

కొందరు మూర్ఖులు నీకోసం దారుణరణమారణహోమాలు చేసి నీ అనుగుబిడ్డల కుత్తుకలు కోసినా, నీ రమణీయ శరీరం రక్తసిక్తం చేసినా, నీగుండెలను గొడ్డలితో వ్రయ్యలు చేసినా - ఈషణ్మాత్రమూ చలించవు. వారిని నిరసించవు. వారిని నిందించవు. వారిని దండించవు పైగా ఆ దుర్మార్గులకు నీ చల్లని ఒడిలో స్థానమిచ్చి సేదదీర్చి-------

ఎందుకమ్మా నీకీ సహనం ?.....................

అది నీ గుణం. అది నీ ధర్మం. అది నీమహోత్తమ మహోదార విశిష్ట విశాల వినిర్మల హృదయ స్వభావం.......

అందుకే యీ సర్వజగత్తుకూ నీవే మాతృమూర్తివంటాను. ఈ విశాల విశ్వమంతటిలోనూ నీవే సహన దేవతవంటాను. ఈ సమస్తజనులూ, నిన్నే పూజించాలంటాను. అహరహము నిన్నే ఆరాధించాలంటాను". (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు- పుటలు 60-61)

అందుకే లలితా సహస్రనామములలో "కులోత్తీర్ణా భగారాధ్యా మాయా మధుమతీ **మహీ"!**

"ధరా ధరసుతా ధన్యా ధర్మిణీ ధర్మవర్ధినీ"

అని మహీ, ధరా నామములు లలితాస్వరూపంగా వర్ణింప బడినాయి.

సహనము భగవత్ లక్షణమే కాదు, భాగవతుల లక్షణము కూడా
భగవద్గీత 12వ అధ్యాయంలో 13 శ్లోకంలో
"నిర్మమో, నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ।
అని భక్తుని లక్షణంగా చెప్పింది.

భాగవతంలో శమీకుని ఆశ్రమమునకు వెళ్ళి పరీక్షిత్ మహారాజు తనను ఎవరూ పట్టించుకోలేదని సర్పశవాన్ని ధ్యానమగ్నుడైన శమీకుని మెడలో వేసి వెళ్లిపోతాడు. తరువాత శమీకుని కుమారుడు శృంగి ఈ విషయాన్ని తెలుసుకుని పరీక్షిత్ వారంరోజులలో తక్షకుని విషము చేత చంపబడాలని శాపం ఇస్తాడు. శమీకుడు ఈ విషయాన్ని తెలుసుకుని చాలా నొచ్చుకుని ఇలా అన్నాడు.

కం. పొడిచిన దిట్టిన గొట్టిన,
బడుచుందురు గాని పరమ భాగవతులు దా
రుడబడరు మా ఋసేయగ
కొడుకా ! విభుడెగ్గుసేయ గోరదు నీకున్ !

కం. చెలగరు కలగరు సాధులు
మిళితములై పరులవలన మేలుంగీడున్
నెలకొనిననైన నాత్మకు
నొలయపు సుఖదుఃఖచయము లుగ్రములగుచున్.

(శ్రీమహాభాగవతం - ప్రథమ స్కంధం - 484,485)

కార్తవీర్యుని, అతని కుమారులను వధించి హోమధేనువును మరల తెచ్చి యిచ్చిన జమదగ్ని పరశురామునితో యిట్లనియె.

కం. తాలిమి మనకును ధర్మము
తాలిమి మూలంబు ధర్మతత్త్వంబునకున్
దాలిమిగలదని యీశుం
డేలించును బ్రహ్మపదమునెల్లన్ మనలన్.

కం. క్షమ గలిగిన సిరులు గలుగును
క్షమగలిగిన వాణి గలుగు సౌఖ్యములెల్లన్
క్షమగలుగ దోన గలుగును
క్షమకలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ !
(శ్రీమహాభాగవతము - నవమస్కంధం- 461,462)

అశ్వత్థామ ద్రౌపదీపుత్రులను చంపిన తరువాత అర్జునుడు అశ్వత్థామను బంధించి ద్రౌపది ముందు నిలబెడతాడు. తల్లికి పుత్రశోకాన్ని మించిన దుఃఖంలేదు. కాని భాగవతలక్షణం కల్గిన ద్రౌపది యిలా అంటుంది.

ఉ. ద్రోణునితో శిఖింబడక ద్రోణకుటుంబిని యున్నదింట న
క్షీణ తనూజ శోక వివశీకృతనై విలపించు భంగి నీ
ద్రౌణి దెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో
ప్రాణవియుక్తుడైన నతి పాపము బ్రాహ్మణహింస మానరే !
(శ్రీమహాభాగవతము - ప్రథమ స్కంధం - 164)

ఏ సామాన్యురాలైన తల్లి అయినా తన బిడ్డలను చంపిన శిశుహంతకుని చంపమని ప్రతీకారం తీర్చుకునేది. కాని ద్రౌపది తనకు వచ్చిన బాధ, కష్టం ద్రోణుని భార్యకు, రాకూడదని నిగ్రహించుకుని సహనానికి పరకాష్ఠ చూపింది. ఈ భావం ఎంతో విశిష్టమయినది. భారతమందలి

కం. ఒరులేయవి యొనరించిన,
నరవర యప్రియము తన మనంబున కగుదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ !
అని గుర్తుకొస్తుంది.

(x)

రామాయణంలో సుమిత్ర తన పుత్రులతో, వారి సోదరులకు సేవ చేయవలసినదని చెపుతుంది. అది సహనమునకు నిదర్శనం.

కుంతి రాజమాతగా ఉండవలసినది, కాని గాంధారికి సేవలు చేయవలసిన పరిస్థితులు వచ్చినాయి. అప్పటి ఆమె స్రహనం చాల విశిష్ట మయినది.

అమ్మ మనం చేసిన ఎన్నోతప్పులను క్షమించారు. సహనంతో ఎన్నో బాధలను అనుభవించారు. అమ్మ జీవితంనుంచి మనము నేర్చుకోవలసిన ఉత్తమ గుణం సహనం.

ఇతరులను ప్రేమించాలంటే ముందు సహనాన్ని అలవర్చు కోవాలి. ఇది భక్తుని, భాగవతుని, భగవంతుని కల్యాణగుణము.

(ఈ వ్యాసం 'విశ్వజనని' మార్చి-2004 సంచికలో ప్రచురితమైనది)

సమాజానికి నడక నేర్పిన అమ్మ

అమ్మ ప్రేమమూర్తి, అవ్యాజ కరుణామూర్తి.

"అమ్మకు ప్రేమించడమూ, కరుణించడమూ సహజం. కానీ, మన అర్హతనుబట్టి కాదు" అంటాడు, జీవిత మహోదధి తరంగాలలో తాత. ఈ విషయమునే అమ్మ "నాకు వారి అవసరమే కనిపిస్తుంది కానీ, వాని అర్హత ప్రసక్తి రాదు" అని ధృవపరిచారు.

అమ్మ విశ్వాన్నంతా తన బిడ్డగానే భావించారు. "మీరందరూ నా బిడ్డలు" అన్నారు. అంతే కాదు "మీరు కానిది నేనే ఏదీ కాదన్నారు. మీరు నా అవయవాలు" అన్నారు. "ప్రపంచంలో ప్రతివాడూ ప్రతి పనీ తన కోసమే చేసుకుంటున్నాడని నాకు తోస్తున్నద"ని అన్నారు. సామాన్యంగా తనకన్నా మిన్నగా తన బిడ్డల విషయంలో ఎక్కువ ప్రేమ చూపిస్తారు. "తనను కన్న వాళ్ళమీద కంటే, తాను కన్న వాళ్ళమీద ప్రేమ ఎక్కువ" అని వివరించారు అమ్మ.

"వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః". (గీత. 7-19)

ఈ సర్వము వాసుదేవుడే యని నన్ను భజించునట్టి మహాత్ముడు మిక్కిలి దుర్లభుడు.

అమ్మ అట్టి మహాత్మురాలు. మనలనందరినీ అట్లా తీర్చిదిద్దాలని అమ్మ ఆకాంక్ష. "నేను దేనికోసమూ ఏదీ చేసేది లేదు. ఆరాధన కూడా ప్రత్యేకంగా దైవ మొకదాంట్లో ఉన్నాడని ఆరాధించలేదు. మీ అందరినీ ఆరాధించడమూ మీరందరూ దైవమనుకోవడమే !"

అమ్మ ప్రేమ విశ్వజనీన ప్రేమ. "ఇది సర్వత్రానురాగం. ఇది నిజమయిన మమకారం. స్వపర భేదమెరుగని నిస్సీమస్థితి. అయిన వాళ్ళు,

కానివాళ్ళు అంటూ తెలియని అత్యద్భుత అద్వైతస్థితికి పరకాష్ట."

అందుకనే అమ్మ సృష్టిని గురించి వివరిస్తూ "సృష్టి అనాది, నాది" అని చెప్పారు.

"సృష్టినాదే" అన్న అమ్మకు, సమాజంపట్ల గల స్పృహను గురించి ప్రత్యేకంగా చెప్పటం, చిన్నబుచ్చినట్లే. అయినా మన అవగాహనను పెంచుకొనేందుకు కొన్ని విషయాలను ప్రత్యేకించి మాట్లాడుకుందాము.

అందరినీ "భోజనం చేసి వెళ్ళండి నాన్నా !" అనేవారు అమ్మ. ఆకలి బాధను గురించి ఇలా అన్నారు. "ఆకలికి బీదవాడనీ, భాగ్యవంతుడనీ భేదమేమున్నది ? భాగ్యవంతుడికి - యినప్పెట్టెలోని డబ్బుగానీ, బ్యాంకులోని డబ్బుగానీ, మరెక్కడయినా వారికోసం తయారు చేస్తున్న విందుగానీ - ఆకలిని తీర్చుతుందా ? కనుకనే నేనెప్పుడూ మీ బీదతనాన్ని, భాగ్యాన్ని చూసి అన్నం తినమని అడగను. మీ ఆకలిని చూసి మాత్రమే చెబుతాను. అన్ని అంతస్థులకూ, స్థితులకూ, వయస్సులకూ యోగ్యతా అయోగ్యతలకూ అతీతమై ఆకలి పెట్టే బాధ భరించటం కష్టం నాన్నా !" అని. "ఇక్కడికి ఆకలితో రావచ్చును నాన్నా ! కాని ఇక్కడనుండి ఎవరూ ఆకలితో వెళ్ళకూడదు. ఆ ఆకలినీ, బాధను మీరు సహించవచ్చు గానీ నేనే సహించలేను. అది నాకే బాధ" అని వివరించారు.

"ఎక్కడ తనకున్నది తృప్తిగా తింటూ, పదిమందికి ప్రేమతో పెడతారో, ఎక్కడ ఆదరణ లభిస్తుందో అదే 'జిల్లెళ్లమూడి' " అని అన్నారు అమ్మ.

"తినకపోతే మీరు చిక్కిపోతారు, మీకు పెట్టుకోకపోతే నేను చిక్కిపోతాను" అంటారు అమ్మ.

అమ్మ మన తిండి గురించి ఎంతో శ్రద్ధ వహించేవారు, ఎవరు ఎంత తినగలరో, ఎవరికి ఏది ఇష్టమో, ఎవరి శరీరానికి ఏది పడుతుందో,

పడదో – అన్నీ అమ్మకు స్పష్టంగా తెలుసు.

"వాళ్ళు కారం అసలు తినలేరు, కారం తక్కువగా వేయమనండి". "వాడు కాఫీలో పంచదార వేసుకోడు". "నెయ్యి అందరికీ చెరుపు చెయ్యదు, నీకు పర్వాలేదు, వేసుకో".

"మీకు పెట్టడం – అది గుడ్డ అయినా, అన్నమయినా – పెట్టడం మీకు నేర్పటానికే. జ్ఞానం అంటే మాటలు కావుగా" అంటూ "నేను చేయకుండా మీకు చెప్పకూడదుగా, అందుకే ఈ అన్నపూర్ణాలయం" అన్నారు అమ్మ చిరునవ్వుతో.

వర్గాలకూ, వర్ణాలకూ, కులాలకూ, మతాలకూ అతీతంగా అందరూ ఒకే పంక్తిన అన్నపూర్ణాలయంలో ఆసీనులై భోజనం చేసే దృశ్యం సుందరమే కాదు, సర్వజగతికీ ఆదర్శం కూడా.

అన్నాన్ని అందించటమే కాక, సమయానికి అందించాలనే తపన, బాపట్ల అగ్ని ప్రమాదంలో బాధితులకు అన్నం పొట్లాలు కట్టే సమయంలో అమ్మ యిచ్చిన సందేశం స్పష్టపరుస్తుంది.

కూడు – గుడ్డల తర్వాత అందరికీ అవసరం వసతి. అమ్మ చిన్న తనంలోనే " అన్ని గ్రామాల్లో అందరూ అందరి ఆస్తులూ కలుపుకొని ఎవరి వృత్తి వారు చేసుకుంటూ ఒకే చోట ఉంటే ఎంత బాగుంటుంది" అని మనసారా ఆశించారో దాని ఫలితమే "అందరిల్లు" నిర్మింపబడింది.

అందరూ కలసి ఒకే వంటలో ఒకే పంక్తిలో భోజనం చేస్తే ఎట్లా ఉంటుంది ? అని అమ్మకు విలక్షణమైన ఆలోచన కలిగింది. 1981 జనవరి 16 వ తేదీన అన్నపూర్ణాలయంలో అమ్మ సంకల్పించిన సామూహిక భోజనానికి ప్రారంభోత్సవం జరిగింది. ఆదర్శప్రాయమైన సమష్టి కుటుంబ వ్యవస్థకు పునర్జీవనం ప్రసాదించటమే అమ్మ సంకల్పమేమో !

అమ్మ అందరికీ ఉచితవిద్యనందజేయాలని భావించారు. ఆ సంకల్పప్రభావం వల్లే మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల, మాతృశ్రీ ఉన్నత

పాఠశాల ప్రారంభించబడినాయి. ఆ కళాశాలలో విద్య నభ్యసించిన విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయులుగా, కళాశాలల ఉపన్యాసకులుగా పని చేస్తున్నారు. ఇక్కడ 8వ తరగతిలో చేర్చుకున్న విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యములు కల్పించి, ఉచితంగా విద్య చెప్పి, తెలుగులో లేక సంస్కృతంలో పట్టభద్రులయ్యే అవకాశం కల్పించబడింది.

పుట్టిన ప్రతి జీవికీ రోగం వచ్చే అవకాశం ఉన్నది. రోగం నుంచి విముక్తి కలగాలంటే వైద్యం అందుబాటులో ఉండాలి. ఇది దృష్టిలో ఉంచుకొని అమ్మ "మాతృశ్రీ మెడికల్ సెంటర్" ను జిల్లెళ్లమూడిలో ప్రారంభించి, అందరికీ ఉచిత వైద్యాన్ని అందించాలని ఏర్పాట్లు చేశారు.

మారుతున్న ఈ సమాజంలో వృత్తి రీత్యా దూరతీరాలలో పనిచేసే పిల్లలు తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో సేవ చేయలేకపోతున్నారు. ఆర్థిక బలం ఉన్నా, వయసు మీరిన వృద్ధులు ఆదరణ కోరుకుంటారు. ఆ ఆదరణతో వారి ఆలనా పాలనా చేయాలనే సత్సంకల్పముతో అమ్మ 'ఆదరణాలయము'ను స్థాపించారు.

అమ్మ దృష్టిలో కులభేదమూ , జాతి, వర్గ,వర్ణభేదమూ లేదు. శుక్ల శోణితాలకేది కులమో తనది ఆ కులమన్నారు.

"గుణభేదమే లేని నాకు కులభేదమేమిటి ?" అని ప్రశ్నించారు అమ్మ."గుణభేదమే నాకుంటే ఏ ఒక్కరూ నాదగ్గరకు రాగలిగేవారు కారు", "నేను మీ గుణాలు చూసి ప్రేమించటంలేదు, నాకోసం నేను ప్రేమిస్తున్నాను" అన్నారు అమ్మ.

"సర్వసమ్మతమే నా మతం" అన్నారు అమ్మ. క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు అమ్మ సన్నిధిలో జరుగుతాయి. కులాలతో ప్రసక్తి లేకుండా గాయత్రీ మంత్రాన్ని ఆసక్తి ఉన్న అందరికీ అందించారు అమ్మ (గాయత్రీ యజ్ఞ సమయంలో)

అమ్మ అస్పృశ్యతను గురించి ప్రశ్నించిన మాటలు మన ఆలోచనా విధానాన్ని మారుస్తాయి.

"మన కడుపులో ఉన్న అశుద్ధానికి అంటు లేకపోయె. దానిని బాగు చేసిన ఆ తల్లికేంఅంటు వచ్చిందీ ? అది బాగు చేసిన దొడ్లోకి మళ్ళీ వెళ్ళుతూనే ఉన్నాం గదా. అసలు అంటు అంటే ఏమిటి ? అంటు అంటే వదలనటువంటిదని నా ఉద్దేశం"

"మనకు పనికివచ్చే పాకీతనానికి మనం పనికిరానితనాన్ని అంటగడుతున్నాం". అని బాధపడ్డారు బాలిగ్గా ఉండగానే అమ్మ.

"పాకీ పిల్లవాడిని తాకింది నేను గాని, గుడ్డలు కావు. మైలపడ్డది నేనైతే గుడ్డలు విప్పితే మాత్రం మైలెక్కడకు పోతుంది ? ఎత్తుకోవాలనే ఉద్దేశంతో మనసే మైలపడ్డది. ఇట్లాంటి రాతలు రాసిందన్నట్లుగా రాత కూడా మైలపడ్డది. రాత రాసినవాడూ మైలపడి ఉంటాడు. ఇన్ని రకాల మైలలు కలసి యీ సంఘమాతను సంఘానికి దూరం చేశాయి" అని బాలిక గానే అన్నారు అమ్మ.

మనం చేసే ప్రతి పనీ సంఘానికి ఉపయోగపడుతుందని అమ్మ ప్రబోదిస్తారు. ఒక సోదరునికి ఇచ్చిన ఈ సందేశం చూడండి.

"నువ్వు బ్రతుకుతున్నది నా కోసమే, ఉద్యోగం చేస్తున్నది నా కోసమే. ఇది నీకు తెలియకపోవచ్చు. అంతమాత్రంచేత నష్టం లేదు. నువ్వు ఏం చేసినా, నా కోసమే. అది నాకే చెందుతుంది. ఈ విషయంలో దిగులుపడకు. ఈ కనిపించేవన్నీ దైవస్వరూపాలే. దైవం కాని ప్రాణి-వస్తువు - ఏమీ లేదు. నువ్వూ దైవమే. ఈ సృష్టిలో ఏ ప్రాణికీ - నీకూ కాకుండా నీ శక్తీ, సేవలూ ఎక్కడికి పోతున్నయ్ ? ఇందులో ఎవరికి చెందినా, అది దైవానికి చెందినట్లే. కనుక ఇందులో స్వార్థం అన్న ప్రసక్తే లేదు. అంతా పరమార్థమే" అని అమ్మ హితోపదేశం చేశారు.

తన విధిని తాను నిర్వర్తించలేక పోతున్నానని బాధపడుతున్న ఒక సోదరునికి అమ్మ యిచ్చిన సందేశం :

"కాలం మారిపోయింది నాన్నా ! కాలాన్ని అనుసరించి మన

ఆలోచనలూ, పద్ధతులూ మారాలి. నువ్వు పుట్టిన కులాన్ని బట్టి జపతపాలు నీ స్వధర్మం అనుకుంటున్నావు. కులాలు వృత్తిని బట్టి ఏర్పడ్డవే. ఇప్పుడు నీ వృత్తి వేరు. దాన్ని బట్టే నీ ధర్మం. **నీ ఉద్యోగంలో నీవు నీతి, నిజాయితీలతో ఉండటమే నీధర్మం. దాన్ని సక్రమంగా పాటిస్తే మరింకేమీ అవసరం లేదు".**

అమ్మ సందేశాలు మనలను సమాజం పట్ల బాధ్యతాయుత పౌరులుగా తీర్చి దిద్దుతాయి అనటానికి పై రెండు సందేశాలు మచ్చుతునకలు.

"వైద్యో నారాయణో హరిః" అన్నది వేదవాక్కు. అమ్మ "రోగీ నారాయణో హరిః" అన్నారు. రోగికి వైద్యుడు దేవుడయితే, వైద్యునికి రోగి నారాయణ స్వరూపం అన్నారు. అప్పుడు రోగి పట్ల వైద్యునికి ఎలాంటి శ్రద్ధాభక్తులుంటాయో, అట్టి శ్రద్ధాభక్తులతో చేసే 'సేవ' అపూర్వమయింది కదా !

బిడ్డలకు తల్లిదండ్రులు దైవ స్వరూపులే కదా, అట్లాగే తల్లిదండ్రులకూ బిడ్డలు అర్చామూర్తులేనట. ఇలా చూడగలిగిన రోజున సమస్యలెక్కడుంటాయి ?

వివాహ వ్యవస్థ - గృహస్థాశ్రమము

"నీకెందుకమ్మా పెళ్ళి?" అని అడిగినప్పుడు అమ్మ యిచ్చిన సమాధానమిది.

"ఎన్ని వచ్చినా మనస్సుకు ఏమీ సంబంధం లేదని చెప్పడం కోసమే నా యీ పెళ్ళి". "పెళ్ళిలో పెద్దపులి ఉన్నదని భయపడేవారి భయం పోగొట్టడానికే నేను పెళ్ళి చేసుకుంటున్నాను" అన్నారు.

అమ్మ వివాహానికి ఇచ్చిన నిర్వచనాలే క్రొత్త వెలుగును ప్రసరిస్తున్నయి.

"ఒక పెన్నిధి అండన చేరడమే పెండ్లి". " ఆ అండను చేరే

పరిణామమే పరిణయం". "సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ వదిలి వేయటమే వివాహం". "కళంకరహితమయిన మనస్సును కళంకరహితంగా అర్పించటమే కల్యాణం". "భర్త అన్నా, భార్య అన్నా భావనే గదా ". అమ్మ దృష్టిలో భార్యాభర్తలు ఉభయులూ సమానమే.

భార్యకు భర్త ఎలా దైవమో, భర్తకు భార్య కూడా అలాగే దేవత అని అమ్మ సందేశం. అందుకే అమ్మ జరిపించే వివాహాల్లో వధువు వరుని పాదాలు కడగటమే కాకుండా, వరుడు వధువు పాదాలు కడగాలని అమ్మ ఆదేశం.

భార్యాభర్తలకు వియోగం అనేది లేదని అమ్మ భావన. మంగళ సూత్రరూపేణా భర్త పాదాలు భార్య కంఠాన ఎలా ఉంటాయో - యజ్ఞోపవీత రూపేణా భార్య భర్తతోటే సదా ఉంటుందని అమ్మ అభిప్రాయం. భర్త అంటేనూ, భార్య అంటేనూ శరీరాలు మాత్రమే కాదు గదా అని అమ్మ అంటారు.

అమ్మ దృష్టిలో వితంతువు కూడా లేదు. భర్త స్మృతి ఉన్నంతవరకూ ఎవరూ వితంతువులు కారని అమ్మ భావం.

"భర్త అంటే శరీరం కాదు, భావన" అన్నారు అమ్మ. "భర్తను గురించి సజీవ భావన, నిరంతర స్మరణ ఉన్న స్త్రీ ఏనాటికీ భర్తృవిహీన కాదని అమ్మ అభిప్రాయం. అందుకే అమ్మ-నాన్నగారు-అమ్మ పతిదేవులు- సుమంగళీ చిహ్నాలను వేటినీ విసర్జించలేదు.

ఈ విధంగా అమ్మ మహిళాలోకంలో ఒక మహా విప్లవానికి ఒరవడి పెట్టారేమోనని పిస్తుంది.

విజయనగరం,రోటరీ క్లబ్బు నుంచి కొందరు సోదరులు అమ్మ దర్శనానికి వచ్చి సందేశమడిగారు.

"అనాథలై అనేకులున్నారు. వికలాంగులయిన వాళ్ళు ఆధారమేమీ లేని వాళ్ళు లోకంలో ఎందరో ఉన్నారు. వారందరినీ ప్రేమగా చూడండి.

(xii)

వారందరిపై ఆదరణ చూపండి. లోకంలో ఎవరూ తాము అనాథలమనీ, ఆధారం లేని వాళ్ళమనీ, తాము భూమికి భారమయిన వాళ్ళమనీ నిరాశపడ కూడదు. అందరూ ఒకరికొకరు తోడుగా బ్రతుకును పండుగగా చేసుకోవాలి. తమ బతుకును తాము బతకలేని అనేకవిధాల బలహీనులున్నారు. తమ కాళ్ళ మీద నిలబడలేని వారికే గదా -కర్ర ఆసరా ! వారికి తోడుపడండి! అయితే వారిపై జాలితో చేసే సహాయమని అనుకోక, వారిని భగవత్ స్వరూపులుగా భావించి వారికి సేవ చేయండి. కనిపించని దేవునిపై మనసు నిలవడంలేదనీ, ఏకాగ్రత కుదరటంలేదనీ బాధపడక – కనిపించే ఈ దేవుళ్ళను ప్రేమతో ఆరాధించండి. ఆ సేవలో కలిగే తృప్తే ముక్తి". అమ్మ మాట్లాడుతుంటే కారుణ్యం వర్షిస్తున్నట్లున్నది.

కాలంతోపాటు మనమూ మారాలి. పూర్వం మనిషి ఒక రూపమో, నామమో, భావమో ఆధారం చేసుకొని సాధన చేసి తరించేవాడు. ఎప్పుడూ విధానం ఒక్కలాగానే ఉండాల్సిన అవసరం లేదు. అది వ్యక్తిగత సాధన. అందులో ఎంతో కష్టం ఉంది. స్వార్థం ఉంది. దాన్ని కాదనను. కానీ, అంతకంటే సులభమయిన మార్గం ఉంది. **అది పదిమందితో కలసి పని చేయడం, పదిమందికోసం పని చేయడం, మమకారాన్ని చంపుకోవడం కాక పెంచుకోవడం. పరిమితమైన ప్రేమను విస్తృతం చేసుకోవడం..... నేటి మానవధర్మం ఇదే** ననుకుంటున్నాను. ఇదే మానవుడు మాధవుడుగా మారడానికి మంచి దారి" అన్నారు అమ్మ.

"1) నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో.. అంతా దైవమే చేస్తున్నాడనుకో.

2) కూతుర్నీ, కోడలినీ సమానంగా చూడటమే అద్వైతం" అన్నది అమ్మ సందేశం.

('విశ్వజనని' 2003 జూలై సంచికలో ప్రచురితం)

మృత్యుంజయత్వమే అమృతత్వం

ప్రతి జీవికీ మృత్యువంటే భయం. పతంజలి మహర్షి ఈ భయాన్ని గుర్తించే "అవిద్యా స్మితా-రాగ-ద్వేషాభి నివేశాః క్లేశాః"(యోగ సూత్రములు 2-3). అవిద్య, అస్మిత (అహంకారం), రాగం, ద్వేషం, అభినివేశం (ప్రాణంపై తీపి) అనేవి ఐదు క్లేశాలు అని, "స్వరస వాహీవిదుంషోపి తథారూఢోఽ భినివేశః"(యోగ సూత్రములు 2-9) పండితులకు కూడా ప్రాణంమీద తీపి దృఢంగా ఉంటుంది అన్నారు.

ఈ భయయాన్ని మూడు దశలుగా గుర్తించవచ్చు.

1. మృత్యువు ఎప్పుడు, ఏవిధంగా వస్తుంది ?
2. చనిపోయేటప్పుడు ఎంత బాధ ఉంటుంది ?
3. చనిపోయిన తరువాత నాకు ఏమి అవుతుంది ?

"జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మమృతస్యచ ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి॥" (గీత 2 - 27)

కారణం, ఏ విధంగా చూచినను పుట్టినవానికి చావు తప్పదు. చనిపోయినవాడు జన్మించుటయు తప్పదు. మరో మార్గం లేని యీ విషయంలో కూడా నీవు శోకింపరాదు.

"జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్"

జన్మ, మృత్యు, జరా, రోగముల వలన గలిగెడి దుఃఖ దోషముల పదే పదే ఆలోచించుటను జ్ఞాన సముపార్జన మార్గముగా గుర్తించింది శ్రీభగవద్గీత..

మృత్యువంటే ఏమిటి ?

"మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలలో", "ఎప్పటిదీ సాధన" అనే అధ్యాయంలో అమ్మ సంభాషణలు మనకు జ్ఞానోదయాన్ని కలిగిస్తాయి. "చచ్చిపోవడమంటే శ్వాస ఆగిపోవడమా" అని ప్రశ్నించి, తన శ్వాసను నిలిపి, సమాధి స్థితి పొంది, మరల మామూలు స్థితికి వచ్చి, శ్వాస ఆగడం చావు కాదని చెప్పారు అమ్మ.

"పోయింది మా అమ్మే ? ఈ శరీరం మా అమ్మా ? ఈ శరీరమే అయితే పోలేదు. పోయిందే మా అమ్మ అయితే – దానిని యిదివరకూ చూడలేదు. మరెందుకు ఇక బాధ?" అంటారు.

చావు అంటే వైద్యశాస్త్రరీత్యా మెదడు పనిచేయడం ఆగిపోవడం. అప్పుడు ఇంద్రియాలకు సంకేతాలు పంపడం, ఇంద్రియాలనుండీ సంకేతాలు అందుకోవడం ఉండదు కాబట్టి శరీరంలో లయ తప్పి పోతుంది.

అమ్మ "సర్వ మృత్యు నివారిణి" (553). "జన్మమృత్యు జరాతప్త జన విశ్రాంతి దాయిని"(849) "భయాపహా"(లలితా సహస్రనామములు).

పుట్టుక ఉన్న ప్రతి జీవికీ మృత్యువు ధృవమని తెలుసు. అయితే ఏ విధంగా మృత్యువును అమ్మ నివారిస్తారు, అంటే ? మృత్యుభయాన్ని పోగొట్టుటయే మృత్యు నివారణ. మృత్యువు నుంచి కలిగే అన్ని భయాలను పోగొట్టటమే కనుక "సర్వమృత్యు నివారిణి". అమ్మ పైన చెప్పిన మూడు భయాలను ఎలా తొలగించారో చూద్దాము.

1. నీకు జన్మ యిచ్చేటప్పుడు చెప్పి యివ్వలేదు. అలాగే తీసుకొనేటప్పుడు నీకు చెప్పి తీసుకొని వెళ్ళదు. "ప్రాణం ఎట్లా చెప్పి యివ్వలేదో, అట్లాగే అవసరమయితే తీసుకుంటా" నన్నారు. (మాతృసంహిత; పుట 63).

"దైవం పంపిన మనిషి, దైవం ఇష్టప్రకారం, దైవంలోకి పోతే మధ్యలో మనకు ఏడుపెందుకు?" అని ప్రశ్నించారు అమ్మ. (మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు, పుట 50)

శ్రీమహాభాగవతం ఇలా అంటుంది :

" మచ్చిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము దేహి పుట్టుచున్
జచ్చుచునుండ జూచెదరు చావక మానెదు వారిభంగి నీ
చచ్చినవారి కేడ్చెదరు చావుకు నొల్లక డాగవచ్చునే?
యెచ్చట బుట్టె నచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్"
(శ్రీమహాభాగవతము, సప్తమ స్కంధం: 46)

2. ప్రాణం పోతున్నప్పుడు చాలా సుఖంగా ఉంటుందన్నారు అమ్మ. ఒక సందర్భంలో. "ఎవరికైనా జబ్బు చేసిననాడు తనకూ ఆందోళనగా ఉంటుందట. మనిషి చనిపోయిన తర్వాత తనకు నిండుగా, పండుగగా ఉంటుందట." (మాతృసంహిత: పుట 438)

3. మరణానంతరం ఏమవుతుంది – అని, ఎవరికి భయం లేకుండా "అందరికీ సుగతే" అనే అపూర్వమయిన ఒక హామీని ఇచ్చి "మరణానంతరం మిగిలేదంటూ ఏమి లేదని" అమ్మ నిర్ద్వంద్వంగా ప్రకటించి అందరికీ అభయ ప్రదానం చేశారు(మాతృసంహిత పుట 520)

ఈ విధంగా అమ్మ పై మూడు రకాల భయాలను తొలగించేందుకు మనకు సూచనలు ఇచ్చారు.

మృత్యుంజయుడు అంటే మృత్యువును జయించడం కాదు, మృత్యు భయాన్ని జయించటమేనని నిర్వచించారు. అమ్మ మనందరినీ మృత్యుంజయులను చేయటానికి పై సూచనలను, వివరణలను, అభయాలనిచ్చి 'మృత్యుతప్త జన విశ్రాంతి దాయిని' అయ్యారు.

భాగవతం మృత్యు భయాన్ని తొలగించటానికి ఏర్పడిన గ్రంథము. అందులో మృత్యు భయాన్ని పోగొట్టేందుకు రెండు ముఖ్య మార్గములు సూచింపబడినాయి.

(xiii)

1. విష్ణుకథా శ్రవణం,
2. నామ స్మరణ.

ఈ క్రింది పద్యాలను పరిశీలించుదాము.

"హరివార్త లెఱుగువారికి,
హరి పదములు దలచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి,
మరణాగత మోహ సంభ్రమము లేదనఘా ! "
(శ్రీమహాభాగవతము - 1వ స్కంధము - 436)

"సత్త్రయాగమునకు సన్మునీంద్రులు సీర
వాడె దండధరుడు వచ్చె చూడు
చంప డొకనినైన జన్మమయ్యెడుదాక,
వినుచునుండు దగిలి విష్ణు కథలు"
(శ్రీమహాభాగవతము - 1వ స్కంధము - 391)

ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబుగల మానవ కోట్లకు జావు నిత్యమౌ
గాన హరిన్ తలంపు మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్ !
(శ్రీమహాభాగవతము - ద్వాదశ స్కంధము - 11)

భగవద్గీత కూడా ఈక్రింది విధంగా చెప్పుతున్నది.

'తేఽపి చాతి తరంత్యేవ మృత్యుం శ్రుతి పరాయణాః"
(గీత : 13 - 25)

ఈ విధంగా శ్రవణ పరాయణులైనవారు గూడ మృత్యువు దాటుతున్నారు.

అందుకే అమ్మ కథలు విందాం. అమ్మ నామం చేద్దాం. మృత్యుంజయులమౌదాం.

('విశ్వజనని' 2003 - అక్టోబర్ సంచికలో ప్రచురితం)

అమ్మ అందించిన సులభసాధన

.....మాతృతత్త్వానికి మారురూపంగా దిగివచ్చి అందరినీ అనుగ్రహించిన అమ్మ - జిల్లెళ్లమూడి - తత్త్వమును అవగతం చేసుకుని, ఆ బాటలో నడవటమే లక్ష్యంగా కలిగి, అమ్మనూ, శ్రీశ్రీశ్రీ యతీంద్రగురుదేవులనూ అభేద దృష్టితో ఆరాధించే ఆదర్శసాధకులు శ్రీరామబ్రహ్మంగారు అందిస్తున్న అమ్మ సందేశం సాధకులకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రచురిస్తున్నాం....

సంపాదకులు-ముముక్షువు.

ప్రపంచంలో ప్రేమ విలువైనది. ప్రేమించటాన్ని నేర్పటానికీ, మానవుని మాధవుడుగా తీర్చిదిద్దేందుకూ కరుణాంతరంగయైన పరమాత్మ స్త్రీ రూపధారిణియై అనసూయమాతగా జిల్లెళ్లమూడిలో అవతరించాడు.

సోదరీసోదరులు అనేక సందర్భాలలో అమ్మను సందేశ మివ్వవలసినదిగా అభ్యర్థించారు. "నాన్నా ! నాకేం తెలుసు ? నేనూ మీవంటిదానినే" అని మాయతెరలు కప్పినా, కొన్ని సందర్భాలలో చెప్పిన సందేశములను పరిశీలించితే, అమ్మను గురించి, సాధనను గురించి మనకు కొంత అవగాహన పెరుగుతుంది.

1. "తెలియనిది తెలియజేయటానికే నారాక" అని అమ్మ సుస్పష్టంగా చెప్పారు.

2. "నా జీవితంలో మీకేదయినా మంచిదనీ, నలుగురూ అనుసరించదగినది ఉన్నదనీ అనిపిస్తే, దానిని సందేశంగా తీసుకోండి" అన్న సమాధానమే అందరికీ చెప్పారు అమ్మ.

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అన్నాడు :

"జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున !!"
(గీత :4-9)

"అర్జునా ! నా జన్మకర్మలు దివ్యములు. అనగా లోకోత్తరములైనవి. ఈ విషయాన్ని ఎవడు తత్త్వదృష్టితో తెలిసికొంటాడో, అతడు శరీరమును త్యజించిన తరువాత మరల జన్మించడు. నన్నే చేరుకొంటాడు."

అమ్మ జన్మకర్మలను తత్త్వదృష్టితో మనం తెలిసికొనగలిగితే మనకూ ఆ ఫలితమే తప్పక లభిస్తుంది.

సాధనగురించి అమ్మ ఇలా అన్నారు :

"ఒకటే అనేకమయింది కనుక, అనేకంలో, ఆ ఒక్కదాన్ని చూడడానికి చేసే ప్రయత్నమే సాధన. అనేకం ఒకటిగా తోచడమే ఆత్మసాక్షాత్కారం".

ఒకచెట్టు కొమ్మగా, ఆకుగా, పువ్వుగా, కాయగా, పండుగా కన్పించినా, దేనిరూపం, దేనిగుణం దానికి ఉన్నా, అన్నీ ఒకేదానిలోనుంచి వచ్చినట్లు ఎలా అవగాహన అవుతుందో, అలాగే,"కన్పించేదంతా ఆత్మగా తోచడమే ఆత్మసాక్షాత్కారం" అనీ అన్నారు.

మరో సందర్భంలో ఇలా అన్నారు :

"దైవం తనను తాను తెలియజేసుకోవలసిందే. ఎంత శ్రమించినా, ఏ సాధన చేసినా, దైవం అనుగ్రహిస్తేనే, తన్ను తాను వ్యక్తం చేసుకుంటేనే, దైవాన్ని ఎవరయినా గుర్తించటమయినా, సాక్షాత్కారం పొందగలగడం అయినా జరుగుతుంది. స్థితులు పొందటంకాదు; ఇవ్వటమే. మీరు చూస్తే నేను కనబడను, నేను కనబడితేనే మీరు చూస్తారు. తెలియజెప్పేవాడు-తెలియజేసేవాడు-దైవమే".

సాధననుగురించి అమ్మ "ఏది సాధ్యమయితే అదే సాధన" అంటారు. "ఆధ్యాత్మిక జీవనం అని ప్రత్యేకంగా ఉందని నేను అనుకోవడం లేదు. నీవు చేసే ప్రతిపనీ దైవకార్యమే... ఈ జగత్తే దైవస్వరూపం అయినప్పుడు, నీవు చూసేది ఏది దైవం కాదు ? నీవు చేసేది ఏది ఆధ్యాత్మికం కాదు ?" అని ప్రశ్నించారు.

మన భావం, దృష్టి మారాలంటారు.

"దేవుడికీ, మానవుడికీ గల భేదం ఏమిటి ?" అని ప్రశ్నించగా, అమ్మ వెంటనే 'భావం' అన్నారు.

అమ్మ ఇక్కడ చెప్పిన 'భావము'ను గురించి అవగాహన చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం. అమ్మే మరొక సందర్భంలో "భిన్నత్వంలేని మనస్తత్త్వమే దైవత్వం" అన్నారు. అన్ని వస్తువుల్లోనూ మాధవుని చూచిన మానవుడే మాధవుడు అని పేర్కొన్నారు.

అంతా తానే అనే భావం కలగటమే దైవత్వమని అన్నారు.

పైన చెప్పిన 'భావం' –"భిన్నత్వంలేని మనస్తత్త్వం". "అంతా తానే" అనే భావం మాధవత్వమయితే, పరిమితులతో చూసే భావం మానవత్వం.

మన మమకారాన్ని విస్తృతం చేసుకోమనీ, మన బిడ్డలో ఏమి చూస్తున్నామో అందరిలో అదే చూడమనీ, కోడలినీ, కూతుర్నీ ఒకటిగా చూడటమే అద్వైతమనీ చెప్పటంద్వారా, మానవుడు మాధవుడుగా మారటానికి మార్గం చూపారు అమ్మ.

మామూలుగా సందేశాలు ఇవ్వడానికి ఇష్టపడని అమ్మ మనందరియందు దయాంతరంగయై నేటి కాలానుకూలమైన, సులభమైన, మంచి మార్గమని తానే ధృవీకరించి ఇచ్చిన సందేశం "మాతృశ్రీ" జనవరి 1981 లో (మాతృసంహిత 641-642) ఉన్నదానిని క్రింద ఉదాహరించుతున్నాను :

"తన బ్రతుకు తాము బ్రతకలేని అనేకవిధాల బలహీనులు ఉన్నారు. తమ కాళ్ళమీద నిలబడలేని వారికే గదా కట్టి ఆసరా ! వారికి తోడ్పడండి ! అయితే అది వారిపై జాలితో చేసే సహాయమనుకోక, వారిని భగవత్ స్వరూపులుగా భావించి, వారికి సేవచేయండి. కనిపించని దేవునిపై మనసు నిలవడంలేదనీ, ఏకాగ్రత కుదరడంలేదనీ బాధపడక, కనిపించే ఈ దేవుళ్ళను ప్రేమతో ఆరాధించండి. ఆ సేవలో కలిగే తృప్తే ముక్తి !" అమ్మ వాక్కులు కారుణ్యం వర్షించినట్టున్నాయి.

ఈ సందర్భంలో శ్రీభాగవతం తృతీయస్కంధంలోని కపిలాచార్యులవారి మాటలు గుర్తుకువస్తాయి:

"అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ
శు నను నవజ్ఞ సేసి మనుజుండొగి మత్ప్రతిమార్చనా విడం
బనమున మూఢుడై యుచితభక్తిని నన్ను భజింపడేని, య
మ్మనుజుడు భస్మకుండమున మానక వేల్చిన యట్టివాడగున్".

అబ్జాక్షి ! నిఖిల భూతాంతరాత్ముడనైన
నాయందు భూతగణంబునందు
నతిభేదదృష్టి మాయావులై సతతంబు
బాయక వైరానుబంధనిరతు
లగువారి మనముల దగులదు శాంతి యె
న్నటికైన నేను ఆ కుటిల జనుల
మానక యెపుడు సామాన్యాధిక ద్రవ్య
సమితిచే మత్పదార్చన మొనర్ప.

నర్థి నా చిత్తమున ముదం బందకుందు
ననుచు నెరిగించి మరియు నిట్లనియె - కరుణ
కలిత సద్గుణ జటిలు డ క్కపిలు డెలమి
తల్లితోడ గుణవతీమ తల్లితోడ.".

(శ్రీమద్భాగవతం: 3-962,963)

అమ్మ ఇలా అన్నారు :

"కాలంతోపాటు మనమూ మారాలి. పూర్వం మనిషి ఒక రూపమో,నామమో, భావమో ఆధారం చేసుకుని సాధన చేసి తరించేవాడు. ఎప్పుడూ విధానం ఒక్కలాగే ఉండాల్సిన అవసరంలేదు. అది వ్యక్తిగతమయిన సాధన. అందులో కష్టం ఉంది ; స్వార్థం ఉంది. దాన్ని కాదనను, కానీ, అంతకంటే సులభమయిన మార్గం ఉంది. అది **పదిమందితో కలిసి పనిచేయటం, పదిమందికోసం పనిచేయటం. మమకారాన్ని చంపుకోవటం కాక, పెంచుకోవటం. పరిమితమయిన ప్రేమను విస్తృతం చేసుకోవటం నేటి మానవధర్మం. ఇదే నేననుకుంటున్నాను. ఇదే మానవుడు మాధవుడుగా మారటానికి మంచిదారి........**"

వ్యక్తిగత సాధనకంటె సామూహిక సాధన సులభమూ, మంచిదీ అని అమ్మ సందేశం.

పదిమందితో కలిసి పనిచేయాలంటే, ఒకరిపట్ల ఒకరికి సదవగాహన, సహనం, నిగ్రహం పెరగాలి. లేకపోతే కలసి పనిచేయలేం గదా ! అందువల్ల మన అహంకారం తగ్గుతుంది.

పదిమందికోసం పనిచేయటం నిష్కామకర్మ అవుతుంది. ప్రేమను విస్తృతం చేసుకోవటంవలన నిర్మమత్వం వస్తుంది. అప్పుడు శాంతి లభించుతుందని భగవద్గీత చెపుతుంది.

"విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిఃస్పృహః
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి." (గీత : 2-71)

'ఏ పురుషుడు సమస్తములయిన కోరికలను త్యజించి మమత్వము, అహంకారము పొందక, అన్ని స్పృహలను వదలి వర్తించునో అతడే శాంతిని పొందగలడు.'

ఈ సామూహిక సాధన కోసమే అమ్మ "అన్నపూర్ణాలయం", విద్యాలయాలు, వైద్యాలయాలు, ఆదరణాలయాలు మొదలైన సంస్థలను ఏర్పాటుచేసి, పదిమందితో కలిసి పదిమందికోసం పనిచేస్తూ మమకారాలను విస్తృతపరచుకొనే సాధనకై తాను ఆచరించి మనకు మార్గ నిర్దేశం చేశారు అనటంలో సందేహంలేదు. మనం చేసే ప్రతిపనీ భగవత్సేవ అనీ, జరిగే ప్రతిదీ భగవదాజ్ఞానుసారమే అనీ అనుకోగలిగితే, మన దృష్టిలో-భావనలో మార్పు వస్తుంది. అదే అమ్మ పాదార్చన.

గీతాచార్యుని సందేశం ఇదే -

"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః"

'తన స్వాభావిక కర్మలద్వారా, భగవంతుని పూజించి మానవుడు పరమసిద్ధిని పొందుతున్నాడు'.

అమ్మ మనకు అందించిన మార్గం-సులభసాధన ఇదే !

జయహో మాతా !!

("ముముక్షువు" మాసపత్రిక 1999-డిసెంబరు సంచికలో ప్రచురితం)

నామపారాయణ ప్రీత

జీవితానికి గమ్యమేదనే ప్రశ్నకు భగవత్ సాక్షాత్కారమని, మోక్షమని, పునర్జన్మరాహిత్యమని చెబుతారు పెద్దలు.

అయితే భగవంతుడు ఎట్లా, ఎక్కడ ఉంటాడు ? అది మన భావంపై ఆధారపడి ఉన్నది.

"భావమే దైవం" అన్నారు అమ్మ. (అఅవా. 2326)

"ఇదంతా అదే" అన్నారు.

"దేవుడంటే నాలుగు చేతులతో, కాళ్ళతో వేరుగా ఎక్కడో లేడు. అన్నీ అయి ఉన్నాడు. గులాబీపువ్వుగా, తములపాకుగా, మంచంగా, కిటికీగా - అన్నీ తానే అయి ఉన్నాడు. (అఅవా. 2341)

"సర్వత్ర ఏ శక్తి ఉన్నదో అదే భగవంతుడు." (అఅవా . 2058)

"భగవంతుడంటే చైతన్యం". (అఅవా. 2062)

"నేను జగత్తే దైవమంటాను. మలయమారుతాలు, కోయిల కూతలు, పూల సరోవరాలే కాదు - పెంట, పేడ, చీము,నెత్తురు- అన్నీ కలిపితేనే ప్రకృతి. ఈ ప్రకృతే పరమేశ్వరుడంటాను".(అఅవా. 2334)

"భగవంతుడంటే మనస్సే. అది ఎక్కడో లేదు". (అఅవా. 2758)

"మనస్సే దైవం. బాధ,సుఖం, కష్టం, నష్టం.... అన్నీ దేవుడే". (అఅవా. 2760)

"దేవుడికి రూపం లేదనను. అన్ని రూపాల్లో ఉన్నాడంటాను" (అఅవా. 644)

"సర్వంలోనూ నిండిన దాన్ని గుర్తించలేరు గనుక రూపం, నామం అవసరం". (అఅవా . 646)

"ఎట్లా చూచే వాళ్ళకు అట్లా ఉంటాడు. ఆ చూపు యివ్వవలసింది కూడా వాడే". (అఅవా. 2014)

ఉపనిషత్తులు "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నాయి.

"న తదస్తి వినాయ త్స్యా న్మయా భూతం చరాచరమ్" – (గీత 10-39)

చరాచర జగత్తులో నేను లేకుండా ఉండునట్టి ప్రాణిఏదియును లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు తన అనుభవపూర్వకంగా చెప్పిన మాట ఆలకించుదాము.

కం. ఇందు గలడందు లేదని,
సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందే గలడు దానవాగ్రణి ! వింటే.

పరమ భాగవతోత్తముడైన శుకమహర్షి ఇలా అన్నారు :

కం. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పని లే దా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన ! వింటే.

అన్ని నామములూ వానివే గనుక నామ రహితుడు.

అన్ని రూపములూ వానివే గనుక రూపరహితుడు.

అన్ని గుణములూ వానివే గనుక గుణరహితుడు.

అట్టి భగవంతునిని ఎలా పొందాలి ? ఇందుకు అనేక ఉపాయాలను చెప్పారు. అందులో సులభమార్గం భగవన్నామస్మరణ.

............సత్యమా హరినామ సం
స్మరణ మొక్క ముహూర్త మాత్రము చాలు ముక్తిదమోనృపా !
(శ్రీ మహాభాగవతము- ద్వితీయ స్కంధము: 8)

"భక్త్యాత్వనన్యయా శక్య అహ మేవ, విధోఽర్జున !" (గీత 11-54)

నేను అనన్య భక్తిచేతనే శక్యమైనవాడను.

"చిక్కడు యుక్తిని, భక్తిని
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ!"
(శ్రీమహాభాగవతము - సప్తమ స్కంధము - 243)

భక్తి శ్రద్ధలతో కూడిన నామస్మరణ వల్లనే భగవంతుడు లభ్యమవుతాడని గ్రహించాం. అయితే ఏ నామం చేయాలి. అన్ని నామములూ ఆయనవే గనుక, ఏ నామమయినా ఆయనకే చెందుతుంది.

అమ్మ మాటలను తిలకించుదాం.

"నామం అంటూ చేస్తే, ఏ నామం అయినా ఒకటే. నాకు అన్ని నామాలూ ఒకటే. రామనామం, కృష్ణనామం, అమ్మనామం ఏది చేసినా నామం కాకుండా పోలేదుగా !" (అఅవా. 1721)

'జయహో మాతా' అంటేనే అమ్మ నామమా ! 'హరే రామ' అంటే అమ్మ నామం కాదూ - అన్ని నామాలూ ఒకటే" అన్నారు అద్వైతమూర్తి అమ్మ. (మాతృసంహిత: పుట. 562)

"మీరు ఏ నామంతో ఆరాధించినా ముట్టేది ఒక్కరికే" (అఅవా. 2657)

అమ్మ నామం యొక్క ఉపయోగాన్ని గురించి ఇలా అన్నారు. "బాధలు పడటానికై, ఓర్పు కోసమే నామం చెయ్యటం. బాధలు పోతాయని కాదు. కూర్చొని చెయ్యటానికి మనసు నిలపటం లేదు గనుక, ఏ పని చేస్తున్నా - అదే చేస్తూ ఉండండి". (అఅవా. 2656)

ఆధరాపురపు శేషగిరిరావు అన్నయ్య ఒకసారి అమ్మను అడిగారు- "అమ్మా ! నేను మౌంటు రోడ్డులో నామం చేస్తూ నడుస్తుంటే నీకు ఏమి అనిపించుతుంది అని ?" తన కళ్ళముందు నడుస్తున్నట్లు అనిపిస్తుందని అమ్మ సమాధానం. అమ్మ చూపు సామాన్యమయింది కాదుగా. ఆ కళ్ళు "కరుణాతరంగితాలు". నామం చేస్తుంటే అమ్మ కరుణ మనపై తరంగాలుగా ప్రసరిస్తున్నదన్నమాట.

ఆర్తితో ద్రౌపది 'కృష్ణా' అన్నా, గజేంద్రుడు 'గోవిందా' అన్నా, వారికి కావలసిన రక్షణ తత్క్షణమే అందింది గదా ! నామస్మరణ తెలిసి చేసినా తెలియక చేసినా సత్ఫలితం లభిస్తుందని అజామీళోపాఖ్యానం చెబుతుంది.

భగవద్గీతలో

యం యం వాపి స్మర న్భావం త్యజత్యం తే కలే బరమ్
తం త మేవైతి కౌంతేయ సదా తద్భావ భావితః.

తస్మా త్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ
మయ్యర్పిత మనోబుద్ధి ర్మామే వైష్య స్యసంశయః !
(భగవద్గీత అష్టమ అధ్యాయం - 6,7)

అనన్య చేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః
తస్యాహం సులభం పార్థ నిత్యయుక్తస్య యోగినః !
(భగవద్గీత అష్టమ అధ్యాయం - 14)

కనుక "శ్రద్ధయా పరయోపేతా" "మయ్యర్పిత మనోబుద్ధిః" "నిత్యయుక్తా" అయి, అన్నివేళలా నామస్మరణ చేస్తే పునర్జన్మ లేదని నొక్కి చెబుతున్నది భగవద్గీత.

భగవన్నామం భయాన్ని పోగొడుతుంది.

కం. గోవింద నామకీర్తన
గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి
త్రీవిభుడు చూరగొనియెను
కైవల్యంబు దొల్లి రెండు గడియల లోనన్ !
(శ్రీమహాభాగవతము - ద్వితీయ స్కంధము - 11)

భయాలన్నిటిలోకీ మహాభయం మృత్యుభయం. దానిని జయించటానికి భగవంతుని తలంపుకు మించిన ఉపాయం లేదు.

ఉ॥ ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్
మానుము- సంభవంబుగల మానవ కోట్లకు చావు నిత్యమౌ
గాన హరిన్ తలంపు మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్.
(శ్రీమహాభాగవతము - ద్వాదశ స్కంధము - 11)

నామ పారాయణ చేత అమ్మ సంతోషిస్తారు. అమ్మ తన అవతార సమాప్తికి కొద్ది రోజుల ముందుగా నామ సప్తసప్తాహములు(49 రోజులు) ఏర్పాటు చేయటం మనకందరికీ తెలిసిన విషయమే కదా !

“సప్తసప్తాహములు చూచి వెళ్ళాలని ఉంది నాన్నా” అని సోదరులు శ్రీతూనుగుంట్ల అప్పారావుని తొందర చెయ్యటం, శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులవారిని పిలిపించి, ఆ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయించటం, మనకందరికీ నామప్రాశస్త్యమును తెలియజేయటానికే అని మనం గ్రహించాలి.

నారదులవారు నామస్మరణను గురించి అనుగ్రహించిన శ్లోకాలతో ఈ వ్యాసం ముగిస్తాను .

నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్ ।
ప్రణామో దుఃఖశమనః తం నమామి హరిం పరమ్ ॥

యత్ఫలం నాస్తి తపసా న యోగేన సమాధినా ।
తత్ఫలం లభతే సమ్యక్ కలౌ కేశవ కీర్తనాత్ ॥

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా ॥

నాస్తి నాస్తి కలౌ నాస్తి హరినామ వినా గతిః ।
తస్మా ద్యత్నేన జప్తవ్యం హరేర్నామైవ కేవలమ్ ॥

('విశ్వజనని' 2003 మే సంచికలో ప్రచురితం)

సుఖానికి మార్గం

జీవితమంటే సమస్యల తోరణమనీ, సమస్యలతో రణం అనీ అమ్మ అన్నారు.

"బాధలు లేనిది జీవితమూ కాదు, అలలు లేనిది సముద్రమూ కాదు" (అఅవా. 2387). "బాధ లేకపోతే బ్రతకడం అనవసరం. ఇది ఏం బ్రతుకు ? బాధ అంటే చైతన్యం" అన్నారు అమ్మ. (అఅవా. 2388)

అమ్మ బాధల స్వభావమును గురించి చెబుతూ "తప్పించుకోలేని పరిస్థితిలోనుండీ తప్పించుకోవాలనుకోవటమే బాధ". " అక్కర లేనిది అనుభవిస్తున్నా బాధే, అవసరమైంది అనుభవించకపోయినా బాధే" అన్నారు.
(అఅవా. 2389,2390)

"కష్టాలంటే అందరికీ తలోరకం" (అఅవా. 2381)

"అనుభవించలేకపోవటమే బాధ" (అఅవా. 2382)

"బాధ్యతే బాధ - కోపమే బాధ" (అఅవా. 2396,2394)

బాధకు, నొప్పికి తేడా నిర్వచించారు అమ్మ.

"మనసుకు తగిలితే బాధ అంటారు, శరీరానికి తగిలితే నొప్పి అంటారు." (అఅవా. 2393)

"మనసుకు బాధ ఉంది అనుకుంటే ఉంది, లేదనుకుంటే లేదు" (అఅవా. 2404)

"సుఖంగా బాధననుభవిస్తే బాధ బాధ కాదుగా !" (అఅవా. 2402)

"బాధలు అనుభవిస్తున్నా , అది బాధ అనిపించనప్పుడు సహజ సహనమవుతుంది" (అఆ్రవా. 2406)

బాధలవలన కలిగే లాభాల గురించి అమ్మ యిలా అన్నారు:

"బాధలో ఉన్నంత ఏకాగ్రత సుఖంలో లేదేమో"(అఅవా. 2409)
"బాధలు ఉండవలసిందే- లేకపోతే స్థాణువైపోతాడు; చైతన్యం ఉండదు" (అఅవా. 2407)

"జీవితం వికసించటం అంటే బాధ పడటమేనేమో !" (అఅవా. 2408).

"బాధలు మనకు అవసరమని యివ్వబడతాయి"

"లేనిదానికోసం ఆశించేది దుఃఖం. ఉన్నది చాలనుకునేది సుఖం" (అఅవా. 2398).

బాధలు, చిక్కులు, కష్టాలు వచ్చినప్పుడు వాటినుంచి ఉపశమనం కలిగించాలనే మనకు అమ్మ ఒక మహావాక్యాన్ని ప్రసాదించారు. "అనుకున్నది జరుగదు; తనకున్నది తప్పదు" అని.

మనం జీవితములో చాలా కావాలని కోరుకుంటాం. కొన్ని లభిస్తాయి; కొన్ని లభ్యమవవు. లభ్యమవనపుడు బాధ కలుగుతుంది. అలా బాధ కలిగినప్పుడు "అనుకున్నది జరుగదు; తనకున్నది తప్పదు" అనే మహావాక్యాన్ని మననము చేస్తే బాధనుంచి ఉపశమనం కలుగుతుంది.

1976 లో ఒకసారి నేను ఏలూరునుండి అమ్మ దర్శనానికి వెళ్ళాను. ఒకరకముగా చెప్పాలంటే అమ్మ నాకు కలుగబోయే బాధకు ఉపశమనాన్ని ప్రసాదించటానికే ఆ రోజు ప్రేరణ యిచ్చి పిలిపించిందని నాకు అనిపిస్తుంది.

సాయంకాలం ఆరుబయట (ప్రస్తుతం ధ్యానాలయం ఉన్నచోట) మంచంపై పడుకొని తనలో తాను "యదృచ్ఛాలాభ సంతుష్టో" అనుకున్నారు అమ్మ. అమ్మ మంచం దగ్గర నేను ఒక్కడినే ఉన్నాను. తర్వాత కొంతసేపటికి శ్రీ విఠాల రామచంద్రమూర్తి అన్నయ్య వచ్చారు. అమ్మ "యదృచ్ఛా లాభ సంతుష్టో" అంటే ఏమిటి నాన్నా ! అని అడిగారు. ఆయన సమాధానం చెప్పారు. మరుసటి దినం ఉదయమే నేను అమ్మ దగ్గర బొట్టు పెట్టించుకొని సెలవు తీసుకుందామని వెళ్ళాను. అమ్మ "వాత్సల్యాలయము" లో మంచంమీద కూర్చుని ఉన్నారు. నేను ఒక్కడినే ఉన్నాను. అమ్మ మరల తనలో తాను నాకు వినబడేంత బిగ్గరగా "యదృచ్ఛా లాభ సంతుష్టో" అనుకున్నారు. అప్పుడు నా మనస్సులో అమ్మది "తోలు నోరు కాదు, తాలు మాట రావటానికి" అని గుర్తువచ్చి, ఇది అమ్మ నాకిచ్చే ఉపదేశమని అనిపించింది. ఎక్కడో గీతలో చదివినట్లు మదిలో గుర్తు. జిల్లెళ్లమూడి నుండి ఏలూరు చేరేవరకు కొన్ని వేలసార్లు "యదృచ్ఛా లాభ సంతుష్టో" అని మననమైంది.

ఇంటికి చేరగానే భగవద్గీత వెదికినాను.

"యదృచ్ఛా లాభ సంతుష్టో, ద్వంద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌచ, కృత్వాపి న నిబధ్యతే" (గీత : 4-22)

అనే శ్లోకం కనబడింది.

ఎవడు తానుగా కోరకనే దానంతట అదే లభించిన వస్తువుతో ఎల్లప్పుడూ తృప్తి చెంది యుండునో, ఎవనిలో ఈర్ష్యా భావం సమూలముగా నశించినదో, ఎవడు హర్ష శోకాది ద్వంద్వాలకు పూర్తిగా అతీతుడో, సిద్ధి యందును, అసిద్ధి యందును ఎవడు సమముగా నుండునో, అట్టి కర్మ యోగి కర్మ లాచరించుచున్ననూ వానిచే బంధింపబడడు.

ఇంతలో, మా రీజనల్ మేనేజరుగారు నేను రాగానే ఫోనులో

మాట్లాడమన్నారని నాభార్య చెప్పింది. ఆ రోజు మా బ్యాంకులో ప్రమోషన్స్ ఇచ్చారని, నాకు ప్రమోషన్ రానందుకు చాల విచారమును తెలియజేస్తూ, రాక పోవటానికి తాను కారణంగాదని, తనను అపార్థము చేసుకోవద్దని, కన్సోలేషన్‌గా ఒక అడిషనల్ ఇంక్రిమెంటు ఇచ్చారని, రీజనల్ మేనేజరు చెప్పారు. అమ్మ ఎందుకు "యదృచ్ఛా లాభ సంతుష్టో" అని నాకు ఉపదేశ మిచ్చారో అప్పుడు దృఢంగా బోధపడింది.

నేను "అనుకున్నది జరుగదు, తనకున్నది తప్పదు" అనే అమ్మ వాక్యాన్ని చదివి అమ్మ దగ్గరకు వచ్చాను. దాని ప్రయాణం "యదృచ్ఛా లాభ సంతుష్టో" తో గాని పూర్తి అవదని, అమ్మ అనుగ్రహంతో ఉపదేశము చేశారు.

జరిగేవాటిలో మనకు నచ్చినవీ, యిష్టమయినవీ ఉంటాయి; మనకు నచ్చనవీ, యిష్టం కానివీ ఉంటాయి. మనలను స్థితప్రజ్ఞులనుగా తీర్చి దిద్దటానికే అమ్మ ఈ మహావాక్యాన్ని ప్రసాదించారని అనిపించుతుంది.

"దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥" (గీత 2-56)

దుఃఖములు కలిగినవేళ ఎవని మనస్సు కలవరపాటు పొందదో, సుఖములు కలిగినవేళ అన్నివిధముల నిర్వికారముగా నిఃస్పృహతో ఎవడుండగలుగునో మరియు ఎవని మనస్సు లోని రాగభయక్రోధాలు నశించిపోయినవో అట్టి ముని స్థిత ప్రజ్ఞుడనబడును.

అమ్మ "సహన దేవతను ఆరాధించాలంటే బాధలనే పుష్పాలు కావాలి" అన్నారు. "శిల్పానికి అందం రావాలంటే ఉలి దెబ్బలవసరం" అన్నారు అమ్మ.

జయాపజయాలు, సుఖదుఃఖాలు, మానావమానాలు మన చిత్త

స్థైర్యాన్నీ, ఆత్మశక్తినీ పెంపొందించుతాయి. ఈ విషయాన్నే "సావిత్రి" అనే గ్రంథంలో శ్రీ అరవిందులు ఇలా అన్నారు :-

"Pain is the hammer of the Gods to break
A dead resistance in the mortal's heart,
His slow inertia as of living stone."

"Pain is the hand nature sculpturing men
to greatness: an inspired labour chisels
with heavenly cruelty."

"Although the shaping God's tremendous touch
Is torture unbearable to mortal nerves,
The fiery spirit grows in strength within
And feels a joy in every titan pang. "

- **Savitri Book Six - Canto Two**

శ్రీ అరవిందులవారు ఇంకా ఇలా అన్నారు :-

"Arisen from the tragic crash of life,
Arisen from the body's torture and death,
The spirit rises mightier by defeat;
Its godlike wings grow wider with each fall
Its splendid failures sum to victory."

- **Savitri Book Six - Canto Two**

బాధలనతిక్రమించడానికి అమ్మ యిచ్చిన సూచనలు పరిశీలించుదాం.

1. బాధలు మనస్సుకు సంబంధించినవని చెప్పారు గదా, "ఏదో ధ్యాస మీద తింటూ ఉంటావనుకో, అప్పుడు నీవు ఏమి తిన్నదీ, ఎంత

తిన్నదీ కూడా తెలుసుకోలేవుగా !" (అఅవా. 24) అలాగే బాధలను గురించి.

2. "అందరూ - అన్నీ, కాలంమీద ఆధారపడ్డయ్"(పు. 283, నాగుల చవితి, మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాలు)

శ్రీమహాభాగవతం ఈ విషయములో ఇలా చెబుతోంది

ఉ. వాయువశంబులై యెగసి వారిధరంబులు మింట గూడుచుం
బాయుచునుండు కైవడి బ్రపంచము సర్వము కాలతంత్రమై
పాయుచు గూడుచుండు నొక భంగి జరింపదు కాల మన్నియుం
జేయుచునుండు కాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్ !

(ప్రథమ స్కంధము: 1-209)

3. "ఏ మార్గాన నడిచినా వాడే నడిపిస్తున్నాడనుకోవడమే సన్మార్గం" " నేను నడుస్తున్నాను అనుకోవటమూ సన్మార్గమే. అన్ని వేళల్లో నీవు తప్ప ఇంకొకటి లేదు - అనుకోవడం కూడా సన్మార్గమే."

అమ్మ చాలా సమయాలలో "సర్వమూ దైవం చేస్తున్నాడను కోవడమే" అనీ, "జరిగే ప్రతిదీ దైవం చేయిస్తున్నాడనుకోవటమే, మనస్సుకు స్థిమితం కలగటానికి మార్గం" అనీ చెప్పారు.

"సుఖానికి మార్గం ఒకటే - ఏది చేసినా దైవం చేశాడను కోవటమే" అన్నారు అమ్మ. "సుఖం ఎక్కడ ఉందీ అంటే - తృప్తిలో ఉంది" అన్నారు అమ్మ.

"తమేవ శరణం గచ్ఛ, సర్వ భావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥"

(గీత :18-62)

ఓ భరత వంశీయుడా ! నీవన్ని విధముల ఆ పరమాత్ముని శరణుపొందుము. ఆ పరమాత్ముని కృపచేతనే నీవు పరమశాంతిని,

సనాతనమైన పరమధామమును పొందుదువు.

ఈనాటి అధునాతన సమాజ చిత్రాన్ని చూస్తే, అంతా చిత్రం అనిపిస్తుంది. "ఆశా - అసంతృప్తుల కలయికే జీవితం" అన్నారు అమ్మ. అయితే ఈనాడు ఆశ-అత్యాశగా మారి, అసంతృప్తితో ఎండమావుల వెంట పరుగిడుతున్నాడు ఈనాటి నవనాగరకుడు. ఎన్ని ఆశలు నెరవేరినా, ఇంకేదో కావాలనే ఆరాటం, అసంతృప్తి దహించివేస్తుంటే, నిలువునా నీరై నిలచి చూస్తున్నాడు. చిన్న సమస్య ఎదురైనా ఆశల సౌధాలు కూలినట్టె తల్లడిల్లిపోతున్నాడు. ఆధునిక విజ్ఞానం మనిషికి పరుగును నేర్పినంతగా, ఆగి, ఆలోచించే లక్షణాన్ని నేర్పలేదనే చెప్పాలి. ఈ పరిస్థితులలో బాధను గురించి, సుఖాన్ని గురించి, తృప్తిని గురించి అమ్మ యిచ్చిన నిర్వచనములు జీవితంలో సమన్వయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఏ మనిషి జీవితమైనా వడ్డించిన విస్తరి కాదు అన్న అమ్మ ప్రబోధం మనకు జీవితాన్ని క్రొత్త పుంతలో నడిపించే దృష్టి నిస్తుంది.

('విశ్వజనని' 2003 - నవంబరు సంచికలో ప్రచురితం)

కైవల్యప్రాప్తికి మార్గం

మానవజన్మకు గమ్యం కైవల్యపదం చేరటం అని పెద్దలు చెబుతారు.

"వైకల్యం లేకపోవటమే కైవల్యం" అన్నారు జిల్లెళ్లమూడి అమ్మ. (అఅవా - 270 పు.44)

కైవల్యము, మోక్షము, జన్మరాహిత్యము అనేపదాలు ఒకే అర్థాన్ని ప్రతిపాదించుతాయి.

కైవల్య పదం చేరటానికి రెండుమార్గాలు సూచించబడ్డాయి. మొదటిది - వేదాంతమనే ఉపనిషదుక్త మార్గం. అందు వ్యాస భగవానులు బ్రహ్మసూత్రములద్వారా జ్ఞానమే మోక్షసాధనమని చెప్పారు. రెండవది - సమస్త జీవులకూ సుసాధ్యమైన భగవంతుని ఆశ్రయించడం. దీనినే 'భాగవతమతం' అంటున్నారు.

కైవల్యం యెక్క స్వభావమును గురించి ఈక్రింది విధంగా వివరించబడింది.

"కైవల్యం స్వరూప ప్రతిష్ఠా"

(కైవల్యపాదం - 34వ సూత్రం - పతంజలి యోగము)

కైవల్యపదం చేరటానికి భాగవతం సూచించిన మార్గాలు పరిశీలించుదాం. పోతనగారు భాగవత ఆరంభమునందే భగవద్భావనయే కైవల్యపదం చేరటానికి మార్గంగా సూచించారు.

శ్రీకైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకు గేళిలోలవిలసద్దృగ్జాల సంభూత నా
నాకంజాత భవాండకుంభకు మహానందాంగనాడింభకున్.

(శ్రీమహాభాగవతము - ప్రథమస్కంధము - 1)

భగవద్దర్శనం కైవల్యప్రాప్తి కాదు. అందుకే భగవద్దర్శనం లభించినా, ప్రయాణం పూర్తి కాలేదు అని ఈక్రింది భాగవతకథల వలన మనకు తెలుస్తుంది.

ధ్రువుడు భగవద్దర్శనం లభించినప్పుడు ముక్తిని కోరక సాంసారికమైన కోరికలు కోరినందులకు ఇలా విచారించాడు.

ధనహీనుండు నృపాలుజేరి మిగులన్ ధాటిన్ ఫలీకార మి
మ్మని యర్థించిన రీతి ముక్తిఫలదుండైనట్టి పంకేజ లో
చనుడే చాలప్రసన్నుడైన నతనిన్ సాంసారికం బర్థి గో
రిన నావంటి విమూఢ మానసులు ధాత్రిన్ గల్గిరే యెవ్వరున్.

(శ్రీమహాభాగవతము - చతుర్థస్కంధం - 299)

"జంతుశ్రేణికి నన్నుజూచిన పునర్జన్మంబు లేదర్భకా !"

అని ప్రహ్లాదునితో నరహరి అన్నాడు.

సకలభావములను సాధులు విద్వాంసు
లఖిల భద్రువిభుడనైన నన్ను
గోర్కు లిమ్మటంచు గోరుదురిచ్చెదఁ
కోరుమెద్దియైన కుఱ్ఱ ! నీవు.

(శ్రీమహాభాగవతము - సప్తముస్కంధం - 369)

అంత ప్రహ్లాదుడు "దేవా! వరదుండవయ్యెదవేని కామంబు వృద్ధిపొందని వరంబు కృప సేయుము- కామంబుల విడిన పురుషుండు నీతోడ సమాన విభవుండగు" అని అన్నాడు.

ఈ నేపథ్యంలో వామనుడు కోర్కెలు లేకుండుటను గురించి అన్న ఈ మాటలు పరిశీలించుదాం.

వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచున్
దృప్తింజెందని మనుజుడు,
సప్తద్వీపములనైన జక్కంబడునే !
(శ్రీమహాభాగవతం - అష్టమస్కంధం - 573)

సంతుష్టు డీ మూడు జగముల బూజ్యుండు సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసారహేతువు సంతసంబున ముక్తి సతియు దొరకుఁ
పూటపూటకు జగంబున యదృచ్ఛాలాభతుష్టినితేజంబుతోన పెరుగు
పరితోష హీనత బ్రభ చెడిపోవును జలధార ననలంబు సమయునట్లు
(శ్రీమహాభాగవతము - అష్టమ స్కంధం - 575)

బలరామకృష్ణులు తమదర్శనానంతరం మాలాకారుడైన సుధాముని అనుగ్రహించి

....
....
కోరిన వరమిచ్చెదమని
కారుణ్యముసేయ నతడు గని యిట్లనియెన్.

నీ పాదకమల సేవయు
నీ పాదార్చకుల తోడి నెయ్యమ్ము నితాం
తాపార భూతదయయును
తాపసమందార ! నాకు దయసేయఁగదే !
(శ్రీ మహాభాగవతము-దశమస్కంధం-పూర్వభాగం-1267- 68)

ఇది మనకు కైవల్యపదాన్ని చేరటానికి అందించిన మార్గం. ఇందులో ప్రతిపాదించిన మొదటి మార్గం - భగవంతుని పాదకమల సేవ.

భగవంతుని పాదం అంటే పురుషసూక్తం "పాదోఽస్య విశ్వా భూతాని" అని వర్ణించింది. అంటే విశ్వంలోని భూతములన్నీ భగవంతుని పాదమే. ఆ పాదసేవ అంటే విశ్వభూతసేవయే అని అర్థము చేసుకోవాలి.

క. తరణంబులు భవజలధికి
హరణంబులు దురితల తలకాగమముల కా
భరణంబు లార్తజనులకు
శరణంబులు నీ పదాబ్జ సంస్మరణంబుల్.

(శ్రీమహాభాగవతము -ఏకాదశ- స్కంధం - 15)

రెండవది - 'నీ పాదార్చకులతోడి నెయ్యము' ఇది భక్తుల సత్సంగమును గురించి చెబుతుంది.

'భజగోవిందము' లో శ్రీశంకరభగవత్పాదులవారు

సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

అని సత్సంగత్వం జీవన్ముక్తినిస్తుందన్నారు.

ఇక మూడవది - "నితాంతాపార భూతదయ" ను దయసేయమని ప్రార్థిస్తున్నాడు. ఇది భక్తునికి ఉండవలసిన ప్రథమ లక్షణంగా భగవద్గీత చెబుతుంది.

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ" ॥(గీత:12-13)

భాగవతము ఎల్లప్పుడూ సర్వజీవులయందూ దయ, కరుణ కలిగి ఉండమని బోధిస్తుంది.

(xix)

ఇన్నియు దెలియ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపు - యజ్ఞ దానాది పుణ్య
ఫలము వేదంబు చదివిన ఫలము నార్త
జనుల గాచిన ఫలముతో సమము గావు.
(శ్రీమహాభాగవతము - తృతీయస్కంధం - 260)

....

............శరీరధారులకు నాపదవచ్చినవారి యాపదల్
గ్రన్నన దాల్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే
లున్నదె ! నాకు దిక్కు పురుషోత్తము డొక్కడు సుమ్ము పుల్కసా !
(శ్రీమహాభాగవతము - నవమస్కంధం - 647)

ఈ విషయాన్నే కపిలుడు తన తల్లికి ఉపదేశిస్తాడు

అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ
శు నను నవజ్ఞసేసి మనుజుండొగి మత్ప్రతిమార్చనా విడం
బనమున మూఢుడై యుచిత భక్తిని నన్ను భజింపడేని య
మ్మనుజుడు భస్మకుండమున మానక వేల్చిన యట్టి వాడగున్ !
(శ్రీమహాభాగవతము - తృతీయస్కంధం - 955)

జిల్లెళ్లమూడి అమ్మ ఈ క్రింది సందేశాన్ని అందచేశారు :-

"తమ బ్రతుకును తాము బ్రతకలేని అనేక విధాల బలహీనులు ఉన్నారు. వారికి తోడుపడండి. అయితే అది వారిపై జాలితో చేసే సహాయమని అనుకోక, వారిని భగవత్ స్వరూపులుగా భావించి సేవ చేయండి ! కనిపించని దేవునిపై మనస్సు నిలవడంలేదనీ, ఏకాగ్రత కుదరటంలేదనీ బాధపడక, మానవరూపంలో కనిపించే యీ దేవుళ్ళను-ఆర్తులను-ప్రేమతో
ఆరాధించండి ! ఆ సేవలో కలిగే తృప్తే ముక్తి. (మాతృ సంహిత)

భూతదయ పెరగటం అంటే సర్వత్రానురాగం పెరగటమే గదా!

ఆ సర్వత్రానురాగమే మాధవత్వం అంటారు అమ్మ.

"ఒకనియందుంటే మమత, సర్వత్రా ఉంటే సమత" అన్నారు అమ్మ.

(అమ్మ వాక్యాలు 1819)

ఆ దయాదృష్టి "ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి" అనే స్థితికి చేర్చుతుంది. ఆ స్థితి తన నిజస్వరూపం - అంటే " అన్ని నేనులూ నేనే" అనే స్వరూప స్థితికి చేర్చుతుంది. అదే కైవల్యం.

(ముముక్షువు 2004 - జనవరి-ఫిబ్రవరి సంచికలో ప్రచురితం)

"త్యాగే నైకేఽమృతత్త్వమానశుః"

(కైవల్యోపనిషత్.)

మోక్షము త్యాగముతో మాత్రమే లభ్యమవుతుంది.

"గడ్డి పెడతారా ?"

ఒకరోజు పెదముత్తీవి- శ్రీకృష్ణాశ్రమంలో గురువుగారిని కలుసుకుందామని వెళ్ళాను, ఆశ్రమంలో సుమారు 200 గోవులు పోషింపబడుతున్న విషయం దృష్టిలో ఉంచుకుని, గురువుగారితో "వేసవి వస్తోంది - గోవులకు కావలసిన గడ్డి కొనే సమయం కనుక, "గడ్డి కొనే నిమిత్తం నాదొక చిన్న సమర్పణ !" అన్నాను.

వెంటనే గురువుగారు నవ్వుతూ "అయితే మాకు గడ్డి పెడతారన్నమాట!" అన్నారు.

"అయ్యో ! మేము మీకు గడ్డి పెట్టటమేమిటి ! మేము తప్పులు చేసినప్పుడు మీరే మాకు గడ్డి పెట్టాలిగాని !" అని నేను అన్నాను - గడ్డి పెట్టటం అంటే మందలించటం అనే ఉద్దేశంతో. గురువుగారు నవ్వి ఊరుకున్నారు.

29-12-98 వైకుంఠ ఏకాదశినాడు మరల ఆశ్రమానికి వచ్చినప్పుడు, గోపోషణ గురించి ప్రస్తావన వచ్చి "మీరు గడ్డి పెడతారన్నమాట !" అని మరల అన్నారు. కాని, అప్పుడు కూడా వారు ఇస్తున్న సందేశం నా మందబుద్ధికి స్ఫురించలేదు.

శ్రీగోదాశ్రీరంగనాథ కల్యాణమునకు వచ్చినప్పుడు, లోగడ జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చి, మనసులో ఒక్క వెలుగు వెలిగినట్టయింది. గురువుగారు ఆ సంభాషణద్వారా, గోవులతో తమ తాదాత్మ్యాన్ని - అంటే

ఆత్మౌపమ్య స్థితిని - తెలియజేశారని అర్థమై, చాలా ఆనందం కలిగింది.

గురువుగారు శిష్యులవెంట - మనవెంట - పడి, మనం గ్రహించేవరకూ వదలక కృపాంతరంగులై మనకు గుర్తుచేస్తూ మనల్ని తీర్చిదిద్దటానికి ఎలా ప్రయత్నం చేస్తారో ! - అనటానికి ఇదొక నిదర్శనం.

సర్వమునందూ - తనను - ఆత్మను - చూడటమే ఆత్మసాక్షాత్కారం కదా ! గోవులలో మనను చూసుకోమని గురుదేవులు బోధించినట్టు అవగతమైన నాకు ఎనలేని ఆనందం కలిగింది.

"తనయందు అఖిల భూతములందు ఒకభంగి సమహితత్వంబున జరగువాడు" అన్న ప్రహ్లాదుని స్థితిని గురువుగారియందు దర్శించి ధన్యుణ్ణయ్యాను.

"ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి !"
(భగవద్గీత : 6-32)

("ముముక్షువు" మాసపత్రిక 2000-ఫిబ్రవరి సంచికలో ప్రచురితం)

మానవుడు మాధవుడు కావాలంటే ! ..

"మీరు నా బిడ్డలే కాదు, నా అవయవాలుకూడా" అన్నారు అమ్మ. ఒకసారి ఒక సోదరుడు "మీ ధ్యేయమూర్తి ఎవరమ్మా ?" అని ప్రశ్నిస్తే, సమాధానంగా "మీరే నా ధ్యేయమూర్తులు" అని అన్నారు.

శ్రీవిఠాల రామచంద్రమూర్తిగారు అమ్మ పాదాలను కడిగి "అమ్మా! ఇవి బ్రహ్మ కడిగిన పాదాలే కదా !" అన్నారు. అమ్మ "అవును" అని వెంటనే "మీరందరూ బ్రహ్మలు కాకపోతేగా" అన్నారు !

మరొకసారి "మీరు దేవుణ్ణి చూసారా ?" అన్న ప్రశ్నకు "మీరు దేవుడు కాకపోతేగా" అని సమాధానం చెప్పారు అమ్మ.

భగవద్గీతలో "మమైవాంశో" (గీత : 15-7) 'మీరు నా అంశే' అని కృష్ణపరమాత్మ అన్నాడు.

"అమృతస్య పుత్రాః" అని శ్రుతిమాత సంబోధిస్తుంది.

గీతలో కృష్ణుడు "దైవీమభిజాతోఽసి" అని చెప్పిన విధంగా మనమందరం దైవీసంపదతో పుట్టాం. ఐతే మనమందరమూ మోహంచేత ఈ విషయాన్ని స్మృతిపథంలో ఉంచుకొనక మరచి పోయాం. అజ్ఞానంతో స్వరూప విస్మృతి పొందిన వానిని స్వరూప స్మృతికి తేవడమే సాధన ప్రక్రియ ధ్యేయం. అందుకే అమ్మ మానవుడు మాధవునిగా మారటానికి మంచిదారిని సూచిస్తూ "**పదిమందితో కలిసి పనిచేయటం, పదిమందికోసం పనిచేయటం, మమకారాన్ని చంపుకోవటంకాక, పెంచుకోవటం, పరిమిత మయిన ప్రేమను విస్తృతం చేసుకోవటం నేటి మానవధర్మం ఇదే** అని

నేననుకుంటున్నాను. ఇదే మానవుడు మాధవుడుగా మారటానికి మంచిదారి........" అని అన్నారు.

మనందరికీ కొన్ని సంశయాలు ఉన్నాయి. సాధన వలన మనం బ్రహ్మస్థితిని - అంటే ప్రాప్తరూపప్రాప్తిని - పొందగలమా !

భగవద్గీత మనకు "ఉద్ధరేదాత్మనాత్మనం" (గీత : 6-5) 'నిన్ను నీవు ఉద్ధరించుకొ'మ్మని బోధిస్తుంది.

మనుష్యులలో దైవాంశమూ, రాక్షసాంశమూ రెండూ ఉన్నాయి. మానవుడు తన కృషితో, తన కర్మతో దేవతా కావచ్చు, రాక్షసుడూ కావచ్చు. "యథేచ్ఛసి తథా కురు" (గీత : 18-63). నీ ఇష్టమైనది చేసుకొమ్మని భగవంతుడు మానవునికి కర్మ స్వాతంత్ర్యం ఇచ్చాడు.

హంఫ్రీస్ అనే విదేశీయుడు రమణ మహర్షి దగ్గరకు వచ్చాడు. వారి మధ్య సంభాషణ ఇలా సాగింది....

హంఫ్రీస్ : నేను ప్రపంచాన్ని ఏ విధంగా ఉద్ధరించగలను ?

మహర్షి : ముందు నిన్ను ఉద్ధరించుకో, దానితో ప్రపంచాన్ని ఉద్ధరించిన వాడివవుతావు.

హంఫ్రీస్ : నేను ప్రపంచానికి సహాయపడాలని అనుకుంటున్నాను. తప్పా?

మహర్షి : తప్పకుండా. నిన్ను నీవు ఉద్ధరించుకోవడంవలన ప్రపంచాన్ని ఉద్ధరిస్తావు. నీవు ప్రపంచానికి భిన్నంగా లేవు. ప్రపంచం నీకు వేరుకాదు.

పై సంభాషణ ద్వారా మనలను మనం ఉద్ధరించుకొనే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మనకు ఉన్నదని మహర్షి సందేశమే కదా !

"నన్ను నేను ఉద్ధరించుకొనే తాహతు నాకు ఉన్నదా ? అనే పిరికిపందవు కావద్దు. "Be fearless". 'అభయం' దైవీ సంపత్తిలోని మొదటి గుణం. భగవంతుడు అర్జునుని నిమిత్తమాత్రంగా నిలబెట్టి మనందరికీ

ఇచ్చిన సందేశం :

"క్లైబ్యం మాస్మ గమః" (గీత : 2-3) 'పిరికిపందవు కావద్దు'.

"క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ।" (గీత 2-3) 'హృదయ దౌర్బల్యాన్ని వదలి నిలబడు'. అని నొక్కి చెప్పాడు.

సరే ! నేను ముందుకు పోతాను, సాధన ఎక్కడ మొదలు పెట్టాలి ? అని ప్రశ్న. మన మోహం పోవడానికి సత్త్వగుణమును పెంపొందించుకోవాలి. దానికిగాను కొన్ని సూచనలు.

1. నాత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాంత మనశ్నతః।
నచాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ (గీత : 6-16)

ఓ అర్జునా ! ఈ యోగము అతిగా భుజించువానికి సిద్ధించదు. బొత్తిగా తిననివానికీ సిద్ధించదు. మరియు ఎక్కువగా నిద్రించెడి స్వభావము గలవానికి (నిదురపోతుకు) గాని, ఎల్లప్పుడూ మేలుకొని ఉండువానికి గాని సిద్ధించదు.

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు।
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ (గీత : 6-17)

దుఃఖమును నశింపచేయు ఈ యోగము తగిన విధముగా ఆహార విహారాదులు గావించువానికి, కర్మలను అనుష్ఠించుటలో తగిన రీతిగా ప్రవర్తించువానికే సిద్ధించును.

"ఆయుః సత్త్వబలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః ॥"
(గీత : 17-8)

ఆయువు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖము మరియూ ప్రీతిని పెంచునవి, రసయుక్తమైనవి, స్నిగ్ధమైనవి, స్థిరములు - అనగా శరీరమున సారరూపమున చాల కాలము ఉండునవి - మరియూ స్వాభావికముగా

మనోహరములైనట్టి భోజన పదార్థములు సాత్త్విక పురుషునకు ప్రియము.

సాత్త్విక ఆహారానికి ఇంకొక ముఖ్యమైన విషయం, అది తన కష్టార్జితమై, న్యాయమైన సంపాదనతో ఏర్పడి ఉండాలి.

"నిజ కర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తం" అంటుంది భజగోవిందం.

కనుక ఆహార విహారములలో, నిద్ర విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచింపబడ్డాయి.

జిహ్వకు ఆహారం ఎట్లాగో, ఇతర ఇంద్రియాలకు కూడా సరియైన ఆహారం అందజేయాలి.

దేహం ధర్మ సాధనకు ఉపయోగపడే పనిముట్టు. దేహం ఉంటేనే కదా సాధన ఏదైనా ! అందుచేత దేహారోగ్యానికి కావలసిన శారీరక శ్రమ ఆసనముల ద్వారాగాని, నడక ద్వారా గాని చేసి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

2. "తస్మా త్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య" (గీత : 3-41)

నీవు మొదట ఇంద్రియాలను నియమించుకో.

లేకపోతే మనశక్తి అంతా వృధా అయిపోతుంది.

3. "తాం స్తితిక్షస్వ" (గీత : 2-14)

సుఖదుఃఖాలు "ఆగమాపాయినోఽ నిత్యాః" వస్తూ, పోతూ ఉంటాయి. కాబట్టి అవి అనిత్యాలు. "వీటికొరకు నేను ఎందుకు వెతచెందాలి" అనే వివేకంతో తితిక్షను అవలంబించాలి.

4. "దేవునికీ మానవునికీ గల భేదం భావమే" అన్నారు అమ్మ. ఏ కర్మ చేయాలనే ప్రశ్నలేదు. కర్మవెంట కలసి ఉండే భావనతోనే సిద్ధి. భగవదర్పణ బుద్ధితోనే సుమా - సిద్ధి. భావన త్యాగాన్ని సృష్టిస్తుంది. త్యాగంతో

యోగ్యమైన చిత్త శుద్ధి లభిస్తుంది. అందుచేత భగవద్గీత

"మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ (గీత : 3-30)

ఓ అర్జునా ! నీవు అంతర్యామిని పరమాత్మ అగు నాయందు లగ్న మైన చిత్తముతో సకల కర్మలను నాకు అర్పణం గావించి ఆశలేనివాడవై మమకారము వదలి సంతాప రహితుడవై యుద్ధము చేయుము. ఇట్లు నిత్యమూ ఎవరు శ్రద్ధావంతులై, దోషదృష్టి లేనివారై ఆచరిస్తారో, వారు కర్మలనుండి ముక్తులగుదురు. వారికి నైష్కర్మ్య సిద్ధి లభిస్తుంది.

5. "ఇతరులను ఎగతాళి చేసేవాడికి ఏమీ రాదు" అన్నారు అమ్మ. కనుక నీవు అనసూయావంతుడవై ఉండటానికి ప్రయత్నం చేయి.

6. "ఇతరులను విమర్శించటం అవివేకం,
తనను తాను విమర్శించుకోవటం వివేకం" అన్నారు అమ్మ.

7. "సర్వత్రా మంచిని చూడటమే మంచితనం". "ఎదుటివారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం కలుగుతుంది" అన్నారు అమ్మ. ఒక ఔన్సు బంగారం తీయటానికి టన్ను మట్టినుండి తీసుకోవలసి ఉంటుంది. అలాగే ఎదుటి వారిలో చెడ్డ లక్షణాలు ఎన్ని ఉన్నా, అందులోంచి మంచి గుణాలను మాత్రమే తీసుకోవాలి.

"దృష్టిమారితే సృష్టిమారుతుంది" అన్నారు అమ్మ.

నగలు వేరు వేరు రూపాలలో ఉండవచ్చు - అందలి బంగారం ఒకటే. కుండలూ, మూకుళ్ళు, ప్రమిదలు వేరువేరుగా కనిపించుతాయి. కానీ అవన్నీ మట్టేగదా ! అవి ఒకే పదార్థమని చూడగలిగినట్లే, అందరినీ అమ్మ అవయవాలుగా చూడటం అలవర్చుకుంటే "ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి" అలవడుతుంది. కనిపించే ప్రతిదీ అమ్మే అని " వాసుదేవః సర్వ మితి" (గీత : 6-18). సర్వమూ వాసుదేవుడే అని అనిపిస్తుంది. ఆ ధ్యాస అమ్మ ధ్యానమవుతుంది.

8. సాధ్యమైనంత ఎక్కువగా భగవన్నామం చేయాలి. అప్పుడు మనం కరుణాతరంగిత అయిన అమ్మ కన్నులముందు ఉంటాము. "తస్మాద్యోగీ భవ" (గీత : 6 - 46). నీవు యోగివి కమ్ము అన్నాడు కృష్ణ పరమాత్మ.

"శ్రద్ధావా న్భజతే యో మాం స మే యుక్త తమో మతః"
(గీత : 6-47)

ఎవడు నాలో లగ్నమైనట్టి అంతరాత్మతో నిరంతరమూ నన్ను భజించు చుండునో, అట్టి యోగి పరమ శ్రేష్ఠుడని నా నిశ్చితాభిప్రాయము.

కనుక నిత్య నామస్మరణ-భజనయే. అందుచేత నీవు ఉత్తమ యోగి స్థానంలో ఉంటావు.

9. ఏ పనిని చేసినా దానిని భగవదర్పణ బుద్ధితో చేయాలి.
యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ (గీత : 9 - 27)

ఓ అర్జునా ! నీవు ఏపని చేయుదువో, ఏమి భుజింతువో, ఏది హోమము చేయుదువో, ఏమి దానము చేయుదువో, ఏమి తపము చేయుచున్నావో-అవి అన్నియూ నాకు అర్పింపుము.

ప్రహ్లాదుడు ఇలా ఆచరించినట్లు భాగవతములో చెప్పబడింది.

పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం
ధానుండై మరచెన్ సురారిసుతుడేతద్విశ్వమున్ ! భూవరా !

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥(గీత:18-65)

ఓ అర్జునా ! నీవు నాయందే మనసు లగ్నము చేయుము.నా

భక్తుడవు కమ్ము, నన్ను పూజింపుము, నాకు నమస్కరింపుము. ఇట్లు చేయుటచే నీవు నన్నే పొందుదువు. ఇది సత్యమని ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఏలయన, నీవు నాకు అత్యంత ప్రియమైనవాడవు.

10. యః శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారతః ।
న స సిద్ధి మవాప్నోతి నసుఖం నపరాంగతిమ్ ॥

తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి ॥
(గీత : 16- 23,24)

ఎవడు శాస్త్రవిధిని విడచి తన ఇచ్ఛానుసారము వర్తించునో, వానికి సిద్ధిలేదు. సుఖము లేదు. పరమగతియూ లేదు.

ఇందువలన నీకు కార్యాకార్య నిర్ణయమునందు శాస్త్రమే ప్రమాణం అని గ్రహించి, నీవు శాస్త్రవిధిచే నియతకర్మల చేయ యోగ్యుడవుకమ్ము.

11. భగవద్గీత మనలను తపస్సు చేయటానికి హిమాలయాలకు వెళ్ళమనటం లేదు. మన ఇంటిలో, కార్యాలయాలలో ఉంటూనే తపస్సు చేసే విధానం చెప్పింది.

"దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్య మహింసాచ శారీరం తప ఉచ్యతే ॥" (గీత : 17-14)

దేవతల, బ్రాహ్మణుల, గురువుల, జ్ఞానుల పూజించుట, పవిత్రత సరళత్వమూ, బ్రహ్మచర్యమూ మరియూ అహింసా అనునవి శారీర తపస్సు అని చెప్పింది. "మాతృదేవో భవ, పితృదేవో భవ, గురుదేవో భవ, అతిథి దేవో భవ" ఈ దేవుళ్ళను పూజించండి, ఆరాధించండి.

ధర్మవ్యాధుడు తల్లితండ్రులను పూజించి, కౌశికునకు కూడా గురువైనాడు అని మనం తెలుసుకున్నాం.

వచ్చిన ఖాతాదారులను (customers) దైవభావంతో, గురు భావంతో ఆదరించితే, వ్యాపారం కూడా అభివృద్ధి చెందుతుంది అనేది నా అనుభవం. ఇతరులను నొప్పించకుండటమే అహింస.

"అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥" (గీత: 17-15)

ఇతరులకు ఉద్వేగము కలిగించకుండునట్టిదై, సత్యమై, ప్రియమై, హితమై యున్న పలుకులు, మరియూ వేద, శాస్త్రముల అధ్యయనమూ వాచిక తపస్సుగా చెప్పబతాయి. ఈ శ్లోకాన్ని పూర్తిగా అర్థంచేసుకొని ఆచరణలో పెడితే ఇతరులతో వివాదములు రావు అని స్వానుభవము.

"మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।
భావ సంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥" (గీత: 17-16)

మనస్సు యొక్క ప్రసన్నత, శాంతభావము, భగవచ్చింతనచేయు స్వభావమూ, మనోనిగ్రహమూ, అంతఃకరణ భావములందు పవిత్రతా మానసిక తపమని చెప్పబడును.

"భావశుద్ధియే జ్ఞానసిద్ధి" అని శ్రీమళయాళ స్వాములవారు చెపుతూ ఉండేవారు.

12. అమ్మ "సర్వం దైవం చేస్తున్నాడనుకోవటమే" అనీ, "జరిగే ప్రతిదీ దైవం చేయిస్తున్నాడు అనుకోవటమే మనస్సుకు స్థిమితం కలగటానికి మార్గం" అనీ అన్నారు.

"అనుకున్నది జరగదు, తనకున్నది తప్పదు" అని చెప్పారు అమ్మ. కనుక "తమేవ శరణం గచ్ఛ సర్వభావేన" (గీత : 18-62). నీవు అన్ని విధములా ఆ పరమాత్మను శరణు పొందుము.

ఈ భావములను పదే పదే మననం చేస్తూ ఆచరణలోనికి తీసుకొనివచ్చేందుకు ప్రయత్నం చేస్తే, చిత్తశుద్ధి లభించి, భగవత్ప్రాప్తి కలుగుతుంది.

13. ప్రహ్లాదుడు, నృసింహస్వామితో నీతో సమానం అవ్వాలంటే కామమును విడచి పెట్టాలి అంటాడు.

"కామంబుల విడిన పురుషుండు నీతోడ సమానవిభవుండగు" అని అన్నాడు.

14. ఆర్త జనుల కష్టాలు తొలగించినప్పుడు, వాళ్ళ కళ్ళలో కలిగే ఆనందాన్ని చూసినప్పుడు మనకు కలిగే "తృప్తే ముక్తి" అన్నారు అమ్మ. భగవద్గీత కూడా "ఆత్మన్యేవాత్మనా తుష్టః" (గీత : 2-55) ఆత్మద్వారా ఆత్మయందే సంతృప్తి ఎవడు కలిగి ఉంటాడో అతనిని స్థితప్రజ్ఞుడుగా చెబుతున్నది.

15. భగవంతుడు తాను స్వయంగా "జ్ఞాన భక్తుడు తానే" నన్నాడు.

"ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వా త్మైవ మే మతమ్ ।
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥"

ఈ భక్తులందరునూ ఉదారులే, అయితే వీరిలో జ్ఞానినయగు నతడు సాక్షాత్తూ నా స్వరూపమే, ఇది నా మతము. ఎందుకనగా నాయందే మనో బుద్ధ్యాదులు నిలిపియుంచు జ్ఞానియైన భక్తుడు అత్యుత్తమ గతియగు నాయందే చక్కగా స్థిరముగా నిలచియుండును.

లలితా సహస్రనామములుకూడా అమ్మ లభ్యమవ్వాలంటే రెండు మార్గాలనందించాయి.

1. 'పుణ్యాలభ్యా' : అమ్మ పుణ్యం వలన లభిస్తుంది. పుణ్యం అంటే పరోపకారం. " నాదర్శనమే పుణ్యం" అన్నారు అమ్మ. మహాత్ముల దర్శనం పుణ్యమే కదా !

2. 'మైత్ర్యాది వాసనాలభ్యా' : స్నేహం, దయ, సంతోషం మరియు ఉపేక్ష అనే నాలుగు విధానాలైన వాసనలచేత పొందదగింది. స్నేహితులతో మైత్రి, ఆర్తులయందు దయ, పుణ్యకర్మలు చేసేవారియందు సంతోషము, పాపులయందు ఉపేక్ష - ఈ వాసనలచే మనస్సు పరిశుద్ధమై, దేవి అనుగ్రహానికి పాత్రులు అవుతారు.

పైన చెప్పిన సాధనక్రమాన్ని మానవుడు త్రికరణశుద్ధిగా ఆచరించితే మాధవుడవుతాడని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఐతే - సామాన్యుని దృష్టిలో ఉంచుకొని అమ్మ సులభమైన తరణోపాయాన్ని సూచించడమే కాక, తన ఆచరణద్వారా అందించారు. మంచి చెడుల ప్రమేయం లేకుండా మనందరినీ తన బిడ్డలుగా ప్రేమించి, ఆదరించి, అవ్యాజమైన ప్రేమను, అవధులు లేని వాత్సల్యాన్ని మనపై కురిపించి, మనం ఇతరుల పట్ల ఎలా స్పందించాలో పరోక్షంగా మనకు నేర్పారు. ఆ స్పందన నిరంతరం కొనసాగితే మనందరమూ 'అమ్మ'గా మారతాం.

జయహో మాతా ! శ్రీ అనసూయా !
రాజరాజేశ్వరి ! శ్రీ పరాత్పరి !

ఓం తత్ సత్.



మానవాళికి అమ్మ సూచించే క్రొత్త దారి



★ "పదిమందితో కలిసి పని చేయడం, పదిమంది కోసం పనిచేయడం. మమకారాన్ని చంపుకోవటం కాక, పెంచుకోవటం. పరిమితమైన ప్రేమను విస్తృతం చేసుకోవటం నేటి మానవ ధర్మం. ఇదే నేను అనుకుంటున్నాను. ఇదే మానవుడు మాధవుడుగా మారటానికి మంచిదారి....."

★ "నీ ఉద్యోగంలో నీవు నీతి, నిజాయితీతో ఉండటమే నీ ధర్మం. దాన్ని సక్రమంగా పాటిస్తే మరింకేమి అవసరం లేదు."

★ "ఇతరులను ఎగతాళి చేసేవాడికి ఏమీ రాదు."

★ "జరిగే ప్రతీదీ దైవం చేస్తున్నాడనుకోవడమే మనస్సుకు స్థిమితం కలగడానికి మార్గం."

★ "సుఖానికి మార్గం ఒక్కటే - ఏది చేసినా దైవం చేస్తున్నాడనుకోవడమే. సుఖం ఎక్కడ ఉంది అంటే తృప్తిలో ఉంది."

అమ్మ నామం :

జయహో మాతా ! శ్రీ అనసూయా !!

రాజరాజేశ్వరి ! శ్రీ పరాత్పరి !!